www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 269 | గురువారం 22-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

స్వచ్ఛనీరు కరవు



- 30 కోట్ల మందికి ఆ యోగమే లేదు
- నానాటికీ నీటి కొరత
- పర్యావరణ కాలుష్యమే కారణం
- నేడు ప్రపంచ నీటి దినోత్సవం

న్యూఢిల్లీ : భారతదేశంలో దాదాపు 30 కోట్లమంది ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలోనూ పరిస్థితి ఇదే...మన దేశంలో మంచినీరు అందించేందుకు గణనీయమైన కృషి జరిగినప్పటికీ వాతావరణకాలుష్యం, రుతువులు మారిపోవడం, జీవనదుల ప్రవాహాలు తగ్గిపోవడం, భూగర్భజలాలు అడుగంటిపోవడం తదితర కారణాలవల్ల ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు సక్రమంగా లభించడంలేదు. గురువారం 'ప్రపంచనీటి' దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. నీటి కొరత అధిగమించేందుకు ఆయా దేశాల ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. భారతదేశంలో గత సంవత్సరంకంటే నీటికొరతను ఎదుర్కొంటున్న ప్రజలు పెరిగారనీ ప్రపంచనీటి దినోత్సవం సందర్భంగా వెలువరించిన నివేదిక తెలియజేస్తోంది. పాకిస్తాన్‌లోనూ నీటికొరత అధికంగా ఉంది. అరగంటలోపు నీటిని తెచ్చుకునే సదుపాయంలేని ప్రాంతాలన్నింటినీ సక్రమంగా నీరు పొందని ప్రాంతాలుగానే పరిగణిస్తున్నారని ఆ నివేదిక పేర్కొంది. 2022నాటికి మన దేశంలోని గ్రామీణ ప్రజలందరికీ స్వచ్ఛమైననీరు అందించాలన్న కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం కష్టమేనని నీటికొరతను ఎదుర్కొంటున్న ప్రజలు అధికంకావడం స్పష్టం చేస్తున్నది. 2020నాటికి గ్రామీణ ప్రజలకు కూడా పైపుల ద్వారా నీరు సరఫరా చేయాలన్న లక్ష్యంలో కనీసం 90శాతం అయినా నెరవేర్చాలని గత నవంబరులో ప్రభుత్వం

- మిగతా 2 లో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, జేవీఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వరరావు

ఒక్కటై కదలండి !

కేంద్రం కూసాలు కదిలేలా 'హైవేల దిగ్బంధం'

- ప్రభుత్వం కూడా సహకరించాలి
- విద్యార్థుల పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వం
- ప్రత్యేక హోదాను వ్యతిరేకించే బీజేపీని వెలివేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మనదంతా ఒకటే వాయిస్ కావాలి. ఆ విషయం కేంద్రానికి తెలిసేలా, వారి కూసాలు కదిలేలా ఉద్యమించాలి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా విభజనాంశాల అమలుకోసం జరిగే జాతీయ రహదారుల దిగ్బంధనం కార్యక్రమానికి పార్టీల కతీతంగా ప్రజలంతా ఉప్పెనలా తరలిరావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

- మిగతా 2 లో

జనసేన మద్దతు 12లో

బ్యాంకులకు కనిష్క్ కుచ్చుటోపీ

రూ.800కోట్లకు పైగా రుణాలు ఎగ్గొట్టిన మరో ఆభరణాల సంస్థ



చెన్నై : భారీగా రుణాలు తీసుకొని ఎగవేసిన గీతాంజలి గొలుసుకట్టు ఆభరణాల సంస్థ కేసు ఓ కొలిక్కి రాకముందే ఇప్పుడు మరో ఆభరణాల సంస్థ బండారం వెలుగులోకి వచ్చింది. కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సహా మరో 14 బ్యాంకులకు దాదాపు రూ.824.15కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టింది. దీనిపై సీబీఐకి ఎస్‌బీఐ ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చెన్నైలోని కనిష్క్ గోల్డ్ దుకాణం డైరెక్టర్స్ భూపేష్‌కుమార్, ఆయన భార్య నీతా జైన్‌పై సీబీఐకి ఎస్‌బీఐ ఫిర్యాదు చేసింది. ఎస్‌బీఐతో పాటు 14 కన్సార్టియం బ్యాంకుల వద్ద నుంచి కనిష్క్ జ్యూయలరీ దాదాపు రూ.800కోట్లకు పైగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టింది. రాత్రికి

- మిగతా 2 లో

పార్లమెంట్‌లో అదే తంతు

- ఆగని వాయిదాల పర్వం
- చర్చకురాని అవిశ్వాసం
- కొనసాగిన గందరగోళం



విశాలాంధ్రబ్యూరో-న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా పదమూడో రోజు బుధవారం కూడా ఎటువంటి కార్యకలాపాలను చేపట్టకుండానే వాయిదా పడ్డాయి. ఏఐఏడీఎంకే, టీఆర్ఎస్ వంటి కొన్ని పార్టీల సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే లోక్‌సభ వాయిదాపడింది. ప్రభుత్వంపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసును వరుసగా నాలుగవ రోజైన ఈ రోజు కూడా చేపట్టలేదు. రాజ్యసభ కూడా ఎటువంటి కార్యకలాపాలను చేపట్టకుండానే సమావేశమైన నాలుగు నిముషాలకే వాయిదాపడింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సభ్యుల నిరసనల నేపథ్యంలో లోక్‌సభ మధ్యాహ్నం వరకు, ఆ తరువాత రేపటికి వాయిదాపడింది. రాజ్యసభ సమావేశమైన వెంటనే టీడీపీ, కాంగ్రెస్ సభ్యులు వెల్‌వద్దకు దూసుకువచ్చి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. దానితో ఛైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు సభ ప్రారంభమైన నాలుగు నిముషాలకు రేపటికి వాయిదా వేశారు. ఎజెండాను సభ ముందు ఉంచకముందే డీఎంకే, ఏఐడీఎంకే సభ్యులు కూడా వెల్ వద్దకు దూసుకువచ్చి కావేరి జలనిర్వహణ బోర్డును తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూడా వెల్ వద్దకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గులాం నబీ ఆజాద్ ఎస్‌సీ, ఎస్‌టీల దాడులకు వ్యతిరేకంగా అలాగే ఇరాక్‌లో అపహరణకు గురైన 39 మంది భారతీయుల హత్యకు సంబంధించి విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటనపై చర్చ జరగాలని డిమాండు చేశారు. సుష్మా స్వరాజ్ గత ఏడాది ఏమి చెప్పారు, నిన్న ఏమి చెప్పారనే దానిపై చర్చ జరగాలని అన్నారు. ఇందుకు సంబంధించి తగిన నోటీసు ఇవ్వాలని ఆజాద్‌కు వెంకయ్యనాయుడు సూచించారు. సభ సజావుగా సాగడానికి సహకరించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. మీ సీట్లకు తిరిగి వెళ్లి అంశాలను లేవనెత్తాలని సూచించారు. సభ్యులు వారి సీట్ల నుంచి అంశాలను లేవనెత్తేందుకు తాను అనుమతిస్తానని, నినాదాలు చేయవద్దని కోరారు. లోక్‌సభ ప్రారంభమైన నాలుగు నిముషాలకే గంటపాటు వాయిదాపడింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సభ్యులు నిరసన తెలపడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదావేశారు. మధ్యాహ్నం తిరిగి సమావేశమైన తరువాత ఏఐఏడీఎంకే, టీడీపీ, టీఆర్ఎస్ సభ్యులు వెల్ వద్దకు దూసుకువచ్చి ప్లకార్డులను చేబూని నినాదాలు చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి

- మిగతా 2 లో

ఏపీకి 15, తెలంగాణకు 16 టీఎంసీలు

- సాగర్ జలాలపై 70 రోజుల ప్రణాళికను ప్రకటించిన కేఆర్ఎంబీ
- శ్రీశైలం నుంచి 2 టీఎంసీల విడుదలకూ ఓకే
- బోర్డు ఆదేశాలు తప్పక పాటించాలని హుకుం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాబోయే వేసవిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో నీటి ఎద్దడి దృష్ట్యా కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 70 రోజుల ప్రణాళికను ప్రకటించింది. ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖలకు చెందిన అధికారులతో సంప్రదింపుల అనంతరం హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి త్రిసభ్య కమిటీ సమావేశమైంది. బోర్డు సభ్య కార్యదర్శి ఎ పరమేశం నేతృత్వంలో ఏపీ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఎం వెంకటేశ్వరరావు, తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధరరావు భేటీలో పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల విజ్ఞప్తులు, డిమాండ్లను పరిశీలించిన ఈ కమిటీ ప్రకటించిన ప్రణాళిక ఈనెల 20వ తేదీ నుంచి మే 31 వ తేదీ వరకూ వర్తిస్తుంది. దీని ప్రకారం శ్రీశైలం జలాశయం నుంచి ఒక టీఎంసీ నీటిని తెలంగాణలోని కల్వకుర్తి కోసం, అలాగే ఒక టీఎంసీ నీటిని ఏపీలోని హంద్రీ-నీవా సుజల స్రవంతితోపాటు ముచ్చుమర్రి పథకం కోసం వాడుకోవడానికి బోర్డు అంగీకరించింది. ఇక

- మిగతా 2 లో

ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీం తీర్పు సమీక్షించాలి

దళితులపై పెరుగుతున్న దాడులు : కాంగ్రెస్

9లో

పెరియార్ విగ్రహ ధ్వంసం కేసులో

సీఆర్పీఎఫ్ జవాను, కానిస్టేబుల్ అరెస్టు

ఇదీ లోకం!



ఉద్యోగాల కల్పన హామీ ఒట్టిదే

మంత్రి జితేంద్ర సింగ్

9లో

రాష్ట్రానికి ఆస్తి సాధికార మిత్రలు



సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-అమరావతి : దేశంలో ఏ రాష్ట్రానికి లేనటువంటి ఆస్తి సాధికార మిత్రలని, 35 కుటుంబాలకు ఒక సాధికార మిత్రలు చొప్పున రాష్ట్రంలో 4 లక్షల 70 వేల మంది సాధికార మిత్రలు పనిచేస్తున్నారన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. బుధవారం ఉండవల్లి నివాసంలో సాధికార మిత్రలతో సీఎం ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో, వార్డుల్లో సాధికార మిత్రల పనితీరు సత్ఫలితాలను ఇస్తాయనే నమ్మకం కలుగుతోందన్నారు. వ్యక్తులుగా ఉంటే ఒక

- మిగతా 2 లో



11 మంది గోరక్షకులకు యావజ్జీవం

అన్సారీ హత్య కేసులో సంచలన తీర్పు

దేశంలోనే ఇది తొలిసారి

రామ్‌గఢ్ : జార్ఖండ్‌లో సంచలనం సృష్టించిన అలీముద్దీన్ అన్సారీ హత్య కేసులో 11 మందికి రామ్‌గఢ్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు యావజ్జీవ కారాగారవాస శిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. మృతుడు అన్సారీకి తగిన నష్టపరిహారం ఇచ్చేందుకు డిస్ట్రిక్ సర్వీసెస్ లీగల్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) చర్యలు తీసుకోవాలని కూడా కోర్టు ఆదేశించింది. గత ఏడాది జూన్‌లో అన్సారీ హత్య జరుగగా, ఈ నెల 16న ఈకేసులో 12 మందిని దోషులుగా కోర్టు నిర్ధారించింది. అయితే శిక్షపై ఇరువర్గాల వాదనలు విన్న అడిషనల్ జడ్జి ఓం ప్రకాష్ 11 మందికి యావజ్జీవ ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

అలీముద్దీన్ అన్సారీ తన వ్యానులో

- మిగతా 2 లో

న్యాయం దూరం..

లక్ష దాటిన బాలికలపై లైంగికదాడి కేసులు



- కేవలం 229 కేసుల్లోనే తీర్పు
- 2016లో 30వేలకుపైగా కొత్త కేసులు నమోదు
- సమాచారాన్ని సేకరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : రోజు రోజుకీ దేశవ్యాప్తంగా బాలికలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయి. దానికి తోడు కేసుల విచారణలో జాప్యం పెరుగుతోంది. 2016లో బాలికలపై లైంగికదాడులకు పాల్పడ్డ కేసులు దాదాపు లక్షకు చేరుకున్నాయి. అయితే ఆ ఏడాది ట్రయల్ కోర్టు తీర్పుకు నోచుకున్న కేసులు 229 మాత్రమే. ఈ మేరకు సమాచారం చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని న్యాయమూర్తులు ఎ ఎం ఖాన్ విల్కార్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం దృష్టికి వచ్చింది. లైంగికదాడుల్లో బాలికలు బాధితులుగా ఉండి, కఠినమైన పోక్సో(ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రెన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్) చట్టం కింద నమోదై, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సేకరించి నాలుగు వారాల్లోగా అందజేయాలని దేశవ్యాప్త హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌ను ధర్మాసనం ఇటీవల ఆదేశించింది. పోక్సో చట్టం ప్రకారం.. బాలికలపై లైంగికదాడులకు పాల్పడిన కేసుల చార్జ్‌షీట్.. ట్రయల్ కోర్టు దృష్టికి వచ్చాక ఏడాది కాలంలో తుదితీర్పు వెలువరించాలి. ఎనిమిది నెలల బాలికపై ఆమె బంధువు లైంగికదాడికి పాల్పడిన కేసులో న్యాయవాది అలాక్ అలోక్ శ్రీవాస్తవ సుప్రీంకోర్టులో

- మిగతా 2 లో

గయూమ్, న్యాయమూర్తులపై టెర్రరిజం అభియోగాలు



మాలె : మాల్దీవుల మాలె అధ్యక్షుడు నియంతగా పేరుబడసిన మమూన్ అబ్దుల్‌గయూమ్, 9 మంది ఉన్నతస్థాయి న్యాయమూర్తులపై కోర్టు టెర్రరిజం అభియోగాలు నమోదు చేసింది. గత నెలలో గయూమ్‌తో పాటు న్యాయమూర్తులను ప్రస్తుత ప్రభుత్వం అరెస్టు చేసింది. బుధవారం వీరిపై కోర్టులో అభియోగాలు నమోదు చేశారు. గయూమ్‌తో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్, న్యాయమూర్తి అలీ హమీద్, గయూమ్ కుమారుడితో సహా నలుగురు చట్టసభ సభ్యులు మాజీ పోలీసు కమిషనర్ ఉన్నారు. వీరిని విచారించి శిక్ష విధించినట్లయితే 10 నుంచి 15 ఏళ్ల జైలు జీవితం అనుభవించవలసి రావచ్చునని భావిస్తున్నారు. దర్యాప్తు అధికారులకు వీరు తమ ఫోన్లను ఇవ్వడానికి నిరాకరించారని దీనిపై సందేహం వచ్చినట్టు చెప్తున్నారు. ప్రభుత్వాన్ని కూలదోసేందుకు న్యాయమూర్తులు సయీద్, హమీద్ మరో జ్యుడీషియల్ అధికారి ముడుపులు తీసుకున్నట్టుగా అభియోగాలు చేసినట్టు తెలిసింది. గత నెలలో వీరిని అరెస్టు చేసిన తరువాత 15 రోజులపాటు దేశంలో ఎమర్జన్సీ విధించారు.



ఉ. కొరియాలో ప్రభుత్వ మార్పే ట్రంప్ లక్ష్యం



సియోల్ : ఉత్తరకొరియాలో ప్రస్తుతంవున్న వర్కర్స్ పార్టీ ప్రభుత్వాన్ని తొలగించి ఆ దేశాన్ని ఇతర పెట్టుబడీదారీ వ్యవస్థలున్న ప్రపంచంతో అనుసంధానం చేయడమే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లక్ష్యమని బ్రియన్‌బెకర్ అనే అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేశారు. లిబరేషన్ అనే పత్రికలో ఆయన రాసిన వ్యాసంలో ఈ అంచనా వేశారు. ట్రంప్, కొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌ల మధ్య భేటీ జరుగుతుందా? లేదా? అన్న అంశంపై కూడా సందేహం వ్యక్తం చేశారు. కిమ్ కోరినట్టుగా అమెరికా ఉత్తరకొరియాకు భద్రతా హామీ ఇవ్వకపోవచ్చునని కేవలం ఆ దేశంతో సాధారణ సంబంధాలు ఏర్పరచుకోవడమే జరగ వచ్చునని బెకర్ విశ్లేషించారు. తమకు భద్రతా హామీని అమెరికా ఇస్తుందన్న భ్రమలు కూడా ఉత్తరకొరియాకు లేవని ఆయన వివరించారు. పరిస్థితులన్నీ చక్కగావుంటే కిమ్ ప్రభుత్వాన్ని తొలగించటమే అమెరికా లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో సోషలిస్టు దేశాలతో సాధారణ సంబంధాలను నెలకొల్పుకోవడం ద్వారా అక్కడి ప్రభుత్వాలను అస్థిరీకరించడం లేదా వాటిని తొలగించడం సామ్రాజ్యవాదులు అనుసరించిన పద్ధతి అని ఆ అనుభవాలే నేటికీ ఉపయోగపడతా యని ఆయన పేర్కొన్నారు. పూర్వపు సోవియట్ యూనియన్‌తోను, క్యూబా తదితర సోషలిస్టు దేశాలతో అమెరికా సాధారణ సంబంధాలను నెలకొల్పుకున్న తరువాతనే అక్కడి ప్రభుత్వాలను మార్చేందుకు ప్రయత్నించి కొన్నింటిలో సఫలమ య్యింది. 1970లలో చైనాతో ఆనాటి అమెరికా అధ్యక్షుడు పచ్చి మితవాది నిక్సన్ కూడా సాధారణ సంబంధాలు నెలకొల్పుకునేందుకే ప్రాధాన్యత నిచ్చారు. ఇప్పుడు ట్రంప్ కూడా కిమ్‌తో జరిపే భేటీ వెనుక లక్ష్యం ఇదే ఉండవచ్చునని ఆయన తెలిపారు. ఉత్తరకొరియాతో సంబంధాల విషయంలో ట్రంప్ ఒక్కసారిగా తన వైఖరిని మార్చుకోవడంపై అమెరికాలో మితవాద పాలకవర్గం కూడా కొంత ఆశ్చర్యపోయింది. ట్రంప్ వైఖరి మార్చుకోవద్దని ఈ వర్గం వత్తిడి కూడా చేసింది. సోషలిస్టు దేశాలపట్ల సోషలిస్టుల విధానం వేరుగాను అలాగే సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో సాధారణ సంబంధాల విషయంలో వేరుగాను ఉండాలని బెకర్ అభిప్రాయపడ్డారు. ప్రతీఘాతశక్తులను గట్టిగా ప్రతిఘటించాలని ఆయన సూచించారు.

ట్రక్కు ప్రమాదంలో 5గురు మృతి

పెషావర్ : పాకిస్తాన్‌లో జరిగిన ట్రక్కు ప్రమాదంలో 5గురు చనిపోగా 13మంది గాయపడ్డారు. పర్వత ప్రాంతాల్లో ప్రయాణిస్తున్న ట్రక్కు గోతిలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. షాంగ్లా జిల్లాలోని షరోనో పర్వతాల్లో మంగళవారం ఈ ప్రమాదం జరిగిందని వాహనంపై డ్రైవరు అదుపు కోల్పోవడంతో అది గోతిలో పడిపోయిందని పోలీసులు చెప్పారు. పోలీసులు స్థానిక ప్రజల సహాయంతో మృతదేహాలను వెలికితీసి గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. అల్పురి ఆసుపత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగావున్న వారిని స్వేత్ ఆసుపత్రికి తరలించారు.

కాబూల్ ఆత్మాహుతి దాడిలో 26 మంది మృతి



కాబూల్ : అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో ఆత్మాహుతి బాంబుదాడి జరిగి 26 మంది మృతిచెందగా 18 మంది గాయపడ్డారు. బుధవారం షియా మసీదుకు వెళ్ళే రహదారిపైన ఈ దాడి జరిగింది. పర్షియన్ నూతన సంవత్సర వేడుకలను జరుపుకుంటున్న ప్రజలపైన ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. కాలినడకన వచ్చిన వ్యక్తి ఆత్మాహుతిదాడి జరిపినట్టు ఆంతరంగిక మంత్రిత్వశాఖ ప్రతినిధి నస్రత్‌రహీమి తెలిపారు. కాబూలీ యూనివర్శిటీ, ప్రభుత్వ ఆసుపత్రులకు దగ్గరలో ఈ దాడి జరిగింది. పర్షియన్ నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం జాతీయ సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో మైనారిటీలుగావున్న షియా ముస్లింలు మసీదుల కువెళ్లి ప్రార్థనలు జరుపుతారు. బాంబుదాడికి కారకులెవరైందీ ఇంతవరకు ఎవరూ ప్రకటించలేదు. ఈ దాడితో తమకు సంబంధం లేదని తాలిబన్లు ప్రకటించారు.



త్వరలో పుతిన్‌తో ట్రంప్ భేటీ

వాషింగ్టన్ : రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌ను తాను త్వరలోనే కలుసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. రెండు దేశాల మధ్య ఆయుధ పోటీపై చర్చలు జరిపేందుకే కలవనున్నట్టు ఆయన వెల్లడించారు. ఉక్రెయిన్, ఉత్తరకొరియా, సిరియా సమస్యలపైన పుతిన్‌తో మాట్లాడతానని ట్రంప్ తెలియజేశారు. ఆయుధపోటీ నియంత్రణలేకుండా పెరిగిపోతున్నదని, మాకంటే మరెవరివద్ద అధికంగా ఉంటానికి అంగీకరించేదిలేదని ట్రంప్ పేర్కొన్నారు. పుతిన్ తాజాగా అధ్యక్షుడుగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన తరువాత ట్రంప్ ఆయనకు ఫోన్‌చేసి అభినందనలు తెలియజేశారు. ట్రంప్ పుతిన్‌కు ఫోన్ చేసినట్టుగా క్రెమ్లిన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయుధ నియంత్రణ, వ్యూహాత్మక సుస్థిరతపై సన్నిహిత సహకారం, టెర్రరిజంపై పోరాటం తదితర అంశాలు ఇరువురినేతల సంభాషణల్లో చోటు చేసుకున్నాయని ఆ ప్రకటనలో క్రెమ్లిన్ పేర్కొంది. ఉక్రెయిన్ సంక్షోభాన్ని అలాగే సిరియాలో అంతర్యుద్ధాన్ని కూడా ఇరువురు నేతల మధ్య జరిగే సమావేశంలో చర్చకు రానున్నాయి. ట్రంప్ పాలనాకాలంలో అమెరికాతో మెరుగైన సంబంధాలు ఏర్పడగలవన్న ఆశాభావాన్ని పుతిన్ వెలిబుచ్చారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగడంకంటే స్నేహసంబంధాలు ఏర్పడటం మంచిదన్న భావనలో పుతిన్ ఉన్నారు.

విభజించి గెలవాలనుకోవద్దు

బ్రిటన్ ప్రధాని థెరిసాకు ఈయూ హెచ్చరిక



బ్రెస్సెల్స్ : విభజించి గెలవాలని భావించవద్దని బ్రిటన్ ప్రధాని థెరిసామేను యూరోపియన్ యూనియన్ (ఈయూ) హెచ్చరించింది. ఈయూలోని 27 దేశాలు కలిసికట్టుగా ఉంటాయని ఈయూ కమిషన్‌ను అడ్డుపెట్టుకుని కొన్ని దేశాలను తమకు అనుకూలంగా మలచుకోవద్దని హెచ్చరించింది. ప్రధాని, ఆమె మంత్రులు ఇలాంటి ప్రయత్నాలు చేయవద్దని బ్రెగ్జిట్‌పై కీలకమైన చర్చలు జరపవలసిన సమయం ఆసన్నమైందని ఈ దశలో ఇలాంటి ప్రయత్నాలు జరిగితే అది బ్రిటన్‌కే నష్టం చేస్తుందని ఈయూ హెచ్చరించింది. ఈయూలో ఉన్న 27 దేశాలకు విభిన్నమైన ప్రాధాన్యతలుంటాయి. అయినప్పటికీ ఆయా దేశాల ప్రభుత్వాలు, వాణిజ్య లాబీ వర్గాలు సింగిల్ మార్కెట్ విషయంలో మాత్రం సమైక్యంగావుండి దానికి ప్రాధాన్యతనిస్తాయని ఈయూ తెలిపింది. ఆయా దేశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జాగరూకతతో బ్రిటన్ చర్చలు నిర్వహించాలని ఈయూ కోరింది. అనేకమంది మంత్రులు 2017 వసంతకాలంలో అనేక దేశాలలో పర్యటించి యూరోపియన్ కమిషన్‌ను ఖాతరుచేయకుండా సభ్యదేశాలను ప్రభావితంచేసి విభజించి గెలిచేందుకు ప్రయత్నం చేశారు. బ్రెగ్జిట్ రెండవదశ చర్చలలోను ఇలాంటి వైఖరి అనుసరిస్తే అది బ్రిటన్‌కు హాని కలుగజేస్తుంది. పరివర్తన దశ చర్చలతో పాటు బ్రెగ్జిట్ చర్చలను జరిపేందుకు ఈయూ సిద్ధంగావుంది. పరివర్తన దశపై ఒప్పందం కుదిరిన తరువాత వాణిజ్యంపై చర్చలు జరుగుతాయని ఈయూ పేర్కొంది. తుది ఒప్పందం యూరోపియన్ కౌన్సిల్‌లో అత్యధిక సభ్యులు ఆమోదం తరువాతనే ప్రకటించడం జరుగుతుంది.

మైన్మార్ అధ్యక్షుడు హతిన్‌క్యా రాజీనామా



యాంగాన్ : మైన్మార్ అధ్యక్షుడు హతిన్‌క్యా బుధవారం ఆకస్మికంగా రాజీనామా చేశారు. ప్రభుత్వ నిర్వహణలో అత్యంత ముఖ్యపాత్ర నిర్వహిస్తున్న అంగ్‌సాన్‌సూకీ అధ్యక్షుడితో సన్నిహితంగా ఉన్నప్పటికీ ఆమెకు కూడా తెలియకుండానే రాజీనామా చేసినట్టు వార్తలు వచ్చాయి. రఖిన్ రాష్ట్రంలో రొహింగ్యా ముస్లింలపై సైన్యం హింసాకాండకు పాల్పడటంతో 10 లక్షలమందికిపైగా ప్రజలు బంగ్లాదేశ్‌కు వలసవెళ్లిన నేపథ్యంలో అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలోనే అధ్యక్షుడు రాజీనామా చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. సూకీతోపాటు క్యా కూడా స్కూల్లో చదువుకున్నారు. దేశ సైన్యం రూపొందించిన రాజ్యాంగం ప్రకారం సూకీ అధ్యక్ష బాధ్యతలను చేపట్టడానికి వీలులేకపోవడంతో హతిన్‌క్యా అధ్యక్షుడుగా ఎంపికయ్యారు. అయినప్పటికీ సూకీ అన్ని బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అధ్యక్షుడి పదవి అలంకారప్రాయంగానే ఉన్నది. 72 ఏళ్ల క్యా అనారోగ్యంతో ఉన్నారని కొన్ని నెలలుగా వదంతులు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆయన గణనీయంగా బరువును కోల్పోయారని, గుండెకు సంబంధించిన ఆరోగ్య సమస్యలున్నాయని తెలుస్తోంది. తన రాజీనామా లేఖను అధ్యక్షుడు అధికార ఫేస్‌బుక్ పేజీలో పెట్టారు. ఇంతకుమించిన వివరాలను అధ్యక్షుడు కార్యాలయం వెలువరించలేదు. వారం రోజుల్లో నూతన అధ్యక్షుడిని ఎంపిక చేయనున్నారు.

స్వచ్ఛనీరు కరవు

(మొదటిపేజీ తరువాయి)

జరిపిన సమీక్షలో నిర్ణయించారు. దేశంలో అత్యధిక ప్రజలకు నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, కాలుష్యం వలన అదంతా స్వచ్ఛమైన నీరుగా చెప్పడానికి వీలులేదు. 2000 సంవత్సరం నాటినుండి స్వచ్ఛమైన నీరులభించే ప్రజలసంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ప్రస్తుతం దాదాపు అమెరికా జనాభాతో సమానంగా అంటే 30 కోట్లమందికి స్వచ్ఛనీరు అందడంలేదని వాటర్ ఎయిడ్ నివేదిక-2018 పేర్కొంది. 2030 నాటికి ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆయా దేశాలు వివిధ రంగాలలో సాధించవలసిన లక్ష్యాలను సమీక్షించుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 60శాతం మంది ప్రజలు నీటికొరతను ఎదుర్కొంటున్నారు. ఉగాండా,నైగర్,మొజాంబిక్,పపువా న్యూగినియా,ఎరిట్రియా తదితర అనేక దేశాలలో కేవలం 38శాతం ప్రజలు మాత్రమే స్వచ్ఛమైన నీటిని పొందగలుగుతున్నారు. దక్షిణాఫ్రికాలోని అతిపెద్ద వాణిజ్య నగరం కేప్‌టౌన్‌లో తీవ్ర నీటికొరత ఏర్పడి కుటుంబానికి రోజుకు 25లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగాఉందో అర్థమవుతోంది.

పార్లమెంట్‌లో అదే తంతు

(మొదటిపేజీ తరువాయి)

అనంత్‌కుమార్ ఎజెండా పేపర్లను సభ ముందు ఉంచారు. సభా కార్యక్రమాలను చేపట్టేందుకు సభ్యులు తమ సీట్లలోకి వెళ్లి కూర్చోవాలని స్పీకర్ సూచించారు. అవిశ్వాస తీర్మానంతో సహా ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని అనంత్‌కుమార్ చెప్పారు. "సభ అదేవిధంగా యావత్ దేశం పట్ల మాకు విశ్వాసం వుంది" అని అన్నారు. అయినా సభ్యులు నినాదాలు ఆపకపోవడంతో సభ ఆర్డరులో లేదని వాయిదా వేస్తున్నానని స్పీకర్ ప్రకటించారు.

న్యాయం దూరం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. 2016 నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) రిపోర్టును ఉటంకిస్తూ..పోక్సో చట్టం కింద మొత్తం 1,01,326 కేసులు నమోదు కాగా అందులో కేవలం 229 కేసులు మాత్రమే తీర్పును పొందాయని పిల్‌లో పేర్కొన్నారు. ఇందులో 70,435 పోక్సో కేసులు 2015నుంచి కొనసాగుతుండగా 2016లో కొత్తగా 30, 891 కేసులు ట్రయల్ కోర్టుకు వచ్చాయని, దీంతో 2016లో మొత్తం పెండింగ్‌లో ఉన్న పోక్సో కేసులు లక్షకు చేరుకున్నాయని తెలిపారు. 12 ఏండ్ల లోపు బాలికలు లైంగికదాడికి గురైన కేసుల దర్యాప్తు, కోర్టుల విచారణ ఆరు నెలల్లోగా పూర్తి చేసేలా పోక్సో చట్టాన్ని రూపొందించాలని ఆయన కోరారు. ఈ పిల్‌ను విచారిస్తూ..అన్ని విధాలుగా పరిశీలించి ఈ కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను తెలుసుకంటామని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ధర్మాసనం వివరించింది.

జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుల వివరాలను సేకరించేలా హైకోర్టు జనరల్స్‌కు సూచించాల్సిందిగా సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 20కు వాయిదా వేసింది.

ఒక్కటై కదలండి !

(మొదటిపేజీ తరువాయి)

కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావులు పిలుపునిచ్చారు. స్థానిక దాసరి భవన్‌లో బుధవారం ఉదయం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు జరుగుతున్నందున వారికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఉదయం 10 నుండి 12 గంటల వరకు మాత్రమే రహదారుల దిగ్బంధనం కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. అందువల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళనలకు గురికావద్దని కోరారు. అలాగే ప్రభుత్వం కూడా ఈకార్యక్రమం జయప్రదం కావడానికి సహకరించి మనదంతా 'ఒన్ వాయిస్' అనేలా కేంద్రానికి సంకేతానివ్వాలన్నారు. అలాగాకుండా ప్రభుత్వం ఏమాత్రం అత్యుత్సాహం ప్రదర్శించి కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించినా ప్రజల ఛీత్కారానికి గురికావల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. గత నెల ఫిబ్రవరి 8వ తేదీ నిర్వహించిన రాష్ట్ర బంద్ కార్యక్రమానికి ప్రత్యక్షంగా,పరోక్షంగా అందరూ సహకరించడంతో ప్రత్యేక హోదా ఉద్యమం జాతీయస్థాయిలో చర్చనీయాంశమైందని గుర్తు చేశారు. అదే తరహాలో మళ్ళీ గురువారం నాటి రాస్తారోకో కార్యక్రమానికి ప్రజలు తండోపతండాలుగా కదలిరావాలని పిలుపునిచ్చారు. విభజనాంశాల అమలుపై రాష్ట్రంలో ఉద్యమం తీవ్రమైన దగ్గర నుండి పార్లమెంటులో ఈ అంశాన్ని చర్చకు రానివ్వకుండా బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. చివరకు అవిశ్వాస తీర్మానం సైతం నాలుగు రోజులుగా చర్చకు రాకుండా అడ్డుకుంటున్నారని, ఇందుకోసం తెలంగాణా సీఎం కేసీఆర్ సైంధవ పాత్ర పోషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్రక్క తోటి తెలుగు రాష్ట్రానికి అన్నిరకాలా సహకరిస్తామని నంగనాచి మాటలు చెబుతూ, మరోప్రక్క అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా పార్లమెంటులో గందరగోళం సృష్టిస్తూ మోడీకి ఊడిగం చేసే స్థితికి దిగజారారని రామకృష్ణ విమర్శించారు. నిజంగా కేసీఆర్‌కు తోటి తెలుగువారి పట్ల ఏమాత్రం అభిమానం వున్నా అవిశ్వాస తీర్మానం చర్చకు సహకరించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఏపీ పట్ల బీజేపీ ప్రభుత్వం పూర్తి వివక్ష చూపుతోందన్నారు. రైల్వేజోన్ కోసం ఇక్కడ పెద్దఎత్తున ఉద్యమం చేస్తుంటే దానిపై స్పందించకపోగా, గతంలో నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ లాంటి పలు రైళ్ళను రద్దు చేసే సాహసానికి ఒడిగట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ప్రధాని మోడీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న టీడీపీ ఆరోపణలపై ప్రశ్నించగా అది కేవలం తెలుగుదేశం నేతలు కలవరపాటుకి గురికావడం తప్ప అందులో విషయం ఏమీ లేదన్నారు. బీజేపీ, కమ్యూనిస్టుపార్టీలు భిన్న ధృవాలని, మోడీ మాట వినేవారు కమ్యూనిస్టుపార్టీ ఆఫీస్‌కి రారని చెప్పారు. అలాగే మా మాట వినేవారు బీజేపీ దగ్గరకు వెళ్ళరని, ఇది సింపుల్ సూత్రమని తేల్చిచెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రత్యేక హోదా, విభజనాంశాల అమలు కోసం జరిగే ఉద్యమానికి దూరంగా వుంటున్న బీజేపీ శ్రేణులను వెలివేయాలని ప్రజలకు రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విభజనాంశాల అమలు, ప్రత్యేక హోదా సాధన పట్ల టీడీపీకి ఏమాత్రం చిత్తశుద్ధి వున్నా రహదారుల దిగ్బంధనం కార్యక్రమం జయప్రదానికి సహకరించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో ఘోరవైఫల్యం చెందిందని, అందుకే అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అడ్డుకుంటుందని విమర్శించారు. ఒక్క ఏపీ విభజనాంశాలే గాకుండా మోడీ వైఫల్యాలు అనేకం చర్చకు వచ్చే అవకాశం వుందని, అందుకే భయపడి చర్చకు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. కేంద్రం కళ్ళు తెరిపించేలా ఏపీ ప్రజలంతా సంఘటితంగా ఉద్యమించాలని కోరారు.

కనిష్క్ కుచ్చుటోపీ

(మొదటిపేజీ తరువాయి)

రాత్రే వాళ్ల దుకాణాలన్నింటినీ మూసివేసి, రికార్డులను కూడా మాయం చేసినట్లు ఎస్‌బీఐ సీబీఐకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. రుణం మొత్తానికి వడ్డీ కూడా కలుపుకొని మొత్తం రూ.1000కోట్ల మేర బ్యాంకులు నష్టపోయినట్లు తెలుస్తోంది. గతేడాది నవంబరులో ఎస్‌బీఐ కనిష్క్ జ్యూయలరీ యజమానిని రుణ ఎగవేతదారుడిగా ప్రకటించింది. రుణాలు వసూలు చేసేందుకు బ్యాంకులు ప్రయత్నిస్తుండగా అసలు వాళ్ల ఆచూకీ తెలియడం లేదు. భూపేష్, నీతా జైన్‌లు మారిషస్ పారిపోయి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి కనిష్క్ జ్యూయలరీ రుణాలు తీసుకున్న 14 బ్యాంకులకు డబ్బులు కట్టడం నిలిపివేసింది. ఇదేంటని ప్రశ్నించేందుకు బ్యాంకు అధికారులు ఆయా దుకాణాల వద్దకు వెళ్లగా అవన్నీ మూసేసి కనిపించాయి.

ఎస్‌బీఐ రూ.215కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.115కోట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.50కోట్లు, సిండికేట్ బ్యాంకు రూ.50కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.45కోట్లు, ఐడీబీఐ, యూకో, తమిళనాడ్ మెర్కంటైల్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేషన్ బ్యాంక్‌లు కోట్ల మేర కనిష్క్‌కు రుణాలు ఇచ్చాయి.

రాష్ట్రానికి ఆస్తి సాధికార మిత్రలు

(మొదటిపేజీ తరువాయి)

పరిధికి మాత్రమే లోబడి ఉంటామని, అదే ఒక సంఘటిత శక్తిగా ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మంది ఒక సంఘటిత శక్తిగా రూపుదిద్దుకుని సాధికార మిత్రలకు నాంది పలికించడం జరిగిందన్నారు. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులను స్వయం సహాయక గ్రూపులుగా తయారు చేయటంలో పాటు సెల్ఫ్ బిజినెస్ మహిళలుగా మార్చి పారిశ్రామికవేత్తలుగా తయారుచేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, వార్డులకు 10 స్టార్ రేటింగ్స్ ఇస్తూ ప్రజలకు సౌకర్యాలు కల్పించటంలో పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నారుల మరణాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలతో మాట్లాడి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యతను సాధికార మిత్రలు తీసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని 100 శాతం ఓడిఎఫ్ ఫ్రీ రాష్ట్రంగా ఏప్రిల్ నాటికి తీర్చిదిద్దే బాధ్యతను సాధికార మిత్రలు తీసుకోవాలన్నారు. సాధికార మిత్రలు పర్యవేక్షించే 35 కుటుంబాలు బహిరంగంగా మలవిసర్జన చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ ఆవశ్యకత నేటి సమాజంలో ఎంతో పెరిగిందని, ఆరోగ్యం, విద్య, వివిధ బిల్లుల చెల్లింపులు ఒతో సులువుగా ఇంటి నుంచే చెల్లించవచ్చన్నారు.

చంద్రబాబు అవినీతిలో మంత్రి పుల్లారావు బినామీ

ప్రజాసంకల్ప యాత్రలో జగన్



విశాలాంధ్ర - చిలకలూరిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవినీతి, అక్రమ సంపాదనలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు బినామీగా వ్యవహరిస్తున్నారని, ప్రజల్ని నట్టేటముంచిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను మంత్రి పుల్లారావు తన భార్య పేరిట కొనుగోలు చేసి బాధితుల్ని వంచించారని ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. 117వ రోజు ప్రజా సంకల్ప యాత్ర గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి బుధవారం చిలకలూరిపేట నియోజకవర్గంలోకి ప్రవేశించింది. చిలకలూరిపేట మండలంలోని గొట్టిపాడు గ్రామంలో ప్రారంభమైన యాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను జగన్ దృష్టికి తెచ్చారు.

చంద్రబాబు చేతగానితనం వల్లే ప్రత్యేకహోదా రాలేదు....

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతగానితనం వల్లే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదని జగన్ విమర్శించారు. నాలుగేళ్లుగా పూటకో మాట మాట్లాడిన ఆయన, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరలా ప్రత్యేక హోదా అంటూ ప్రజల్ని మోసగించేందుకు బయలుదేరాడని విమర్శించారు. చంద్రబాబునాయుడు తాను తప్పు చేసి పక్కవారిపై నెపం మోపేందుకు వెనుకాడడని, నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా సాధించకుండా ఆయన గాడిదలు కాసాడా అని ప్రశ్నించారు. హోదా సాధించే వరకూ తాము పట్టువిడవకుండా పోరాడతామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇంటింటికి కేజీ బంగారం ఇస్తామంటూ మళ్లీ ప్రజల్ని మభ్యపెట్టేందుకు సైతం టీడీపీ నేతలు వెనుకాడరని, ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అధికారప్రతినిధి అంబటి రాంబాబు, బాలశౌరి, ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్, మేకతోటి సుచరిత, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళ్ల అప్పిరెడ్డి, గురజాల నియోజకవర్గ ఇన్‌చార్జి కాసు మహేష్‌రెడ్డి, గొట్టిపాటి భరత్, విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు 16 టీఎంసీలు

(మొదటిపేజీ తరువాయి)

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఏమేరకు నీటిని విడుదల చేయాలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాగర్ కుడి కాలువకు ఈనెల 25వ తేదీ నుంచి రోజుకు 7వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 7 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. అలాగే సాగర్ ఎడమ కాలువకు నష్టాలు పోను 4 టీఎంసీలు, కృష్ణా డెల్టాలో తాగునీటి అవసరాల కోసం మరో 4 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. తెలంగాణ పరంగా హైదరాబాద్ నగరంతోపాటు నల్గొండ జిల్లాలో తాగునీటి అవసరాల కోసం 6 టీఎంసీల నీటిని సాగర్ నుంచి వాడుకోవాలి. అలాగే సాగు,తాగు అవసరాలకు 10 టీఎంసీల నీటిని సాగర్ ఎడమ కాలువ నుంచి విడుదల చేయాలి. ఈ విధంగా 70 రోజుల వ్యవధిలో ఏపీకి 15 టీఎంసీలు, తెలంగాణకు 16 టీఎంసీల నీటిని సాగర్ జలాశయం నుంచి వాడుకోవాలని బోర్డు సూచించింది. ఇదిలా ఉండగా గత అనుభవాన్ని దృష్టి ఉంచుకొని ఏపీ జలవనరులశాఖ అధికారులు ఎడమ కాల్వకు నీటి విడుదలలో జాప్యం, పంటలు ఎండిపోయిన విషయాన్ని బోర్డు దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. దీనిపై త్రిసభ్య కమిటీ ఇరు రాష్ట్రాల అధికారులతో మాట్లాడి బోర్డు ఆదేశాలను తప్పకుండా పాటించాలని గట్టిగా నొక్కిచెప్పారు. ఏపీ పునర్విభజన చట్టం -2014లోని 11వ షెడ్యూల్‌లోని 6,9 పేరాలను ప్రముఖంగా పేర్కొంటూ ఇరు రాష్ట్రాల అధికారులకు పంపిన సర్క్యులర్ అద్దం పడుతోంది. గతంలో రెండు రాష్ట్రాల జలవనరులశాఖలమంత్రుల సమక్షంలో ఆయా సందర్భాల్లో జరిగిన మినిట్స్, 2016 సెప్టెంబరు 21న జరిగిన మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోని అంశాలను బోర్డు సభ్య కార్యదర్శి ఎ పరమేశం ఈ సందర్భంగా ప్రస్తావించారు. గత రెండేళ్లలో ప్రకటించిన ప్రణాళికలో బోర్డు చట్టాన్ని గుర్తు చేయలేదని, తెలంగాణ అధికారుల వ్యవహరించిన వైఖరి కారణంగానే ఈ విధంగా బోర్డు హెచ్చరించినట్లు ఏపీకి చెందిన నీటి సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు.

యావజ్జీవం

(మొదటిపేజీ తరువాయి)

బీఫ్ తీసుకువెళ్తుండగా స్థానిక గో రక్షా సమితికి చెందిన కొందరు వ్యక్తులు ఊకుమ్మడిగా వ్యానుని అడ్డుకుని అన్సారీని కొట్టి చంపారు. అతని వాహనానికి నిప్పుపెట్టారు. గో సంరక్షణ పేరుతో చట్టాన్ని ఎవరూ తమ చెప్పుచేతల్లోకి తీసుకోవద్దని ప్రధాని మోడీ ప్రకటించిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం సంచలనమైంది. 'గరిష్ట శిక్ష వేయమని కోర్టుకు చెప్పాం. అయితే నిందితులపై తొలి క్రిమినల్ కేసు అయినందున కాస్త ఉదారంగా వ్యవహరించాలని డిఫెన్స్ కోరింది. వాదనలు విన్న కోర్టు 11 మందికి యావజ్జీవ శిక్ష వేస్తూ తీర్పుచెప్పింది. 12వ నిందితుడు 16 నుంచి 18 ఏళ్ల లోపు వాడైనందున అడల్ట్‌గా పరిగణించాలని కోర్టుకు తాము విన్నవించినా కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుషీల్ కుమార్ శుక్లా తెలిపారు.

హోదాకోసం 25న పీఆర్‌టీయూ దీక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షలనుగుణంగా ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలోని 13 జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద నిరాహారదీక్షలు చేపట్టాలని ప్రొగ్రెసివ్ రికగ్నయిజ్డ్ టీచర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ (పీఆర్‌టీయూ ఏపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గడ్డం నారాయణరావు, కె.శ్రీనివాసరాజులు బుధవారం ఒక ప్రకటనలో ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గత వారం రోజులుగా రాష్ట్రానికి చెందిన ఎంపీలందరూ పార్లమెంటులో ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఏపీ పట్ల కేంద్ర వైఖరిని నిరసిస్తూ ఈ నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25న జరిగే దీక్షా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు జాతీయ రహదారుల దిగ్బంధం విజయవంతం చేయాలి

పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఈ నెల 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య నిర్వహించాలని తెలిపారు.ఏపీ ప్రత్యేక ప్రత్యేక హోదా , విభజన చట్టంలోని హామీల సాధన సమితి చేపట్టే జాతీయ రహదారుల దిగ్బంధనానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పూర్తి మద్దతు పలుకుతుందని ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలు జాతీయ రహదారుల దిగ్బందనంలో పాల్గొనాలని కోరారు.

పవన్ కళ్యాణ్‌ను బీజేపీ ఆడిస్తుందనడం సరికాదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను బీజేపీ ఆడిస్తుందనడం సరికాదని, ఇటువంటి అసత్య ఆరోపణలు మాను కోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో టీడీపీ నేతలకు సూచిం చారు. పవన్ కళ్యాణ్ ప్రధాని మోడీ కను సన్నల్లో బీజేపీ సూచనల మేరకే నడుచుకుం టున్నాడని తెలుగుదేశం నాయకులు వాఖ్యానిం చడాన్ని ఆయన ఖండించారు. బీజేపీకి అనుకూలంగా పవన్ కళ్యాణ్ ఉండేవారైతే సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి వచ్చేవారే కాదని, సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులతో చర్చలు జరిపే వారే కాదన్నారు. కమ్యూనిస్టు పార్టీలు, బీజేపీ భిన్న ధృవాలనే విషయం రాజకీయ ఓనమాలు తెలిసిన వారందరికీ తెలిసిందేనన్నారు. వామపక్షాలతో కలిసి ప్రయాణం చేయాలనుకుంటున్నానని పవన్ కళ్యాణ్ పదే పదే స్పష్టంగా చెబుతున్నా కూడా టీడీపీ వారు కబోదుల్లా తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆయనను బిజెపి ఆడిస్తున్నదని ప్రచారం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం జరిగే మహోద్యమంలో వామపక్షాలతో కలిసి పవన్ కళ్యాణ్ ప్రయాణం చేస్తారని స్పష్టం చేశారు. అభూత కల్పనలు సృష్టించడం ఇకనైనా మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించాలని రామకృష్ణ కోరారు.

బీసీల పార్టీ టీడీపీ

మంత్రి అచ్చెన్నాయుడు



విశాలాంధ్ర అమరావతి : తెలుగు దేశం ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పడినపార్టీ.. వారే ఈ పార్టీకి పునాదు లని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలిలో సంక్షేమంపై చర్చ అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇస్తూ బి.సి సంక్షేమానికి గత 3 ఏళ్ళలో రూ. 15,900 కోట్లు కేటాయించి రూ. 12,860 కోట్లు ఖర్చు చేసామని , ఈ ఎడాది రూ. 5013.5 కోట్లు కేటాయిం చామని మంత్రి తెలిపారు. ప్రతి నియోజక వర్గానికి ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో కొత్తగా 65 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. వెనుక బడిన తరగతుల స్టడీ సర్కిల్స్ కోసం 2017-18 లో 30 కోట్లు, ఎన్.టి.ఆర్ విదేశీ విద్యోన్నతి పథకం ద్వారా 576 మంది లబ్ధిపొందారని అచ్చెన్ననాయుడు చెప్పారు.చంద్రన్న పెళ్ళి కానుక ద్వారా ప్రతి బి.సి వధువుకు రూ. 35,000 అందిస్తామని , దీనికి బడ్జెట్ లో రూ. 100 కోట్లు కేటాయించామన్నారు. ఆదరణ పథకం తిరిగి ప్రారంబించామని, ఈ పథకానికి రూ.750 కోట్లు కేంటాయించినట్లు తెలిపారు . ప్రతి నియోజకవర్గ కేంద్రాలలో ఆదరణ మైబెల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. కాపు కార్పోరేషన్ కు బడ్జెట్ లో రూ. 1000 కోట్లు కేటాయించి, బీసీల మాదిరిగా కాపులకు ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని మంత్రి తెలియజేశారు.

వైసీపీది లాలూచీ రాజకీయం

టీడీపీది ఐదు కోట్ల ప్రజల అవిశ్వాసం

పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర అమరావతి : 'ప్రజలకోసం పోరాడుతున్నాం... న్యాయం కోసం పోరాడుతున్నాం... మన హక్కుల కోసం పోరాడుతున్నాం... చివరి రోజు వరకు ఇదే స్ఫూర్తితో పోరాడాలి... కలిసికట్టుగా పనిచేయాలి... సంఘటితంగా ఉండాలి...' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ ఎంపీలకు, నేతలకు దిశా నిర్దేశం చేశారు. మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుపతికి వెళ్ళిన చంద్రబాబు అక్కడి నుంచే ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైసీపీది లాలూచీ రాజకీయం, టీడీపీది ఐదు కోట్ల ప్రజల అవిశ్వాసం, ఈ రెండింటికీ చాలా తేడా ఉంది, కొంతకాలంగా టీడీపీపై బీజేపీ అనుమానం పెంచుకుందన్నారు. తనకు జాతీయ రాజకీయాలపట్ల ఆసక్తి లేదన్నా వాళ్ళు నమ్మటం లేదన్నారు. అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో అవసరం లేకున్నా బీజేపీ వైసీపీ మద్దతు తీసుకుంది. నాలుగేళ్లు ఎదురు చూశామన్నారు. ఆఖరి బడ్జెట్‌లో కూడా మనకు న్యాయం జరగలేదన్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వచ్చి, ఆగ్రహం పెల్లుబుకిందని చంద్రబాబు చెప్పారు. ఆయన ఇంకా ఈ విధంగా మాట్లాడుతూ '1985 ఆగస్ట్ సంక్షోభంలో 161మంది ఎమ్మెల్యేలు ఒకేతాటిపై చివరిదాకా నిలిచారు, ఘన విజయం సాధించారు. అదే స్ఫూర్తి ఇప్పుడు ఎంపిలు అందరిలో కనిపించాలి, రాష్ట్రానికి న్యాయం జరిగేవరకు పోరాడాలి. మనకు ఎవరిమీదా కోపంలేదు, ఎవరిమీదా ద్వేషం లేదు. కేంద్ర పెద్దలు చెప్పినమాట నిలబెట్టుకోలేదు. పైపెచ్చు అన్యాయం చేశారనే భావన ప్రజల్లో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలు జాతీయస్థాయి అంశంగా మారాయి. బీజేపీ మినహా అన్ని పార్టీలు ఏపి పట్ల సానుభూతిగా ఉన్నాయి, మద్దతు ఇస్తున్నాయి. ఇది స్ఫూర్తిదాయక సమయం. ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఉభయ సభల్లో ఎంపీలతో ఆందోళన బీజేపీకి చెప్పే చేశాం. ట్రిపుల్ తలాక్‌పై కూడా చెప్పే చేశాం. అరుణ్ జైట్లీ ప్రెస్ మీట్ ప్రజల్లోకి బలంగా వెళ్లింది' అని అన్నారు. దేశరక్షణ, సైన్యం నిధులు అడిగామనడం ప్రజల్లో ఆవేశం పెంచిందని చంద్రబాబు చెప్పారు. అనేక అవకాశాలు ఇచ్చినా బీజేపీ వినియోగించుకోలేదన్నారు. అవిశ్వాసం పెట్టిన వాళ్లకు పీఎంవోలో పనేంటి.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీని ప్రశ్నించారు. 'విజయసాయిరెడ్డిని ఫొటో తీస్తే పీఎంవో వాళ్లు మీడియాను గదమాయించడ ఏమిటి.. ఒకవైపు అవిశ్వాసం నోటీసు ఇస్తారు, మరోవైపు పీఎంవోలో ఉంటారు. అక్కడే వైసీపీ చిత్తశుద్ధి తెలిసిపోతోంది. విభజనతో రాష్ట్రం 20ఏళ్లు వెనక్కిపోయింది. మనం ఎంతచేసినా అది కొంతే. 20ఏళ్ల అంతరం పూడాలంటే కేంద్రం ఎంత తోడ్పాటు అందించాలి, చేయాల్సిందానితో పోల్చుకుంటే చేసింది చాలా స్వల్పం. వృద్ధిరేటులో తెలంగాణ కన్నా 2శాతం ముందున్నాం. తలసరి ఆదాయంలో రూ.33వేలు వెనుక ఉన్నాం. ఇది ఎవరు చేశారు... మీరు చేసింది కాదా, దీనిని పూడ్చాల్సిన బాధ్యత మీపై లేదా' అంటూ చంద్రబాబు కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ దేశంలో అంతర్భాగం కాదా, ఏపికి సాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై లేదా, సామరస్యంగా అడిగినప్పుడు చేయలేదన్నారు. మంత్రులు రాజీనామా చేసినా స్పందించలేదు. ఎన్డీఏ నుంచి వైదొలిగినా కదలిక లేదు. అవిశ్వాసం పెట్టినా చేయడం లేదన్నారు. కేంద్రం మొండిగా వ్యవహరించడం వెనుక వ్యూహం ఏమిటి.. ఏ భరోసాతో కేంద్రం ఏపీ పట్ల ఇంత కఠినంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. మనం న్యాయం అడుగుతున్నాం.. మన వద్ద సత్యం ఉంది. ఏ ప్రాంతం వారైనా తెలుగు వారందరిదీ ఒకటే మాట, ఏపీకి జరిగిన అన్యాయంపై అన్ని ప్రాంతాల తెలుగువారంతా ఆవేశంతో రగిలిపోతున్నారన్నారు. దేశవిదేశాల్లోని తెలుగు వారిలో తీవ్ర అసంతృప్తి ఉంది, ఇతర రాష్ట్రాలలోని తెలుగువారు కూడా ఈ అన్యాయాన్ని నిరసిస్తున్నారన్నారు. ఎంపీలు అందరూ సంఘటితంగా పోరాడాలి, 5కోట్ల ప్రజల మనోభావాలను ప్రతిబింబించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అవిశ్వాసం నోటీసును అనుమతించాల్సిందే. మరొక ప్రత్యామ్నాయం ప్రభుత్వానికి లేదన్నారు. వాయిదాలు వేసుకుంటూ పోతే మరింత ఆగ్రహానికి గురవుతారని, అవిశ్వాసంపై చర్చకు అందరూ సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎలుగెత్తాలి. పునర్వ్యవస్థీకరణ చట్టంలో కేంద్రం ఏం చేస్తానని చెప్పిందన్నారు. ఎంతవరకు చేశారు, ఇంకా ఏం చేయాలి, పార్లమెంటు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలుచేశారు అనేదానిపై ప్రతిఒక్కరిలో అవగాహన ఉండాలి, అధ్యయనం చేయాల న్నారు. చట్టంలో 19అంశాలు, పార్లమెంటు 6హామీలు అన్నీ అమలు చేయాల్సిందే. పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరేదాకా కేంద్రం తోడ్పాటు ఇవ్వాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైఎస్.చౌదరి, ఎంపీ సీఎం రమేష్, టిజి.వెంకటేష్, ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు కుటుంబరావు, శాసనసభ, శాసనమండలి చీఫ్ విప్‌లు పల్లె రఘునాథ రెడ్డి, పయ్యావుల కేశవ్, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.



రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

అన్నదానానికి రూ.26 లక్షలు విరాళం : చంద్రబాబు

విశాలాంధ్ర - తిరుమల : ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ముఖ్యమంత్రి తమ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తనకు శక్తి ప్రసాదించాలని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. తిరునామధారణ నిర్వహించడం చాలా బాగుందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. అనంతరం వైకుంఠ క్యూకాంప్లెక్స్ ద్వారా కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి ఆలయంలోకి ప్రవేశించారు. మహద్వారం వద్దకు చేరుకోగానే టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ సాదరంగా ఆహ్వానించగా, ఆలయ అర్చకులు కలిసి సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. శ్రీవారి ఆలయంలో పడికావలి నుంచి ధ్వజస్తంభం మధ్య ఏర్పాటు చేసిన ముడుచుకునే పైకప్పు పనితీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, డిఐజి ప్రభాకర్‌రావు, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, సీవీఎస్‌ఓ రవికృష్ణ, అర్బన్ ఎస్‌పి అభిషేక్ మహంతి, ఆలయ డిప్యూటీ ఇఓ హరీంద్రనాథ్, విజిఓ రవీంద్రారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ముఖ్యమంత్రి తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తన మనుమడు దేవాన్ష్ 4వ పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చు 26 లక్షల రూపాయలను ఆన్‌లైన్‌లో విరాళంగా అందించారు.

డిసెంబరు నాటికి సోమశిల-స్వర్ణముఖి లింకు కాలువ పూర్తి

- 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు
- ఎత్తిపోతల ద్వారా బద్వేల్‌కు 1 టీఎంసీ తాగునీరు
- ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి దేవినేని



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సోమశిల-స్వర్ణముఖి లింకు కాలువ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు తెలిపారు. మూడు ప్యాకేజీలలో ఈ పనులు జరుగుతున్నా యన్నారు. ఈ కాలువ పూర్తయితే నెల్లూరు, చిత్తూరుజిల్లాల్లో 1.10 లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని వివరించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా బుధవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కె రామకృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. లింకు కాలువ ఒప్పంద విలువ రూ. 253.36 కోట్లకు గాను ఇప్పటి వరకూ రూ. 140.16 కోట్లను ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులోని రెండు ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతులను మంజూరు చేసిందన్నారు. అల్తూరుపాడు ఎత్తిపోతలతోపాటు లింకు కాలువ పనులను ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేర్చినట్లు మంత్రి సభకు వివరించారు. ఇక బద్వేలుతోపాటు అట్లూరు, గోపవరం మండలాలకు తాగు,సాగు నీరు అందక ప్రజలు, రైతులు అనేక కష్టాలు పడుతున్న విషయాన్ని బద్వేలు ఎమ్మెల్యే టి జయరాములు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా పై మండలాలకు పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. వేరొక ప్రశ్నకు సమాధానమిస్తూ.. విశాఖపట్నంలోని మేహాద్రిగడ్డ జలాశయం కింద ఎటువంటి ఆయకట్టు లేదన్నారు. ఈ ప్రాజెక్టును కేవలం విశాఖ మహానగర మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) తాగునీటి అవసరాల కోసం నిర్మించినట్లు వివరించారు. అలాగే మరోక జలాశయం గంభీరంగెడ్డ కింద 640 ఎకరాల ఆయకట్టు ఉండేదని, పట్టణీకరణలో భాగంగా కొంత వినియోగించగా ప్రస్తుతం 200 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉందన్నారు. అయితే ఈ రెండు జలాశయాల నిర్వహణను జీవీఎంసీకి అప్పగించాలని విశాఖ ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తిని ఆయన తిరస్కరించారు. ఈ రెండు గెడ్డలు వాగులు, వంకలతో కూడుకున్నది కావడంతో ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రెండు జలాశయాల నిర్వహణను జలవనరులశాఖే పర్యవేక్షిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

పీఎఫ్ వైద్య ఖర్చుల మంజూరుపై ఆర్థిక ఆంక్షలు తొలగించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెందిన పీఎఫ్ నిధుల నుంచి రుణాల మంజూరుపై ప్రభుత్వ ఆంక్షలను తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ-ఏపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసఫ్ సుధీర్ బాబు, గాజుల నాగేశ్వరరావు డిమాండు చేశారు. బుధవారం ఎస్టీయూఏపీ కార్యాలయం నుంచి వారిద్దరూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, పెన్షన్ల వైద్య చికిత్సలపై ఖర్చు చేసుకున్న మొత్తాలను తిరిగి చెల్లించడంలోను, వివాహాలు, ఇంటి నిర్మాణం, వైద్యం తదితర ఖర్చుల కోసం తాపు పొదుపుచేసిన పీఎఫ్ రుణాల మంజూరుపై వున్న ఆంక్షలతో అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.ఆర్థికశాఖ వెంటనే ఆంక్షలను సడలించి అన్ని రకాల బిల్లులను మంజూరు చేయాలని కోరారు.

పాఠశాలలు పటిష్టంగా నిర్మించాలి

పీడీఎఫ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి

విశాలాంధ్ర అమరావతి : జాతి భవిష్యత్తు తరగతి గది నుండి ప్రారంభమౌతుందని, అటువంటి తరగతి గదుల నిర్మాణం నాణ్యంగా ఉండాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాల మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 8400 పాఠశాల భవనాలు నాణ్యతతో నిర్మించాలని, 50 ఏళ్ల వరకు ఉండేలా పటిష్టంగా నిర్మించాలని సభలో కోరగా సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఉపాధ్యాయులను వేసవి సెలవుల్లో మాత్రమే బదిలీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. తమిళనాడు లో ఉపాధ్యాయులు ఎవరైనా అకడమిక్ ఇయర్ మధ్యలో రిటైర్మెంట్ అయితే, విద్యార్థుల బోధనకు ఇబ్బంది కలుగకుండా వారిని ఆ ఏడాది చివరివరకు కొనసాగిస్తారన్నారు. మన రాష్ట్రంలో కూడా అదేవిధంగా కొనసాగించమని సభలో కోరినట్లు తెలిపారు. డిగ్రీ కేజీ అధ్యాపకులకు కెరియర్ అడ్వాన్సుమెంట్ స్కీం జీఓ ఉందని, కానీ అమలుకావడం లేదని , దానిని అమలు చేయవలసిందిగా కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. జీఏడి (జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్) జారీ చేసిన నిబంధనల ప్రకారం స్థానిక స్థానిక సంస్థలలో ఖాళీలని మాత్రమే కారుణ్య నియామకాలకు భర్తీ చేయాలని , ఇతర శాఖలలో భర్తీ చేయుటకు వీలులేదని, అయితే గతంలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ నిర్ణయించిన ప్రకారము అన్ని శాఖలలో నియమించేవారని, ఇప్పుడు కూడా అదేవిధంగా నియమించమని మండలిలో కోరటం జరిగిందన్నారు. కేంద్రం విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రం విభజించినపుడు కూడా ఇంతకంటే గందరగోళ పరిస్థితి ఉందని అన్నారు.పార్టీలతో సంబందం లేకుండా అందరూ ఒకే మాట మీద నిలబడి కేంద్రం పై ఒత్తిడి పెంచాలని అప్పుడే రాష్ట్రానికి రావాల్సిన హక్కులు సాదించుకోగలమని వెల్లడించారు.

ఉర్దూ భాషకి ప్రాధాన్యత కల్పించాలి

రాష్ట్రంలో ఉర్దూ భాషకి ప్రాధన్యత కల్పించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు.బుధవారం సంక్షేమంపై లఘు చర్చలో కత్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క అంగన్వాడీ పాఠశాల కూడా లేదన్నారు.ప్రతి జిల్లా లో ఉర్దూ కళాశాలలు నెలకొల్పాలని కోరారు.ఉర్దూ యూనివర్సిటీ ఇప్పటికి అదే భవనాలలోనే నడుస్తుందని ,సొంత భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు.గురుకుల పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాదిస్తున్నా యన్నారు, మహిళల సంక్షేమానికి అధికంగా నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. సమాజంలో భర్త చనిపోయినా మహిళలకు ఆర్థికంగా నిలదొక్కుకొనటానికి ,వారి ఎదుగుదలకు ప్రత్యక కార్యాచరణ రూపొందించాలన్నారు.

తెలుగు రాష్ట్రాల నుంచి 13 విద్యా సంస్థలకు అటానమస్

విశాలాంధ్ర-విశాఖసిటీ : దేశంలోని ఉత్తమ విద్యా ప్రమాణాలు కనబరుస్తున్న పలు విద్యా సంస్థలను ప్రపంచ ర్యాంకింగ్‌లో రాణించేలా కేంద్రం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా 60 విద్యా సంస్థలకు పూర్తిస్థాయి స్వయం ప్రతిపత్తి కల్పించింది. దీనికి సంబంధించి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పూర్తిస్థాయి స్వయం ప్రతిపత్తి హోదా ప్రకటించింది. దేశ వ్యాప్తంగా మొత్తం 60 విద్యా సంస్థలను ఈ హోదాకు ఎంపిక చేయగా వాటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 13 విద్యా సంస్థలు ఈ హోదాకు ఎంపిక అయ్యాయి. దేశంలోని 5 సెంట్రల్ యూనివర్సిటీలు, 21 స్టేట్ యూనివర్సిటీలు, 24 టుబీ డీమ్డ్ యూనివర్సిటీలు, 2 ప్రైవేట్ యూనివర్సిటీలు, 8 కళాశాలలు ఈ హోదా దక్కించుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం నుంచి సెంట్రల్ యూనివర్సిటీలు అయిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (కేటగిరి-1), ది ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజిస్ యూనివర్సిటీ (కేటగిరీ-2), స్టేట్ యూనివర్సిటీలైన నల్సార్ లా యూనివర్సిటీ (కేటగిరీ-1), కాకతీయ యూనివర్సిటీ (కేటగిరీ-2), ఉస్మానియా యూనివర్సిటీ(కేటగిరీ-1), టు బీ డీమ్డ్ యూనివర్సిటీ అయిన ఐసీఎఫ్ఏఐ టు బీ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (కేటగిరీ-2), జీ.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజి మొత్తం 7 విద్యా సంస్థలకు ఈ హోదా దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి స్టేట్ యూనివర్సిటీలైన ఏయూ (కేటగిరీ-1), ఎస్వీయూ (కేటగిరీ-1), టుబీ డీమ్డ్ యూనివర్సిటీలైన విశాఖలోని గీతం, తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృతి విద్యాపీఠ్, కాకినాడలోని బొనం వెంకటచలమయ్య ఇంజనీరింగ్ కాలేజి, వాసవీ ఇంజనీరింగ్ కాలేజి మొత్తం 6 విద్యా సంస్థలకు ఈ స్వయం ప్రతిపత్తి హోదా దక్కింది. దీంతో ఆయా విద్యా సంస్థలు ఇకపై సిలబస్, నూతన కోర్సులు తదితర విద్యాపరమైన విషయాలలో స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

ప్రజాసమస్యల చర్చావేదికగా సీపీఐ మహాసభలు



- ఏప్రిల్ 6 నుంచి కడపలో ప్రారంభం
- హాజరుకానున్న సురవరం, నారాయణ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఓబులేసు వెల్లడి


విశాలాంధ్ర-కడప జిల్లాపరిషత్ : సీపీఐ రాష్ట్ర 26వ మహాసభలు ఏప్రిల్ 6 నుండి 10 వరకు కడపలో మొట్టమొదటిసారిగా జరుగు తున్నాయని , ఈ మహాసభలను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి.ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రజాసమస్యలపై చర్చకు ఈ మహాసభలు వేదికకాను న్నాయని చెప్పారు. కడప జిల్లా అంటే రౌడీయిజం, దౌర్జన్యాలు మాత్రమే ఉంటాయనే విమర్శలు ఉన్నాయన్నారు. కడప అంటే కవులకు, కళాకారులకు, రచయితలకు నిలయమని నిరూపించే విధంగా ఏప్రిల్ 6న సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. 7వ తేదీన భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ బహిరంగ సభకు సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి, కార్యదర్శి కె.నారాయణ హాజరవుతున్నారని తెలిపారు. సభాధ్యక్షులుగా రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వ్యవహరించనున్నారని ఆయన తెలిపారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని గురించి ప్రజలకు తెలియజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీలు ఉక్కు ఫ్యాక్టరీ, నిధులు, నియామకాలు, కృష్ణానదిలో నికర జలాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రత్యేక హోదా కోసం సీపీఐ అనేక రకాల నిరసన కార్యక్రమాలు చేస్తోందని, అందులో భాగంగా ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి పిలుపు మేరకు గురువారం జిల్లాలో రహదారుల దిగ్బంధనం చేపడుతున్నామని, ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజలందరూ తరలి వచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, బషీరున్నిసా, గంగాసురేష్, అంకుశం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు కోసమే 'స్మార్ట్ పల్స్ సర్వే'

- రాష్ట్రంలో 4.35 కోట్ల మంది వివరాల సేకరణ
- ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి యనమల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో చేపట్టిన స్మార్ట్ పల్స్ సర్వే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను సక్రమంగా అమలుచేసేందుకు దోహదం చేస్తుందని ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బి జయనాగేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సామాజిక వర్గీకరణ- కుల ధృవీకరణకు నిర్దేశించి చేపట్టిన ఈ సర్వేతో అనేక ఉపయోగాలున్నాయన్నారు. నిరంతర ప్రక్రియగా జరిగే ఈ సర్వేతో ఎప్పటికప్పుడు సమాచారం అప్‌డేట్ అవుతోందన్నారు. దీంతో సర్వేలో వచ్చిన ప్రతి ఒక్కరికీ ఫలితాలు తప్పకుండా అందుతాయన్నారు. అయితే జనాభా లెక్కలకు, స్మార్ట్ సర్వేకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. కుటుంబం మొత్తం ఒక యూనిట్‌గా తీసుకున్నప్పటికీ ఎవరైనా వివాహమై వేరొక ప్రాంతంలో నివాసముంటే వారి వివరాలు పాత సర్వే జాబితా నుంచి తొలగించి కొత్త సర్వే ప్రకారం నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకూ మొత్తం 4,35,19,037 మందిని సర్వే చేసామన్నారు. వీరిలో 1.15 కోట్లు పట్టణాల్లోనూ, 3.19 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారున్నారని తెలిపారు. సర్వేలో స్త్రీ, పురుషులతోపాటు హిజ్రాల వివరాలను కూడా సేకరించినట్లు ఆయన సభాపూర్వకంగా తెలిపారు.

ఆర్టీసీ జోలికెళ్లం: మంత్రి కె అచ్చెన్నాయుడు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ)ని ప్రభుత్వం అధీనం లోకి తీసుకునే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని రవాణా శాఖమంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ప్రశ్నను వైసీపీ ఎమ్మెల్యేలు లేవనెత్తారని, అయితే ప్రస్తుతం వారు సభలో లేరని వ్యాఖ్యానించారు. అలాగే ఎమ్మెల్యే టి జయరాములు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాల్లో నిర్మించు, నిర్వహించు, బదిలీ (బీఓటీ) విధానంలో 26 ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. తద్వారా సంస్థకు ఏటా రూ. 10 కోట్ల ఆదాయం లభిస్తోందన్నారు. పెద్ద నగరాలు, పట్టణాల్లోని ఆర్టీసీ స్థలాల్లో బీటీటీ విధానంలో వాణిజ్య భవనాల నిర్మాణానికి సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. పోరుమామిళ్ల, కదిరి వంటి ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ టెండర్లు ఆహ్వానిస్తే ఎవరూ ముందుకు రాలేదని మంత్రి స్పష్టం చేశారు.

బోగస్ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు: మంత్రి నక్కా ఆనందబాబు

ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల కుల ధృవీకరణలో బోగస్ పత్రాలను సృష్టించినవారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి నక్కా ఆనందబాబు హెచ్చరించారు. పాడేరు, నర్సన్నపేట ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, బి రమణమూర్తి గిరిజన ప్రాంతాల్లో అనేక మంది వాస్తవ అభ్యర్థులు అనేక అవకాశాలను కోల్పోతున్నారని సభలో ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ సామాజిక వర్గాల ధృవపత్రాల జారీ క్రమబద్ధీకరణ చట్ట ప్రకారం ఎస్టీ సామాజిక వర్గాల ధృవపత్రాలను జారీ చేయడంపై అందిన ఫిర్యాదులను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 244 కేసులు నమోదైనట్లు చెప్పారు. అలాగే రాష్ట్రంలో 500 జనాభా కలిగిన గిరిజన తండా/కాలనీలను నూతన పంచాయతీలుగా మార్పు చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని వేరొక ప్రశ్నకు సమాధానంగా మంత్రి సభలో ప్రకటించారు.

జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలను నివారించేందుకు ప్రభుత్వం హైపవర్ కమిటీని నియమిం చింది. ఈమేరకు సాధారణ పరిపాలన(సమాచార,పౌరసంబంధాలశాఖ) ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఎస్ వెంకటేశ్వర్ బుధవారం జీవో జారీ చేశారు. ఈ కమిటీకి హోంశాఖ మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా సమాచారశాఖమంత్రి, సభ్యులుగా హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి, ప్రభుత్వ ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఉంటారు. ఇంకా ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, ఏపీ జర్నలిస్ట్ ఫోరం, ఏపీ మీడియా ఫెడరేషన్‌లకు సంబంధించిన ప్రతినిధుల్లో ఐదుగురు సభ్యులుగా ఉంటారు. ఇంకా ఏపీ స్మాల్, మీడియం డైలీ న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ నుంచి ఒక ప్రతినిధి, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నుంచి ఇద్దరు ప్రతినిధులు, ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నుంచి ఒక ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. అలాగే మెంబర్ కన్వీనర్‌గా సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో మెంబర్‌ను సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ నియమిస్తారు.

సంపాదకీయం

మానవత్వం మంట కలిసింది

ప్రపంచ వ్యాపితంగా అనేక దేశాల్లో ఉగ్రవాద సంస్థలు మానవత్వాన్ని సమాధి చేస్తూ విజృంభిస్తున్నాయి. ఇరాక్‌లో మూడేళ్ల క్రితం అపహరణకు గురైన 39 మంది భారతీయులను కర్కశ ఉగ్రవాద ముఠా ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) అతి కిరాతకంగా హతమార్చిన హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. వారు సజీవంగా ఎక్కడో వుండి వుంటారన్న వీరి కుటుంబ సభ్యుల ఆశలు అడియాసలయ్యాయి. ఐఎస్ఐఎస్ ముష్కరులు మృతదేహాలను బదోశ్ గ్రామంలో సామూహికంగా ఖననం చేశారని విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ మంగళవారం రాజ్యసభలో ప్రకటించడంతో మృతుల కుటుంబ సభ్యుల 'నెత్తిపై పిడుగుపడినట్లు' విషాదభరిత దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇరాక్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మోసూల్‌ను 2014లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు ఆక్రమించు కొని ఒక నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న 49 మంది భారతీయ కార్మికులను, కొందరు బంగ్లావాసులను బందీలుగా పట్టుకున్నారు. భారతీయ ఖైదీల్లో ఎక్కువ మంది పంజాబ్‌కు చెందినవారే వున్నారు. వీరిలో గురుదాస్‌పూర్‌కు చెందిన హర్జీత్ మాసిహ్ అనే కార్మికుడు ఉగ్రవాదుల చెర నుండి తప్పించుకోగలిగాడు. భారత్‌కు చెందిన మిగతా బందీలను ఐఎస్ఐఎస్ ముఠా సభ్యులు ఊచకోతకోయడం తాను చూశానని, హర్జీత్ చెప్పాడు. ఆ వాదనను భారత ప్రభుత్వం తిరస్కరించింది. "అవన్నీ కట్టుకథలే" అని ఆనాడు సుష్మాస్వరాజ్ కొట్టిపడేశారు. తాజాగా మంగళవారం రాజ్యసభలో ప్రకటన చేస్తూ 39 మంది భారతీయులను ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు చంపేశారని, ఆధారాలు లభించాయని వెల్లడించారు. మృతదేహాలను ప్రత్యేక విమానంలో భారత్ తీసుకొచ్చి బంధువులకు అప్పగిస్తామని సుష్మా చెప్పారు. ఒక విధంగా అది బంధువులకు మృతదేహాలను కడసారి చూసుకునే అవకాశం కల్పిస్తుందన్నది వాస్తవమే అయినప్పటికీ, ప్రభుత్వం ఉదాసీనత, నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోంది. 39 మంది భారతీయ కార్మికులను ఉగ్రవాదులు అతి కిరాతకంగా చంపేశారని తప్పించుకున్న తోటి ఖైదీ మాటలను విదేశాంగ మంత్రి పెడచెవినపెట్టి, ఆనాడే క్షుణ్ణమైన దర్యాప్తునకు అంతర్జాతీయ న్యాయసంస్థ ద్వారా ప్రయత్నించక కాలయాపన చేయడం క్షమార్హంకానిది... ఖండించదగినది. కూలికోసం విదేశాలకు వెళుతున్న అనేక మంది దుస్థితికి గురవుతున్నారు. విదేశాల్లోని భారతీయుల భద్రతకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకుండా కేవలం మాటలకే పరిమితం కావడం దురదృష్టకరం.

అమెరికా సామ్రాజ్యవాదం పెంచిపోషించిన ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా చీలిక గ్రూపే ఐఎస్ఐఎస్. దీన్ని ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ లెవాంట్ (ఐఎస్ఐఎల్), ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) అని కూడా పిలుస్తారు. ఇరాక్, సిరియా తదితర దేశాల్లో ఖలీఫాల రాజ్యస్థాపనే ఐఎస్ఐఎస్ ప్రధాన లక్ష్యం. ఇరాక్, సిరియా ప్రాంతంలో పురాతన గతాన్ని ప్రతిబింబించే ఒక సమాజాన్ని స్థాపించడానికి ఇస్లాం మతంలో 8వ శతాబ్దంలో వేళ్లూనుకుపోయిన షరియత్ చట్టాన్ని ఐఎస్ఐఎస్ అమలు చేస్తున్నది. ఐఎస్ఐఎస్ ఇప్పటికే డజన్లకొద్దీ అమాయక ప్రజలను పొట్టన పెట్టుకోవడమేగాక బహిరంగంగా ఉరితీయడం, చిత్రవధలకు గురిచేసి శిలువ వేయడం వంటి అమానవీయ చర్యలకు పాల్పడుతోంది. ఐఎస్ఐఎస్ ప్రపంచవ్యాపితంగా 21 దేశాల్లో 90కి పైగా దాడులు జరిపి 1400 మందికి పైగా అమాయక ప్రజల ఉసురుతీసింది. దారుణ హత్యలకు పాల్పడటమే కాకుండా అభివృద్ధి నిరోధక రాజకీయాలు, మతపరమైన ఛాందసవాదాన్ని పెంపొందించడానికి సోషల్ మీడియా వంటి అత్యాధునిక సాధనాలను ఉపయోగిస్తున్నది. ఆ ఉగ్రవాద సంస్థ ముఠాసభ్యులు పవిత్ర ప్రదేశాలను, అమూల్యమైన పురావస్తువులను ధ్వంసం చేస్తున్నారు. ఇస్లాం మత తొలిరోజులు తిరిగి తీసుకురావాలని ఆ సంస్థ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మన దేశంలో సంఘ్‌పరివార్ శక్తులకు, ఐఎస్ఐఎస్‌కు సమీప సారూప్యత కనిపిస్తోంది. ఆరెస్సెస్ నేతృత్వంలోని సంఘ్‌పరివార్ శక్తులు కేంద్రంలో అధికారంలో వున్న భారతీయ జనతాపార్టీ (బీజేపీ) ద్వారా దేశాన్ని మధ్యయుగకాలంనాటి రోజులకు తీసుకువెళ్లాలని ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇది భిన్నత్వంలో ఏకత్వం పరిఢవిల్లుతున్న భారత ప్రజాస్వామ్య దేశానికి అత్యంత ప్రమాదకరమైనది. 2014లో ఐఎస్ఐఎస్ మధ్యధరా సముద్రతీరం నుండి బాగ్దాద్ దక్షిణ ప్రాంతం వరకు దాదాపు 34 వేల చదరపు మైళ్ల ప్రాంతాన్ని తన నియంత్రణలో పెట్టుకుంది. అయితే, 2016 చివరినాటికి ఐఎస్ఐఎస్ నియంత్రణ భూభాగం 23,320 చదరపు మైళ్లకు కుదించుకుపోయింది. 2015లో ఐఎస్ఐఎస్ 3,500 మందిని బానిసలుగా తన బందీలుగా వుంచినట్లు ఐక్యరాజ్య సమితి ఒక నివేదికలో వెల్లడించింది. బందీలలో ఎక్కువ మంది యజ్దీ వర్గానికి చెందిన మహిళలు, పిల్లలు కావడం విశేషం. చమురు ఉత్పత్తి, స్మగ్లింగ్, పన్నులు, అపహరణలకు పాల్పడి డబ్బు వసూలు చేయడం, దొంగిలించిన పురాతన కళాఖండాలను విక్రయించడం ద్వారా ఐఎస్ఐఎస్‌కు ఆదాయం సమకూరుతోంది. దాంతో అది ప్రపంచవ్యాపితంగా దాడులకు 200 కోట్ల డాలర్లతో ఒక యంత్రంగాన్ని రూపొందించుకొంది. ఐఎస్ఐఎస్ ఉగ్రవాద ముఠాల నియంత్రణ నుండి సంపూర్ణంగా భూభాగాన్ని విముక్తి చేసి ఇరాక్-సిరియా సరిహద్దులను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకొన్నట్లు ఇరాక్ సైన్యాధికారులు 2017 డిసెంబర్‌లో వెల్లడించారు. అగ్రరాజ్యాలతో సహా అనేక దేశాలు ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు నిబద్ధతను ప్రకటించాయి. కానీ ఆచరణలో, చర్యలు ఆశించినంతగా తీసుకోలేక పోవడం విచారకరం. ప్రపంచ వ్యాపితంగా ఉగ్రవాద సంస్థలు ఏ ముసుగులో వున్నా వాటిని కూకటివేళ్లతో పెకిలించినప్పుడే చిరశాంతి వెల్లివిరుస్తుంది. ఆ దిశగా ఐక్యరాజ్యసమితిలోని అగ్రరాజ్యాలు, సభ్యదేశాలు అడుగులు ముందుకు వేయాల్సిన అవసరముంది.

చురక

ఆంధ్రకు ప్రత్యేక హోదా
ఆందోళనకు సపోర్టు
కేంద్రం ఉచ్చుల్లో పడి
కొంతమంది కోవర్టు

అవిశ్వాస తీర్మానం
అందమైన భావన
పార్లమెంటు కల్పించిన
బల క్రీడల సాధన

– వేల్పుల నారాయణ

రేపటి సమరానికి స్వాగతం !

కడపజిల్లా పిలుస్తూంది!
పదండి పోదాం! ప్రభంజనమై!!
భారతకమ్యూనిస్టు పార్టీ 26వ
రాష్ట్ర మహాసభ పిలిచింది!
చలో! చలో!! కడపకు చలో
అంటూ దండుగా కదలండి!

త్యాగాలకు రాగాలకు
వేమన ఆటవెలది-తేట గీతులు
అన్నమయ్య లలిత సంగీత కీర్తనలు
ఇచట పుట్టిన చిగురు కొమ్మలకైన
చేవయుండునని నుడివిన
కోగటం అగ్రహారం అల్లసాని వారు
శ్రీకాళహస్తీశ్వర శతక కర్త
దూర్జటి కవివరేణ్యులు
శ్రీకృష్ణరాయల అష్టదిగ్గజ మూర్తులై
రత్నాలరాసుల కవితలల్లిన సీమ

ఒంటిమిట్ట పోతనార్యులు
తాళ్ళపాక తిమ్మక్క
గోపవరం రామాయణ మొల్ల
వేమన్న, బద్దెన, వీరబ్రహ్మేంద్రస్వామి
తత్వాలతో, నీతి పద్యాలతో పునీతమైన
తేట తెలుగుల తేనె లొలికిన
కడప గడ్డన పుట్టినారే
కవులుగా గణతి కెక్కినారే
తెలుగు గడ్డకు వన్నె తెచ్చినారే
ఆధునికాంధ్ర సాహితీ సమరాంగణ సీమలో

కవిత్వం, కథ,విమర్శ,నవల,నాటకం,పద్యం,గద్యం
ఎన్నెన్నో ప్రక్రియలతో విరాజిల్లిన
ప్రొద్దుటూరుకే వెలుగు రాజన్నకవి,
పుట్టపర్తి నారాయణా చార్యులు
గ్రంథాలయోద్యమ గాడిచర్ల హరిసర్వోత్తమరావు
విమర్శకు అర్థం చెప్పిన
రాచమల్లు రామచంద్రారెడ్డి
వ్యంగ్యచతురుడు గజ్జెల మల్లారెడ్డి
కథకు కేరాఫ్ అడ్రసు
కేతు విశ్వనాథరెడ్డి
వచన రచనా విమర్శకులు
రాచపాలెం చంద్రశేఖరరెడ్డి
కథా కథనం నేర్పిన
నన్నపరెడ్డి వెంకటరెడ్డి
అష్టావధానం నరాల రామిరెడ్డి

నవలకు నవ్యతలద్దిన సొదుం జయరాం-రామ్మోహన్
వచన కవితకు శశిశ్రీ
చారిత్రక పరిశోధకులు
జానమద్ది హనుమత్ శాస్త్రీ
మైనారిటీ బ్రతుకు వ్యతలు చెప్పిన షేక్ హుస్సేన్
అవధాని ఆశావాది ప్రకాశరావు
బహుముఖ ప్రజ్ఞాశాలి, శివభారతం
గడియారం వెంకట శేషశాస్త్రి
నాటకాల సురభి, జానపదాల మునియ్య
శతావధానం సి.వి.సుబ్బన్న
ఆకాశవాణి మాచిరెడ్డి, రచయిత్రీ సంజీవమ్మ
బుర్రకథ కమ్మూసాహెబ్, శ్యామలా

రంభ, ఊర్వశి,దక్షిణానిలం
వై.సి.వి.రెడ్డి
లచ్చప్ప-రామానాయకులు
సాహితీ వనాన వికసించిన
కవులు,రచయితలు
ఎవ్వరమ్మా వీరు 'అరసం' ఆశయాలతో
ఎదుగు బొదుగు లేని వ్యధల బతుకులకు
దారి చూపిన అభ్యుదయ కవితా సుమాలు

చందన చందిత ఎర్రచందనం
బ్రైరైటీస్, నాపరాయి, సున్నపురాయి
చైనాక్లై ఆస్ బెస్టాస్
శనగ వేరుశనగలతో విరాజిల్లిన
పోరాటాల పోరుగడ్డ కడప సీమన
రామప్పనాయుడు, మోకా వెంకట సుబ్బయ్య
సంగమేశ్వరరెడ్డి, కడప కోటిరెడ్డి
పంజం నరశింహారెడ్డి, నంద్యాల వరదారెడ్డి
ఎద్దుల ఈశ్వరరెడ్డి, టేకూరి సుబ్బారావు
ఎన్.శివరామిరెడ్డి, జె.వెంకట్రామరెడ్డి, కె.సుబ్బన్న
ధన్యులెందరో త్యాగధనులు
వారి బాటన నడిచిపోరిన
ఎర్రజెండా-మన పోరు జెండా
ఎత్తిపట్టి ఊరు ఊరున కదలిరండి !
పదండి పోదాం ! ప్రభంజనంలా !!
భారతకమ్యూనిస్టు పార్టీ 26వ
రాష్ట్ర మహాసభ పిలిచింది
చలో చలో కడపకు చలో
అంటూ దండుగా కదలండి !
రేపటి సమరానికి స్వాగతం పలకండి !!

సీపీఐ రాష్ట్ర 26వ మహాసభలు కడపలో
జరగనున్న సందర్భముగా

– చలసాని వెంకట రామారావు
ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు,
సెల్ : 9490952093

సందర్భం

నీటి పొదుపుపై చైతన్యం కలిగిద్దాం

కామిడి సతీష్ రెడ్డి



ఐక్యరాజ్యసమితి 22-12-1992న రిడిజినేరియాలో నిర్వహించిన యూ.ఎన్. కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంటు మరియు డెవలప్‌మెంటు అనే సదస్సులో చేసిన తీర్మానంలోని 18వ అధ్యాయంలోని 21వ అజెండా అంశం ప్రకారం ప్రతీయేటా మార్చి 22న ప్రపంచ జలదినోత్సవం నిర్వహించాలని తీర్మానించారు. ఐక్యరాజ్యసమితి 2003 డిసెంబర్‌లో ఆమోదించిన మరో తీర్మానంలో 'ప్రాణికోటికి నీరు' అనేది ఇతివృత్తంగా 2005-2015 దశాబ్దాన్ని అంతర్జాతీయ ఉద్యమ దశాబ్దంగా ప్రకటించింది. అమెరికా మొదలైన దేశాలలో ప్రతీయేటా అక్టోబర్ 18న 'వరల్డ్ వాటర్ మానిటరింగ్ డే' అనే మరో దినోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా 80 దేశాలలో తాగునీటి సమస్య లేకుండా వుంది. భూగోళం మీద నీటిలో 97 శాతం ఉప్పునీరే (సముద్రలే) మిగిలిన దానిలో 69 శాతం హిమపాతం, మంచు గడ్డలు. భూమి మీద లభించే నీటిలో 0.008 శాతం మాత్రమే స్వచ్ఛమైన నీరు. క్రీ.శ. 2025 నాటికి సుమారు 50 దేశాలలో (మన దేశంతో) సహా తీవ్రమైన నీటికొరత ఏర్పడనుందని చికాగోలోని జాన్ హాప్కిన్ యూనివర్సిటీలోని 'స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్' హెచ్చరించింది. నీటి వనరుల పరిరక్షణలో ఉపేక్ష నిల్వలపట్ల నిర్లక్ష్యం. వినియోగంలో దుబారా, కాలుష్యం విపరీత పరిణామాలకు దారితీస్తున్నాయి.

2005-2015 వరకు "జీవం కోసం జలం" (వాటర్ ఫర్ లైఫ్) అనే నినాదంతో అంతర్జాతీయ దశాబ్దంగా ఐ.రా.స. ప్రకటించింది. ఇంటి నుండి ఒక కి.మీ. లోపు నీరు దొరకనివారు ప్రపంచంలో పందకోట్ల మంది ఉన్నారు. దూరప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి రావడం వల్ల ఆఫ్రికా ఖండంలో ఏటా 4 వేల పని గంటలు వ్యర్థమవు తున్నాయి. కలుషితమైన నీటివల్ల ప్రతి ఎనిమిది సెకండ్లకు ఒక బాలుడు (బాలిక) చనిపోతున్నారు. ఆఫ్రికాలో ఒక కుటుంబం రోజుకు సగటున 23 లీటర్ల నీరు వాడుతుండగా, ఒక అమెరికన్ కుటుంబం వెయ్యి లీటర్ల నీరు వాడుతున్నది. మన దేశంలో కూడా నీటి కొరత అధికంగానే వుంది. వేసవికాలం పూర్తి స్థాయిలో సమీపించక ముందే భూగర్భనీటి మట్టం పడిపోయింది. గ్రామాలలో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. బోరింగ్ పంపులు పనిచేయడం లేదు. నీళ్లకోసం బిందెలు పట్టుకుని దూరప్రాంతాలకు వెళ్లి (బావుల నుండి) నీరు తీసుకొచ్చే పరిస్థితులు కనబడుతున్నాయి. అనేక ప్రాంతాలలో నీరు దొరికిన చోట నీటి దుబారా చేస్తున్నారు. గ్రామాలలో కుళాయిలు అదేపనిగా నీటిని విడుదల చేస్తున్నాయి. స్నానాల కోసం, బట్టలు ఉతకడానికి విపరీతంగా నీటిని వాడుతున్నారు. ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన లేదు. నీటి కొరతపై ప్రభుత్వం కూడా ప్రజల్లో చైతన్యం కల్పించడం లేదు. జలమే జీవనం - జలం లేనిదే జనం లేరు. ప్రతీ ఒక్కరం నీటి పొదుపుపై విస్తృతంగా ప్రచారం చేద్దాం. ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టుదాం. ప్రతీ ఇంటికొక ఇంకుడు కొంత వుండేలా ప్రచారం కల్పిద్దాం. పశుపక్షాదులకు కూడా నీటి తొట్టెలలో నీరు పోసి వాటి దాహార్తిని తీరుద్దాం. మురికి నీటిని మంచినీటిగా శుద్ధిచేసే ప్రయోగాలు అంతటా విస్తరించాలి. జలచైతన్య కార్యక్రమాలకు శ్రీకారు చుడదాం.

(నేడు "ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా)

సంస్మరణ

నిబద్ధతకు మరోపేరు కా॥ కె.చంద్రప్ప

కె. రామాంజనేయులు

23న సంస్మరణ దినం సందర్భంగా

కర్నూలు జిల్లా పడమటి ప్రాంతం డోన్ తాలుకాలో సీపీఐ ఆవిర్భావం ప్రత్యేక పరిస్థితులలో జరిగింది. భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగష్టు 15న వచ్చినా డోన్ తాలుకాలోని గ్రామాల్లో 1975 తర్వాతనే స్వాతంత్ర్యం వచ్చింది. ఒకే రాజకీయ పార్టీలో పేరు గాంచిన రెండు ప్రధాన ముఠా రాజకీయ నాయకులు ఆధిపత్యం కోసం వర్గాలను పెంచి పోషించి పెత్తనం చెలాయిస్తూ అడ్డువచ్చిన వారిని తొలగించు కునేందుకు హత్యలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహించే వారు. వీరి రాజకీయ స్వార్థం కోసం బలయ్యేది సామాన్యులైన వీరి అనుచరులే. ప్రధాన ముఠా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులెవరు హత్యలకు గురి కాలేదు. పడమటి ప్రాంతాల్లో అనేక గ్రామాల్లో మారణా యుధాలతో పట్టపగలే ఘర్షణలు జరిగేవి. ఈ ఘర్షణల్లో చనిపోయిన వారికి వారి సొంత పేర్లున్నా "ఫలానా ముఠాకు చెందిన మనుషులు ఫలానా ముఠా మనుషులను చంపారని" తప్ప బలియిపోయిన వారి పేర్లు వినపడేవికావు. స్వాతంత్ర్యోద్యమం ప్రభావం కూడా ఈ తాలుకాలో ఏమాత్రం లేకపోవడం కూడా దీనికి కారణం కావచ్చు. గ్రామాల్లో దక్షిణం వైపు ఉన్న బండమీది రామదుర్గం కూడా ఈ ముఠా నాయకుల పెత్తనమే. ఏ విషయంలోనైనా చెల్లుబాటు అయ్యేది. వీరికి వ్యతిరేకంగా అప్పుడప్పుడు తిరుగుబాటు చేసినా సఫలం అయ్యేది కాదు.

నేను నాలుగో తరగతి మా గ్రామంలో చదువుతుండగా రాజకీయ పలుకుబడి కలిగిన నాయకుల నేతృత్వంలో 'శ్రీకృష్ణ రాయభారం' నాటకాన్ని నేర్చుకుని గ్రామంలో ప్రదర్శించారు. వారికి సంబంధించిన మాగ్రామ సర్పంచ్ పేరును మాత్రమే ఆ నాటకం కరపత్రాల్లో ముద్రించారు. ఇదే గ్రామానికి చెందిన ఏవీఎం (అసిస్టెంట్ విలేజ్ మున్సిఫ్ అప్పాల పెద్ద నాగిరెడ్డి) ఉన్నప్పటికి వీరి మధ్య సరిపడక పోవడంతో ఆయనకు రాజకీయ పలుకుబడి తగినంతగా లేదు కాబట్టి ముద్రించలేదు. ఇది జరిగిన కొన్ని నెలల తర్వాత శ్రీకృష్ణ రాయభారం నాటకంలో పాత్రలు లభించని కొంతమంది యువకులు, ఏవీఎం సమీప బంధువు అప్పాల చిన్న నాగిరెడ్డి, మా తండ్రి కె.చంద్రప్పలు కృష్ణార్జున పాత్రదారులుగా "గయోపాఖ్యానం" నాటకంను నేర్చుకొని ఏవీఎం పేరును మాత్రమే ముద్రించి నాటకంను ప్రదర్శించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నాటకంలో 5వ తరగతి చదువుతున్న నేను, మిత్రుడు అప్పాల చిన్న నాగిరెడ్డి కుమారుడైన ఎ.వెంకటేశ్వర రెడ్డి కూడా చిన్న పాత్రదారులమే. వీరికన్నా రాజకీయ పలుకుబడి ముఖ్యంగా గ్రామంలో అప్పటి వరకు తమకు ఎదురు లేకుండా పరిపాలన, పెత్తనం చేస్తున్న వీరు తమ పేర్లను ఆ నాటకం కరపత్రంలో ముద్రించకపోవడాన్ని జీర్ణించుకోలేక అవమానంగా భావించి, గ్రామంలో తమకు అనుకూలంగా వున్న పెద్దలతో మధ్యపెట్టి సంతకాలు చేయించి ఈ నాటకం గ్రామంలో ప్రదర్శిస్తే ఘర్షణలు జరుగుతాయని పోలీసులచే ఆటంకపర్చి రద్దు చేయించారు. నాటకం తేదీ ప్రకటించడంతో గ్రామంలో నాటక పాత్రదారుల బంధువులు, స్నేహితుల సమక్షంలో పోలీసులు భయోత్పాతం సృష్టించి పాత్రదారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నాటకం వేయడానికి స్త్రీ పాత్రదారులైన రంగ స్థల కళాకారులు, అవసరమైన సెట్టింగ్‌ల సామాగ్రి గ్రామానికి చేరుకోగా వారిని బెదిరించారు. జరిగిన ఈ హఠత్‌పరిణామానికి దిక్కు తోచక ఎలాగైనా ఈ నాటకాన్ని ప్రదర్శించి తీరాలని ఆలోచించి మా గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలో పత్తికొండ తాలుకాకు చెందిన సరిహద్దు గ్రామం మారెళ్లలో సీపీఐ తాలుకా కార్యదర్శి చదువుల రామయ్యను కలిసి జరిగిన విషయాన్ని తెలియజేయగా ఆనాడు సీపీఐ జిల్లా కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధులు వై. స్వామిరెడ్డితో సంప్రదించగా జరిగిన అన్యాయాన్ని అనాటి జిల్లా కలెక్టర్ , ఎస్పీకి వివరించి తిరిగి ఆ నాటకం ప్రదర్శించే తేదీని నిర్ణయించారు. ఈసారి గ్రామంలో పోలీసు బందోబస్తుతోనే ఆ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించాం.

పెత్తందార్లపై మొదటి విజయం సాధించిన ఉత్సాహంతో మారెళ్ల మారెళ్ల, రాంకొండ, ఆర్.ఎస్ పెండెకల్, ముక్కెళ్ల తదితర గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో రైతులు, పేద ప్రజలు స్వేచ్ఛను పొందిన సంఘటనల ప్రభావంతో బి.రామదుర్గం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంలో రైతులు చేరడం జరిగింది. గ్రామాల్లో ఆనాడు వీరిని "ప్రజలు"సంఘం" వాళ్లు సంబోధించేవారు. కొద్ది నెలలకే వీరిపై నమ్మకం కలిగి పోరాటాల్లో నిలదొక్కుకో గలరని నాయకత్వం భావించి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గ్రామశాఖను ఆనాటి రాష్ట్ర కమ్యూనిస్టు పార్టి కార్యదర్శివర్గ సభ్యులు వీకే ఆది నారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శి వై. స్వామిరెడ్డి, చదువుల రామయ్య, అప్పటి వరకు వీరికి వెనుదన్నుగా నిలిచిన సీపీఐ డోన్ తాలుకా కార్యదర్శి మిలటరి నాగప్ప, రైతు సంఘం తాలుకా అధ్యక్షులు, పీఆర్ పల్లె గ్రామానికి చెందిన న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో బి.రామదుర్గంలో ఏర్పాటుచేసి, ఈ శాఖకు ప్రథమ కార్యదర్శిగా కె.చంద్రప్పను ఎన్నుకున్నారు. గయోపాఖ్యానం నాటకంలో కృష్ణార్జుల పాత్ర పోషించిన అప్పాల చిన్నా నాగిరెడ్డి, కె.చంద్రప్పలు కమ్యూనిస్టు పార్టీకి కూడా కృష్ణార్జునులుగానే నాయకత్వం వహించారు. వీరితోపాటు శాంతమ్మ గారి పెద్ద హనుమంతు, ఉచ్చి పెద్ద హుసేనప్ప, ఆలంకొండ తిప్పన్న, నెంచి తిమ్మయ్య, హరిజన పైయింటి మాదన్న తదితరులు గ్రామంలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. బి.రామదుర్గం గ్రామం నుంచి ప్రారంభమయిన సీపీఐశాఖలు పంచాయితీ కేంద్రమైన ఎద్దుపెంట, తాడూరు, మిద్దెపల్లి గ్రామాల్లో కూడా శాఖలు విస్తరించాయి. ఎద్దుపెంటలో నాలుగు గ్రామాలకు కేంద్రంగా జరిగిన సీపీఐ బహిరంగసభకు వీకే ఆది నారాయణ రెడ్డి, వై.స్వామిరెడ్డి, చదువుల రామయ్య, మిలటరీ నాగప్ప, చంద్రశేఖర్ తదితరులు హాజరుకాగా ప్రధాన రెవెన్యూ గ్రామం మున్సిఫ్ (వీఎం) నరసింహారెడ్డి సభను ఆటంక పరచడానికి అనేక కుట్రలు పన్నారు. సభ జరిగిన రోజు గ్రామంలో ఉన్న చిల్లర అంగళ్లను కూడా మూసి వేయించారు. బహిరంగ సభ జయప్రదంగా జరిగింది. దాదాపు 100 సంవత్సరాల నుంచి ఫ్యూడల్, పెత్తందార్ల దౌర్జన్యాల వల్ల మగ్గిపోతున్న కటారుకొండ గ్రామం నుంచి నక్కి రామన్న, నక్కి మౌలాలి, షేక్ హరీఫ్, కుమ్మరి బజారిలతోపాటు 10 మంది యువకులు ఈ బహిరంగసభలో పాల్గొని నాయకులతో చర్చించగా అంగీకరించి పార్టీ ఆదేశాల మేరకు నడుచుకోవాలని జాగ్రత్తలు చెప్పి చేర్చుకోవడంతో ఖంగుతిన్న సీపీఐ వ్యతిరేకులు ఎలాగైనా సీపీఐని మొగ్గలోనే తుంచి వేయాలని కుట్రలు పన్నారు. ఈ గ్రామాలకన్నా కటారుకొండలో ఉన్న పార్టీ వ్యతిరేకులు మరింత శక్తివంతులు. చుట్టుపక్కల సుమారు 13 గ్రామాల్లో రెవెన్యూ అధికారులుగా విలేజ్ మున్సిఫ్‌లుగాను, కరణం పోస్టుల్లో ఉండి ఆదిపత్యాన్ని చెలాయించారు. రాజకీయ అండతో అప్పుడప్పుడే తమకు అడ్డుగావున్న సీపీఐని దెబ్బతీయాలని బి.రామదుదర్గం, ఎద్దుపెంట, తాడూరు, కటారుకొండ తదితర గ్రామాల్లో పార్టీ కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు బనాయించి డోన్, కర్నూలు కోర్టులకు తిప్పారు. ఈ గ్రామాల్లో నాయకత్వం వహిస్తున్న ముఖ్య నాయకులపై అనేక హత్యాయత్నాలు జరిగాయి. 1978లో బి.రామదుర్గం గ్రామంలో పశువులు, గొర్రెల కోసం వేసిన కొట్టంలో కె.చంద్రప్ప నిద్రించాడనే అక్కసుతో పెట్రోలుపోసి అర్ధరాత్రి సమయంలో నిప్పు పెట్టారు. ఆ రోజు అక్కడ నిద్రించకపోవడంతో చంద్రప్ప ప్రాణాపాయాన్ని తప్పించుకున్నారు. కొట్టంలో నిద్రిస్తున్న పాలేరు, బి.ఓబులేసు అప్రమత్తమై తనతోపాటు నిద్రిస్తున్న చంద్రప్ప కుమారులు కె.మల్లికార్జున, కె.సుంకన్నలను బయటకు తీసుకువచ్చి కాపాడారు. మంటల్లో గొర్రెలు, వ్యవసాయ పనిముట్లు, ఎద్దులు, కాలిపోయాయి. తీవ్ర గాయాలతో 10 రోజులకు ఒక ఎద్దు మరణించింది. 1979లో నక్కి రామన్న కటారుకొండ గ్రామం నుంచి మల్యాల ఆర్ఎస్‌కు వచ్చి డోన్‌లో కోర్టు వాయిదాకు రావడానికి రైలు కోసం ప్లాట్ ఫారంపై 10మంది కార్యకర్తలతో వేచివుండగా కిరాయి హంతకులతో బాంబులువేసి నక్కి రామన్నపై దాడిచేసి వేటకొడవళ్లతో నరికి వేశారు. ఈ దాడిలో పార్టీ కార్యకర్త, యువకుడు ఆర్‌బి చిన్న గోవిందు మరణించగా నక్కి రామన్న రక్తపు మడుగులో అపస్మారక స్థితిలోవుండగా మరణించాడని భావించి వెళ్లిపోయారు. కొన ఊపిరితో వున్న రామన్నను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాణాలతో బయటపడ్డారు. దాడిలో ఆయన కుడి చేయి, భుజం దెబ్బతిని కోలుకున్నారు.

ఎద్దు పెంట గ్రామంలో సీపీఐ కార్యదర్శి ఎస్. పెద్దయ్యపై గ్రామంలో పోలీసులచేత బహిరంగంగా ప్రజల సమక్షంలో చిత్రహింసలకు గురి చేశారు. డోన్ పట్టణ కేంద్రంగా సీపీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో తాగునీరు, రోడ్ల నిర్మాణం, పాఠశాలల నిర్మాణం, ప్రజల తక్షణ సమస్యలపై స్పందించి ప్రత్యర్థుల ఎత్తుగడలను త్రిప్పికొట్టడం జరిగింది. అనేక ఘర్షణలు జరిగినా అక్రమ కేసులు బనాయించినప్పటికి కొద్ది గ్రామాలయినప్పటికి పరిస్థితుల కనుగుణంగా పార్టీ ఆదేశాల ప్రకారం పార్టీని విస్తరించడంలో సమిష్టిగా కృషి చేయడంలో కె.చంద్రప్ప చురుకైన పాత్ర పోషించారు. బి.రామదుర్గంలో అంతకుముసుపు లేని పోస్టు, ఆఫీస్‌బేరర్స్‌ను ఏర్పాటుచేసి అందులో దళిత యువకునికి ఉద్యోగం కల్పించడంలో కృషి చేశారు. సీపీఐ అండతో ప్రత్యర్థులకు ధీటైన సమాధానం చెప్పడంతో పార్టీ బలపడంతో 1980లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ఎద్దుపెంట గ్రామ పంచాయితీకి సీపీఐ అభ్యర్థిగా అప్పాల చిన్న నాగిరెడ్డి ఎకగ్రీవంగా ఎన్నికకాగా, కటారుకొండ గ్రామ పంచాయితీకి పెత్తందారి ప్రత్యర్థిని ఓడించి కామ్రేడ్ నక్కి రామన్న 100 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ రెండు గ్రామ పంచాయితీలు పక్కపక్కనే ఉండటం విశేషం.

అనాటి నుంచి సీపీఐ డోన్ తాలుకాలో ప్రధాన రాజకీయ శక్తిగా ఎదగడానికి అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నది. ప్రత్యర్థుల పెత్తనాన్ని పడగొట్టే క్రమంలో వీరి ఆగడాలకు రామన్న, మల్యాల రామచంద్రుడు, లక్షంపల్లి బలరాముడు, కలచట్ల పెద్ద రాజు, సంజీవ గాంధీ, కంబగిరి వంటి అనేక మంది కామ్రేడ్స్ హత్యలకు గురి అయ్యారు. పేద హరిజన, గిరిజన, బలహీన వర్గాల ప్రజలకు సాగు భూములు, ఇండ్ల స్థలాలు, మౌలిక సమస్యలు, తాగునీరు, రోడ్లు, పాఠశాలల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుగా పార్టీకి ఎద్దుపెంట, కటారుకొండలోపాటు అనేక గ్రామాల్లో పార్టీ విస్తరించింది.

కమ్యూనిస్టు పార్టీ ఈ విధంగా విస్తరించడంలో పునాదిగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకొని వెళ్లడంలో కామ్రేడ్ కె.చంద్రప్ప వంటివారు పట్టుగొమ్మలుగా నిలిచారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన చంద్రప్ప పార్టీ కోసం ప్రత్యర్థుల దాడులను తట్టుకొని ఆర్థికంగా నష్టపోయి మరొకవైపు వరుస కరువులతో ఆర్థికంగా ఎంతో దెబ్బతిన్నారు. అప్పులపాలై తనకు వారసత్వంగా వచ్చిన దాదాపు 7 ఎకరాల పొలాన్ని కోల్పోయినప్పటికి పార్టీపట్ల విశ్వాసం చెక్కు చెదరలేదు. గ్రామాల్లో పెత్తందార్ల ఆగడాలను వ్యతిరేకించే క్రమంలో వ్యక్తిగత కక్షలవైపు ఏనాడు ఆలోచించలేదు. పెత్తందార్ల మనస్తత్వాన్ని ఓడించారు తప్ప హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదు. తన పొలం చుట్టూ తనను వ్యతిరేకించే రాజకీయ ప్రత్యర్థుల పొలాలు ఉన్నప్పటికి అనవసరమైన వివాదాలకు ఏనాడు తావు ఇవ్వకుండా, తాను నమ్మిన పార్టీపట్ల తన తుదిశ్వాస వదిలేవరకు పార్టీ సభ్యునిగా కొనసాగారు. కొన్ని సంవత్సరాల క్రితం నాయకత్వ బాధ్యతల్లో లేనప్పటికి పార్టీ చేపట్టే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనడమేగాక పార్టీ కార్యాలయానికి తరుచుగా వస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేసేది "కమ్యూనిస్టు పార్టీ మాత్రమే"నని, దేశంలో మార్పు రావాలంటే అందరూ సమగ్రంగా జీవించే సోషలిస్టు సమాజం కమ్యూనిస్టు పార్టీ ద్వారానే సాధ్యమని, ఉన్న వారికి ఊడిగంచేసే భూర్జువ పార్టీలు ఏనాడు రైతాంగం, కార్మికులు, కష్టజీవుల సమస్యలు పరిష్కారం చేయవని, కార్యకర్తలకు నిరంతరం నూరి పోసేవారు. తన కుటుంబ సభ్యులను, సమీప బంధువులను పార్టీలో పని చేసేందుకు ప్రోత్సహించే వారు. అందుకే రాజకీయాలకు అతీతంగా గ్రామంలో కామ్రేడ్ చంద్రప్ప పార్టీపట్ల ఉన్న నిబద్ధతవల్ల గౌరవాన్ని పొందారు.

ఈనాడు తాలుకాలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల్లో అన్ని వర్గాల్లో విద్యార్థులు, రైతులు, యువకులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజల కోసం చురుకుగా పనిచేస్తూ ప్రజల ఆదరణాభిమానాలను పొందుతున్నాడంటే కమ్యూనిస్టుకి వ్యవస్థాపకులుగా చంద్రప్పవంటి వారు ఎన్నో కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొంటు తమ తర్వాత తరానికి ఎర్ర జెండాను అధరించడం వల్లనే పార్టీ పురోగమిస్తోంది. చంద్రప్ప ఫిబ్రవరి 1న మృతి చెందారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటు. ఆయన ఆశయాన్ని మరింత ముందుకు తీసుకుని పోవడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి.

వ్యాస రచయిత : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
22 మార్చి 2018



ఆందోళన !

విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న జెఎన్‌యు ప్రొఫెసర్‌కి వ్యతిరేకంగా జెఎన్‌యు (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ) విద్యార్థులు నిరసన తెలియజేస్తున్న దృశ్యం. న్యూఢిల్లీలోని వసంత్ కుంజ్ పోలీస్ స్టేషన్ వద్ద ఈ ఆందోళన జరిగింది.

పాటే ఆయన ప్రాణం..!



శ్రావ్యమైన గొంతు ఆయనకు జన్మత వచ్చిన వరం. సంగీత సప్తస్వరాలు ఆయన చుట్టూ అల్లుకున్న బంధాలు. పాత పాటలంటే ఆయనకు పంచ ప్రాణాలు. ఘంటసాల అంటే చెప్పలేనంత అభిమానం. అందుకే మూగబోతున్న పాత పాటలకు ప్రాణం పోస్తున్నారు. మృదు మాధుర్యమైన పాత పాటలపై మక్కువ పెంచేందుకు ఆయన ఎనలేని కృషి చేస్తున్నారు. సొంత వ్యయంతో సంగీతానికి ఆదరణ పెంచే ప్రయత్నం చేస్తున్నారు. దేశవిదేశాల్లో సంగీత కళాశాలలు నిర్వహిస్తున్నారు. ఆయనే శ్రీకాకుళం జిల్లాకు చెందిన శరత్‌చంద్ర.

శరత్ చంద్ర తల్లిదండ్రులు పద్మావతి, బ్రహ్మం. శ్రీకాకుళం జిల్లా గార మండలం గొంటి పంచాయతీ లంకపేట గ్రామానికి చెందిన శరత్‌చంద్ర పదోతరగతి వరకూ శ్రీకూర్మం ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆయనకు చిన్ననాటి నుంచీ పాటలంటే అమితప్రాణం. అందులోనూ ఘంటసాల మధుర గీతాలంటే చెవికోసుకునేవారు. పాటలు వినడమే కాదు పాడడంపైనా చిన్నతనం నుంచీ శ్రద్ధ చూపారు. పాడుతూ, పాడుతూ చక్కని రాగాన్నీ అలవర్చుకున్నారు. పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో శరత్ చంద్ర పాడిన పాటలకు ముగ్ధులు కాని వారెవ్వరూ లేరు. ఈ క్రమంలోనే తన గురువు కె.వి.రమణారావు సలహా, సూచన మేరకు ఓ వేడుకలో బతుకుతెరువు సినిమాలో 'అందమె ఆనందం – ఆనందమే జీవిత మకరందం' అనే పాటను పాడి సినీలోకానికి తనగొంతును పరిచయం చేశారు. అప్పటి నుంచి పాటలు పాడడం అలవాటుగా మారింది. కచేరీలు కోసం పరితపించే శరత్‌చంద్రకు ఆర్థిక పరిస్థితి సహకరించక పోవడంతో శ్రీకాకుళానికి చెందిన రామక్రిష్ణ, అలివేలు మంగతాయారులు ఆర్థిక సహకారం అందించారు. వారి సహకారంతోనే హైదరాబాద్ కూడా వెళ్లారు. అక్కడ సినిమా పాటలకోసం శ్రమిస్తూనే మరోపక్క జీవనోపాధిని వెతుక్కున్నారు. ఇటువంటి సమయంలోనే కోరమండల్ సిమెంట్స్ వారు నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న శరత్‌చంద్ర గానం అక్కినేని నాగేశ్వరరావు, సి.నారాయణరెడ్డిలను ముగ్దులను చేసింది. తర్వాత కాలంలో సినారె సమక్షంలో కచేరీలు కూడా నిర్వహించారు. సంగీతం మీదున్న మక్కువతో పాటు ఘంటసాల పాటలంటే అమితమైన ప్రేమను పెంచుకున్న శరత్‌చంద్ర లంకపేట గ్రామంలోని ఆరెకరాల స్థలంలో ఘంటశాల స్మారక పీఠాన్నీ ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఈ స్మారక పీఠంలో ఘంటశాల పాటలు వినసొంపుగా వినిపిస్తుంటాయి. దీంతో పాటు రాష్ట్రంలో హైదరాబాద్, విశాఖ, ఏలూరు, మహబూబ్‌నగర్, తిరుపతి, గుంటూరు, వరంగల్ ఏడు ప్రాంతాల్లో సంగీత కళాశాలలను ఏర్పాటు చేశారు. న్యూజెర్సీ, చికాగో, వర్జీనియా, డెట్రాయిట్, న్యూయార్క్ టెక్సాస్, కాలిఫోర్నియా లాంటి విదేశీ నగరాల్లోనూ సంగీత కళాశాలలను ఏర్పాటు చేశారు. సామాజిక, సాంస్కృతిక, దృక్పథంతో హైదరాబాదులో ఒక ట్రస్టును కూడా ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఆరువందల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఎంతెత్తుకు ఎదిగాం అన్నది కాదు, గ్రామానికి ఎంత ఉపయోగపడ్డాం అన్న ఆశయంతో పనిచేయాలనే శరత్‌చంద్ర లంకపేట గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా సంస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిరుద్యోగులకు శిక్షణనిస్తూ ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తున్నారు. వివేకానందుని స్ఫూర్తితో ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆయన చెబుతున్నారు. 60 సంవత్సరాలు దాటిన వృద్దులకు చేయూత కల్పించాలనే ఉద్దేశంతో గ్రామంలోనే ఘంటశాల వాయిస్ క్లబ్‌ని ఏర్పాటు చేశారు. యు.ఎన్.ఓ అనుబంధ సంస్థ శరత్‌చంద్రకు గౌరవ డాక్టరేట్ పట్టాని ప్రదానం చేసి సత్కరించింది.



అక్కినేని, సినారెతో

శరత్‌చంద్ర కళాభిమానానికి ఎందరో విశిష్ట అతిధుల నుంచి అవార్డులు, సత్కారాలు, సన్మానాలు పొందారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య, సినీ నటులు గుమ్మడి వెంకటేశ్వరరావు, అక్కినేని నాగేశ్వరరావు, సి.నారాయణరెడ్డి వంటి ప్రముఖుల నుంచి శరత్‌చంద్ర ఎన్నో అవార్డులనూ అందుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గుమ్మడి వంటి ప్రముఖులతో...



జమునతో అవార్డును తీసుకుంటున్న దృశ్యం

యాపిల్ ప్యాక్!

యాపిల్ మన మేనుకి అంతర్గతంగానే కాదు బహిర్గతంగానూ ఉపకరిస్తుంది. ఇది చర్మానికి రెండు రకాలుగానూ పునరుత్తేజాన్ని ఇస్తుంది. అందుకే ఈసారి యాపిల్ ప్యాక్‌లు వేసి చూడండి. యాపిల్‌లో ఉండే విటమిన్ సీ చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడం ద్వారా వదులు కాకుండా చూస్తుంది. ఇందులో ఉండే కాపర్ సూర్యుని నుంచి వచ్చే అతి నీల లోహిత కిరణాల నుంచి చర్మాన్ని కాపాడుతుంది. యాపిల్‌లో ఉండే యాపిల్ ఏ కేన్సర్ కారక కణాలను దరిచేరకుండా చేస్తుంది. ఇందులో ఉండే టానిక్ యాసిడ్ చర్మాన్ని మెత్తగా, మృదువుగా చేస్తుంది. మరి ఇన్ని ప్రయోజనాలను అందించే యాపిల్ పూతలు ఎలా వేయాలో తెలుసుకుందామా!



- మీ చర్మానికి అప్పటికప్పుడు మంచి మెరుపు రావాలంటే ఒక యాపిల్, ఒక కప్పు నీళ్ళు తీసుకోండి. యాపిల్‌ను తొక్క తీయకుండా చిన్న ముక్కలుగా కట్ చేసి నీళ్లు పోసి మిక్సీలో వేసి బాగా మెత్తగా చేయండి. ఈ గుజ్జును ముఖానికి పట్టించి పావుగంట ఉంచండి. ఇది ఆరిన తర్వాత చల్లని నీళ్ళతో కడిగేయండి. ఈ పూత మొదటిసారి వేసినప్పుడే మీ చర్మంలో వచ్చే మార్పు మీకు స్పష్టంగా కనిపిస్తుంది.
- మీ చర్మానికి ఎప్పుడూ మెరుపు ఉండాలంటే ఇలా చేసి చూడండి. యాపిల్ తొక్క, ఒక టీ స్పూన్ తేనె తీసుకోండి. యాపిల్ తొక్కి తీసి మిక్సీలో వేసి మెత్తగా చేయండి. ఇందులో తేనె కలిపి పేస్ట్‌లా చేయండి. దీనిని ఫేస్‌కి పూతలా వేసి పావుగంట ఉంచండి. 15 నిముషాల తర్వా గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. మీరు కోరుకున్న ఫలితం కావాలంటే వారానికి ఒక రోజైనా ఈ పూత వేయండి.
- మొటిమలు పోగొట్టుకోవాలనుకుంటే ఈ ప్యాక్ వేసుకోండి. యాపిల్‌లో ఉండే సలిసిలిక్ యాసిడ్ మొటిమలను పోగొడుతుంది. ఇందుకు ఉపయోగపడే యాపిల్ ప్యాక్ మొటిమల వల్ల వచ్చే మచ్చలు, నల్ల మచ్చలను కూడా పోగొడుతుంది. మంచి ఫలితం కోసం వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసి చూడండి. ఈ ప్యాక్ కోసం ఒక యాపిల్, ఒక టీ స్పూన్ తేనె, ఒక టీ స్పూన్ నిమ్మరసం తీసుకోండి. యాపిల్‌ని బాగా చిన్న ముక్కలు తరిగి వాటిని పిండి రసం తీయండి. ఇందులో తేనె, నిమ్మరసం కలిపి ముఖమంతా రాయండి. 20 నిముషాల తర్వాత చల్లని నీళ్ళతో కడిగేయండి.



- పొడిబారిన చర్మాన్ని సాధారణ స్థితికి తీసుకురావాలా? అయితే ఇలా చేయండి. అర చెక్క యాపిల్, ఒక స్పూన్ ఓట్‌మీల్, ఒక స్పూన్ తేనె, ఒక స్పూన్ గుడ్డు సొన తీసుకోండి. యాపిల్‌ని తురిమి పెట్టుకోండి. ఓట్‌మీల్‌ని మిక్సీలో వేసి పొడిలా చేసుకోండి. యాపిల్ తురుములో ఈ పొడి వేసి మరోసారి గ్రైండ్ చేయండి. ఇందులో తేనె, గుడ్డుసొన కూడా కలిపి ముఖానికి పట్టించి పావుగంట ఉంచండి. 15 నిముషాల తర్వాత చల్లని నీటితో కడిగేసి పొడిగుడ్డతో తుడవండి. వేగంగా ఫలితం కావాలంటే వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకోండి.

అల్పాహారానికి ముందే వ్యాయామం



వాతావరణం చల్లగా ఉంటే పక్క మీద నుంచి లేవాలనిపించదు. అలాగే వాతావరణం వేడిగా ఉండి రాత్రిపూట నిద్రపట్టనివారూ ఉదయాన్నే లేవలేరు. ఎప్పుడూ రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోయేవారు పొద్దునే లేవనేలేవరు. నేటిరోజుల్లో సూర్యోదయాన్ని చూసేవారు అతి తక్కువమందే. ఈ పద్దతి ఆరోగ్యానికి అంత మంచిది కాదు. వ్యాయామం చేసే అలవాటు ఉన్నవాళ్ళకి ఇది అస్సలు సూటవదు. రోజూ మేల్కొనే సమయం కన్నా ఒక గంట ముందుగానే నిద్రలేచి వ్యాయామం చేస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఉదయం అల్పాహారానికి ముందే వ్యాయామం చేస్తే రకరకాలైన ఆరోగ్యసమస్యలు దూరమవ్వడంతో పాటు బరువు తగ్గుదల వంటి లాభాలున్నాయి. అల్పాహారానికి ముందు ఎలాంటి వ్యాయామాలు చేయాలనే ప్రశ్న అందరిలోనూ ఉంటుంది. నడవడం, పరిగెత్తడం, సైకిల్ తొక్కడం, జాగింగ్, ట్రెడ్‌మిల్ వంటి తేలికగా ఉండే వ్యాయామాలు ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మరికొందరికి ఖాళీ పొట్టతో చేయచ్చా లేదా ఏదైనా తిని చేయాలా అనే అనుమానాలున్నాయి. ఒక గ్లాసు పాలు, గుప్పెడు నానబెట్టిన బాదం గింజలు తీసుకొని వ్యాయమం చేయవచ్చు లేదా ఖాళీ పొట్టతో చేస్తే మరీ మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. అల్పాహారానికి ముందే వ్యాయామం చేయడం వల్ల లాభాలివీ...

- మీరు నిద్రపోయే సమయంలో శరీరంలోని జీవక్రియల స్థాయిల్లో మార్పులు వస్తాయి. అందుకని ఉదయం అల్పాహారానికి అరగంట ముందే వ్యాయమం చేస్తే మీ శరీరంలో శక్తి పెరుగుతుంది.
- ఖాళీ పొట్టతో చేయడం వల్ల చాలా రకాల గ్యాస్‌ట్రబుల్స్, అల్సర్ వంటి సమస్యలతో పాటు కొవ్వునీ నివారించవచ్చు. దీని వల్ల బరువు తగ్గుతారు. సరైన కేలరీలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడమూ అలవాటు అవుతుంది.
- ఖాళీ పొట్టతో వ్యాయామం చేస్తే పొట్టలోని ట్రిగ్గర్ హార్మోన్స్ స్థాయిల్లో మార్పులు వస్తాయి. అంతేకాక అనవసరపు కొవ్వు కరిగి కండరాల పెరుగుదలకు సహకరిస్తుంది. వ్యాయామం అనంతరం ఎక్కువ ప్రోటీన్స్ వున్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి.
- మీరు రోజు వ్యాయమం చేసినట్లయితే మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల్ని కూడా నివారించవచ్చు. వ్యాయామం చేయడం వల్ల మీ శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది.
- తేలికపాటి వ్యాయామాల వల్ల రక్తపోటు అదుపులోకి వస్తుంది.
- వ్యాయామాల వల్ల మంచి నిద్ర మీ సొంతమవుతుంది. అంతేకాక పూర్తి రోజంతా తాజాగా ఉంటారు.
- గుండెకు రక్త ప్రసరణ జరుగుతుంది. రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.
- రోజువారీ వ్యాయామం మానసిక ఆరోగ్యానికి సహకరిస్తుంది. ఒత్తిడినీ తగ్గుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

చూడచక్కని ట్రేలు!

వేసవి సెలవులతో పాటే ఇళ్ళకు అతిథుల రాకపోకలూ ప్రారంభమవుతాయి. ఇంటివి వచ్చినవాళ్ళకి మర్యాదల కోసం మన చూపు ట్రేల మీదకు వెళుతుంది. ఆతిథ్యం ఇచ్చేవాళ్ళే కాదు పుచ్చుకునేవాళ్ళ కన్నూ దీని మీద పడుతుంది. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టే ట్రేల తయారీదారులు పలు రకాల ప్రింట్లతో కూడిన ట్రేలను మార్కెట్‌లో విడుదల చేస్తున్నారు. అలాంటి కొన్ని కొత్త డిజైన్లే ఈ ట్రేలు













డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఇప్పడనిస్తుంది నాన్నకి - 'అయ్యో నేనూ కాంగ్రెసు లోంచి బైటికి వచ్చేసివుంటే యీ ప్రమాదంలో పడకపోదునే' అని. పత్రికలనన్నింటినీ అమ్మ నాచేత చదివిస్తుంది. నన్ను బలవంతం చేసినట్టు కాకుండా తనకి వొంట్లో బాగుండం లేదనో - తొందరగా సభకి వెళ్ళాలి, అంచేత తీరిక లేదనో - అని అంటూ - నేను గట్టిగా చదువుతే తను వింటూన్నట్టు లేకపోతే - నేను బద్ధకించి అన్ని పత్రికలనీ - కాంగ్రెసువి, కాంగ్రెసు వ్యతిరేకంవి - చదవనని అమ్మకి భయం! మంచి ఎత్తు వేసింది అమ్మ. నాన్న బొంబాయి ప్రయాణం యెల్లుండికి పెట్టుకున్నారు. నిన్న సాయంత్రం అంది అమ్మ - "అమ్మాయీ, నీ పుట్టినరోజు బుధవారం - మర్చిపోయావా యేమిటి? శాస్త్రితో చెప్పి నేనందుకోసమే మా ప్రయాణం గురువారానికి నిశ్చయం చేశాను. నువ్వు యెవరెవరిని పిలుస్తావో పిలువు. మళ్ళీ వచ్చేవాళ్ళకి వ్యవధి వుండదు" అంది. "ఏమి పుట్టిన రోజమ్మా దేశం అంతా మహా సంక్షోభంలో వుంటే! పోనిస్తూ" అన్నాను.

(నిన్నటి సంచిక తరువాయి)

"దేశం గగ్గోలుగా వుంటే పబ్బాలు - పండుగలూ మానుకుంటామా? పుట్టులు - చావులు, తిళ్ళు - తిప్పలు ఏవి మానుకున్నాం గనక? నీకు డైబ్బై యేళ్లొస్తే, అప్పుడూ వైరాగ్యంకాని, ఇప్పుడేమిటి హోటేలు వాళ్ళకి టెలిఫోను చేస్తావో? ఇంట్లో చేయించుతావో - నీ యిష్టం" అంది అమ్మ. నేను చెన్నపట్నంలో అమ్మ ఇంట్లో వచ్చి పడిన వారం రోజులకే - నాన్న నన్ను అడిగి మా కన్నతండ్రిపేరు, తండ్రిపేరు, ఇంటిపేరు, వూరిపేరు తెలుసుకుని వెంటనే జాతకం ఒకటి తయారుచేయించేశారు, పింగళ నామ సంవత్సరంలో పుట్టినట్టు నిశ్చయించి, ఆడిపిల్లలకి జాతకం లేకపోతే యెలాగు అంటూ. నాన్న ముందు వెనుకలు అన్నా ఆలోచిస్తారు. కాని ఆయన అనుకున్నట్టు జరగడంలేదు కొన్ని సంగతులు మాత్రం. ఈ వర్కింగు కమిటీ తీర్మానం వొకటి. ఆయనకి బాగా బెంగ పడిపోయింది. మొన్నంది అమ్మ: "ఏవాయ్ మైడియర్ షేక్స్పియర్! ముఖం వేలవేసినావ్!" "నీకన్నీ వేళాకోళాలేను శాంతం! కాకపోతే ఏవిటి ఈ గాంధీగారి రాతలు! రేపొద్దున్న యెలాగా బొంబాయిలో సమావేశం వుండనే వుంది. దానికి ముందుగా యెందుకు ఈయన ఈ వ్యాఖ్యానాలన్నీ. 'బాహాటమైన విప్లవం - రాజీలేదు - బేరంలేదు - జైళ్ళులేవు' - ఎందుకిదంతా! మనలందరినీ చంపడానికి కాకపోతే!" అని ఒకటే విసుక్కోవడం... సాయంకాలం మౌంట్‌రోడ్డు, చైనా బజారు వెళదాం అని బయలుదేరాను - ప్రయాణానికి అమ్మ యేవో వస్తువులనుకొనమంది. అవి కొనడానికీ, రేపు ఫలహారానికి కావలసిన వస్తువులు పురమాయించడానికిన్నీ. బజారు పని అయిపోయి ఇంటికి వెళ్ళిపోతూ త్రోవలో ఖద్దరు వస్త్రాలయం కనపడితే - ఇంట్లో తువాళ్ళులేవు, కొందాం - అని దిగి లోపలి కెళ్ళా. 'కొత్తరకం తువాళ్ళు వచ్చాయండీ' అని యేవో చూపించాడు. బాగానే వున్నాయి. ఆరు జతలు ఇవ్వండి అన్నా. లెక్కపెట్టి 'అయ్యో ఐదుజతలే వున్నాయండి - మీరిక్కడే వుండండి - గిడ్డంగికి వెళ్ళి - ఓ ఘడియలో రెండు పట్టుకువస్తాను' అంటూ పరుగెత్తి వెళ్ళాడు. నాలుగు నిమిషాలు చూశా. రాలేదు. సొమ్ము యెంతైందో కనుక్కుని 'నాకింకా పనులు వున్నాయి. మా డ్రైవరుని ఇప్పుడే డబ్బిచ్చి పంపిస్తాను. అతడి చేతికి సరుకు ఇవ్వండి' అని చెప్పి పువ్వులంగడి దగ్గర నిలబెట్టిన కారుదగ్గరకెళ్ళి "అమృత రావుగారూ! ఖద్దరుకొట్లో తువాళ్ళు ఆరు జతలు పుచ్చుకున్నాను ఈ డబ్బిచ్చి ఆ శాల్తీలు తీసుకొచ్చిపెడతారా - శ్రమనుకోక!" అన్నా. "సరేలెండి" అని తను చదువుతూన్న పుస్తకాన్ని ఆ సొరుగులో తోసేసి సొరుగు తలుపు మూసేసి వెళ్ళాడు. అతను వెళ్ళగానే స్విచ్చిన్ని వేలాడుతూన్న తాళాలతో సొరుగు తీసి ఏమిటా పుస్తకం అని తీశాను. "ఏరియో నాటిక్స్" గ్రంథకర్త క్రిస్టోఫర్ సెంటు జాన్‌స్ప్రిగ్ - లండను 1936. ఓహో ఇతను మోటారు ఇంజనీరింగే కాకుండా విమానాల గురించి కూడా చదువుతున్నాడే అనుకున్నాను. పుటలు తిరగేసి చూదును "కమ్యూనిస్టు పార్టీ సర్కులర్లు" అని మధ్య మధ్యని పుటలు! పుస్తకాన్ని మళ్ళీ సొరుగులో వుంచేశాను యెప్పట్లా. ఇంతట్లో ఖద్దరు వస్త్రాలయాన్నించి వచ్చాడు అమృతరావు. నేనింగ్లీషున అడిగేను: "మిస్టర్ అమృతరావ్! క్షమించండి... మిమ్మల్ని రెండు ప్రశ్నలు అడగదలచుకున్నాను.



దయచేసి జవాబు చెబుతారా?" "మోటారు ఇంజనీరింగు గురించి అయితే తప్పకుండా చెబుతాను. మరే విషయమేనా అయితే ప్రశ్న తెలిసిన తర్వాత కాని చెప్పను" అన్నాడు తణుకు బెణుకూ లేకుండా. "క్రిస్టొఫర్ కాడ్వెల్" అని జవాబు చెప్పాడు. "రేపు నా పుట్టినరోజు పండుగ చేసుకుంటున్నాను. తేనీటి విందుకు ఆరుగంటలకి కొద్దిమంది స్నేహితులను మాత్రమే పిలుస్తున్నాను. మిమ్మలినికూడా దయ చేయమని కోరుతున్నాను" అన్నాను. "మీ మోటారు డ్రైవరు మీ స్నేహితుడెట్లా అవుతాడు?" అన్నాడు. "అతనికి అభ్యంతరం లేకపోతే ప్రతిబంధం యేముంది?" అన్నాను. "మీ తల్లి తండ్రులూ ఒప్పుకుంటారా?" అన్నాడు. "మీ తల్లితండ్రులు ఒప్పుకొంటే మా తల్లితండ్రులు ఒప్పు కుంటారు?" అన్నాను. "షేక్స్పియర్ ఎక్కడు న్నాడు?" అని అడిగేడు. "లెనిన్ సాహవాసం చేస్తున్నాడు. వారిద్దరి సహవాసం నేను చేస్తున్నాను" అన్నాను. "మీరు వారవుతారా?" అన్నాడు. "ఆరునెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారని శాస్త్రంకదా?" అన్నాను. గాంధేయం - కమ్యూనిజం ఒకటవుతుందా?" అన్నాడు. "ఒకటి మిధ్య అవుతే మరొకటి వాస్తవం అవుతుంది" అన్నాను. "ఏది మిధ్య? ఏది వాస్తవం అని అడిగేడు. "భావం మిధ్య, పదార్థ వాస్తవం" అని అడిగేడు. "భావం మిధ్య, పదార్థం వాస్తవం" అని జవాబు చెప్పాను. "మీ భావాలు మిధ్యలు కావుకద?" అన్నాడు నవ్వు తూను. "నాభావాలు విశ్వపదార్థ జనితాలు" అన్నాను తడుముకోకుండా. "మీ భావాలకి నా ధన్యవాదం. మీ పదార్థాలకి రేపు నా స్వీకారం!" అన్నాడు నవ్వుతూ.

......రాత్రి నిద్దర పట్టలేదు. నాకు తొందర లావు. ముందు వెనక ఆలోచించకుండా అమృతరావుని ఆహ్వానించేశానే. ఏం తికమకలొస్తాయో ఏమిటో? అమ్మతో చెప్పవలసింది. చెప్పకుండా చేశాను. ఇపుడు చెప్పడానికి జంకుగా వుంది. అతన్ని పిలిచేసిన తరువాత చెప్తుతే, అమ్మమాత్రం ఏం అంటుంది? ఏమంటే ఏం ప్రయోజనం? ఆ ఖాకీ లాగూతోనూ. ఖాకీ కమీజుతోనూ చెయ్యంతా నూనోడుతూ ఈ చేతిలో ఒక రెంచీ, ఆ చేతితో ఒక సుత్తీ పట్టుకొస్తాడేమో- మెళ్ళో ఎర్రరుమాలు కట్టుకుని? అక్కడికి ఒక్క కొడవలి తక్కువ అవుతుంది! నాన్న ఏం అల్లరి చేస్తారో ఏమిటో? మిగతా అతిథులతో ఏం వాగ్యుద్ధం వస్తుందో? అంతకంటే అరుదు. పెద్దనాన్న సాక్షాత్తు హిట్లరు భక్తుడు. అరెరే! చిక్కులో పడిపోయానే! కరటకశాస్త్రుర్లు అన్నట్టు - చిక్కన్న చిక్కుకాదు! బొట్టుచేతిలో గొల్లభామని చిక్కుకుపోయాను!...

ప్రొద్దునే కాఫీవేళకి కిందికి దిగేను. అమ్మ, నాన్న పాపాయి ఎదురుగుండా వచ్చారు. అమ్మ కౌగలించుకుంది. "అమ్మాయీ! నా ఆశీర్వచనం అందం ఆనందం ఆరోగ్యంతో నూరేళ్ళు ఆయుష్షు!" అని బొటుపెట్టి ముద్దుపెట్టుకుంది. పొందూరు చీరె కానుక ఇచ్చింది. నాన్న దగ్గర కెళ్ళాను. నాన్న తలమీద అంక్షితలు జల్లి "శీఘ్రమేవ వివాహ ప్రాప్తిరస్తు!" అని నా బుగ్గ గిల్లి నూరు రూపాయల నోటు చేతిలో పెట్టారు. పాపాయి నా రెండు బుగ్గలు ముద్దుపెట్టుకుని "సుభక్కా! నువ్వెక్కడికీ వెళ్ళకుండా నా దగ్గరే వుండిపోవే!" అంటూ తను అల్లిన చేతి రుమాలిచ్చింది. నాన్నతో "నాన్నా! మనం లండనులో వున్నప్పుడు సుభక్క బస్ డ్రైవరుని పెళ్ళాడుతాను అనేది కదూ - నాన్నా?" అంది. పాపాయీ! ఇప్పుడు సుబ్బడికి బుద్దొచ్చిందే! ఏమే సుబ్బడూ." అన్నారు నాన్న నవ్వుతూను. "పాపాయ్! సుభక్క వయస్సప్పుడు నాకు బుద్ధి రాకపోగా అసలు మతే పోయిందే!" అంది అమ్మ, నన్నూ పాపాయిని దగ్గరకి తీసుకుని. "ఏమిటి శాంతం, చిన్నపిల్లలముందు యేమిటా హాస్యాలు?" అన్నారు నాన్న.

సరిగ్గా ఆరుగంటలకే వచ్చాడు జనార్ధనం. అందరికంటే ముందుగా అతన్ని అమ్మకి నాన్నకి పరిచయం చేశాను. జనార్ధనం అసిస్టెంటు డిప్యూటీ చీఫ్ ఇంజనీరు హోదా, మిలిటరీ దుస్తులూ, మేజరు లాంఛనాలు నాన్నకి బాగా నచ్చినట్టున్నాయి. పరిచయం అవగానే నాన్న అతనితో వెంటనే బాతఖానీలోకి దిగేరు. జనార్ధనం ప్రవర, గోత్రం, బిరుదావళీ అన్నీ తెలుసుకొన్నారు. కాని దాంతోకూడా ఇతనికి ఎన్నివేలు బ్యాంకిలో నిల్వవుందో అది కూడా తెలిసివుంటే ఎంతో సంతోషిద్దురు అనిపించింది నాకు. జనార్ధనం అతి సిగ్గుపడుతూ నాకు బంగారు పార్కర్ కలం ఇచ్చాడు. అమ్మ తన మామూలు ఆదరణతో అతనితో చనువుగా మాట్లాడింది. సీతారాం వచ్చాడు. జనార్ధనాన్ని చూసి ఉలిక్కిపడ్డాడేమో అని నాకనిపించింది. వెనక అతను జనార్ధనం గురించి నాతో అన్న మాటలు గుర్తుకొచ్చాయి కాంసు. కెంపులు తాపరించిన ఉంగరం ఇచ్చాడు. నేను ధన్యవాదం చెప్పాను. "ఉంగరం చాలా అందంగా వుందండీ!" అన్నాను. "శాంతంగారూ! అది ఇత్తడిముక్కా గాజుపెంకులూ సుమండీ!" అన్నాడు సీతారాం. "అయితే ఎందుకిచ్చావోయ్?" అన్నారు నాన్న నవ్వుతూను. "పరస మినుమునోకి బంగారమైనట్లు - అన్నాడండీ వేమన. సుభగారు వేలిని పెట్టుకుంటే అవి బంగారం కెంపులూ అయిపోతాయి!" అన్నాడు. అసలు సీతారాం అంటే నాన్నకి మొదటినుంచి గొప్పగురి. అతని లక్షలంటే అతిగౌరవం. సీతారాం ఇచ్చిన వుంగరాన్ని నాన్న పొగడబోతూంటే జనార్ధనం ఎక్కడ చిన్నబోతాడో అని అమ్మ గ్రహించి "సీతారాం! జనార్ధనరావుగారికీ, మీకూ బాగా స్నేహం వున్నట్టు ఇన్నాళ్ళూ చెప్పావే కావేమిటోయ్!" అంది. ఇంతట్లోకి పెద్దనాన్నొచ్చాడు. చక్కటి చేతిసంచీ నాకిచ్చి నాబుగ్గ ముద్దు పెట్టుకుని "మరదలుపిల్లా! ఈ అప్సరసని చూసి మా ముసిలాళ్ళకళ్ళు జిగేలుమని పోతున్నాయి" అని అమ్మతో హాస్యంగా అన్నారు సీతారాం అన్నాడు. "డాక్టరుగారూ! మీరు ముసలివారైతే మేమందరం ఋషి పుంగవులమే సుమాండీ" అన్నాడు. "ఋషిపుంగవులకి తపోభంగం కావడానికే కదండి అప్సరసలను సృష్టించాడు దేవుడు?" అన్నాడు జనార్ధనం. అమ్మా, జనర్ధనానికి ఎప్పుడూలేని ధైర్యం వచ్చిందే అని నవ్వు కున్నాను. అప్పుడే కమల లీల వచ్చారు. అందరినీ పరిచయం చేశాను. "దేవేంద్రసభలాగుందే' అన్నారు పెద్దనాన్న. అమ్మ అందరికీ ఫలహారాలు, కాఫీ యిచ్చింది. బాతాఖానీ ప్రారంభం అయింది.

- ఇంకా వుంది.

విజయ్ హజారే ట్రోఫీని ఏ జట్టు కైవసం చేసుకుంది ?

1. అణ్వస్త్ర సామర్థ్యమున్న మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-2ను భారత్ 2018 ఫిబ్రవరి 20న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి పరిధి ఎంత ?
   1. 750 కిలోమీటర్లు 2. 1,000 కిలోమీటర్లు
   3. 2,000 కిలోమీటర్లు 4. 3,000 కిలోమీటర్లు

2. దేశవ్యాప్తంగా పోలీస్ విభాగాలలో మహిళలు ఎంత శాతం ఉన్నారని హోంశాఖ తాజా గణాంకాల్లో తేలింది ?
   1. 5.28 శాతం 2. 6.28 శాతం
   3. 7.28 శాతం 4. 8.28 శాతం

3. యుద్ధ విమానాన్ని నడిపిన తొలి భారతీయ మహిళగా చరిత్రకెక్కింది ఎవరు ?
   1. భావనా కాంత్ 2. అవనీ చతుర్వేది
   3. మోహనాసింగ్ 4. అన్న దివ్య

4. స్వచ్ఛభారత్ అభియాన్‌కు మస్కట్‌గా ఎంపికైన మహిళ 2018 ఫిబ్రవరి 23న మరణించింది. ఆమె పేరు ఏమిటి ?
   1. గంగాబాయ్ 2. కున్వర్‌బాయ్
   3. రాణీబాయ్ 4. కమలాబాయ్

5. 2018 సంవత్సరానికిగాను ప్రకటించిన బాఫ్టా సినిమా అవార్డుల్లో ఉత్తమ చిత్రం పురస్కారం దేనికి లభించింది ?
   1. ద షేప్ ఆఫ్ ద వాటర్ 2. డార్కెస్ట్ అవర్
   3. త్రి బిల్‌బోర్డ్స్ అవుట్‌సైట్ ఎబ్బింగ్, మిస్సోరి
   4. ఐ, టోన్యా

6. భర్త లేదా సంరక్షకులైన పురుషుల ముందస్తు అనుమతి అవసరం ఏదీ లేకుండానే మహిళలు సొంతంగా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించుకోవడానికి విధానపరమైన మార్పులను ఇటీవల ప్రకటించిన దేశం ఏది ?
   1. ఆఫ్ఘనిస్తాన్ 2. ఒమన్
   3. ఇరాన్ 4. సౌదీ అరేబియా

7. అమెరికాలోని పశ్చిమ టెక్సాస్ పర్వతాల్లో ఎన్ని సంవత్సరాల వరకూ నడిచేసే భారీ గడియారాన్ని (క్లాక్ ఆఫ్ లాంగ్ నౌ) రూపొందిస్తున్నారు ?
   1. 10,000 సంవత్సరాలు
   2. 20,000 సంవత్సరాలు
   3. 30,000 సంవత్సరాలు
   4. 40,000 సంవత్సరాలు

8. జాతీయ సముద్ర విజ్ఞాన సంస్థ (సీఎస్ఐఆర్ - ఎన్ఐఓ) పరిశోధకులు ఇటీవల ఏ బేసిన్‌లో కోల్డ్ సీప్స్ ఉన్నట్లు కనుగొన్నారు ?
   1. కృష్ణ - గోదావరి 2. కృష్ణ - పెన్నా
   3. పెన్నా - కావేరి 4. మహానది - గోదావరి

9. నేపాల్ నూతన ప్రధానమంత్రిగా 2018 ఫిబ్రవరి 15న పదవీ బాధ్యతలు స్వీకరించింది ఎవరు ?
   1. ఉపేంద్ర యాదవ్
   2. కేపీ శర్మ ఓలీ
   3. షేర్ బహదూర్ దూబ
   4. పుష్ప కమల్ దహాల్

10. విజయ్ హజారె ట్రోఫీని ఏ జట్టు కైవసం చేసుకుంది ?
   1. ఆంధ్రప్రదేశ్ 2. మహారాష్ట్ర
   3. మధ్యప్రదేశ్ 4. కర్ణాటక

11. స్ట్రాంజా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో ఉత్తమ బాక్సర్‌గా నిలిచి ఈ ఘనత సాధించిన మొదటి భారత బాక్సర్‌గా రికార్డు సృష్టించింది ఎవరు ?
   1. వికాస్ కృష్ణన్
   2. జితేందర్ కుమార్
   3. అఖిల్ కుమార్
   4. వర్గీస్ జాన్సన్

12. ఈఎస్‌పీఎన్- క్రిక్ ఇన్ఫో ప్రకటించిన వార్షిక అవార్డుల్లో 'డెబ్యుడెంట్ (నూతన ఆటగాడు) ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?
   1. కుల్దీప్ యాదవ్
   2. భువనేశ్వర్ కుమార్
   3. యజ్వేంద్ర చాహల్
   4. జస్‌ప్రీత్ బుమ్రా

13. బాలికల నిష్పత్తి గణనీయంగా పెంచడం, బాలికల విద్యను ప్రోత్సహించడంలో చొరవ చూపినందుకు కేంద్రప్రభుత్వం అందించే బేటీ బచావో.. బేటీ పఢావో అవార్డుకు తెలంగాణలోని ఏ జిల్లా ఎంపికైంది ?



   1. నల్లగొండ 2. హైదరాబాద్
   3. నిజామాబాద్ 4. వరంగల్

14. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్) విడుదల చేసిన 'మిలటరీ బ్యాలెన్స్' నివేదికలో రక్షణ బడ్జెట్‌లో అగ్రస్థానంలో నిలిచిన దేశం ఏది ?
   1. చైనా 2. ఇంగ్లాండ్
   3. రష్యా 4. అమెరికా

15. జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో వ్యక్తిగత పతకం సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా రికార్డులకెక్కింది ఎవరు ?
   1. దీపా కర్మాకర్
   2. రుచ దివేకర్
   3. పాలక్ కౌర్ బ్రిజాల్
   4. బుద్దా అరుణారెడ్డి

16. ఆస్ట్రియా ఓపెన్ - 2018 బ్యాడ్మింటన్ టోర్నీలో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకున్నారు ?
   1. జున్ హావో లియోన్గ్ (మలేషియా)
   2. రౌల్ మస్ట్ (ఎస్టోనియా)
   3. జునె వీ చీమ్ (మలేషియా)
   4. పారుపల్లి కశ్యప్ (భారత్)

17. ఈఎస్‌పీఎన్- క్రిక్ ఇన్ఫో ప్రకటించిన వార్షిక అవార్డుల్లో 'ఉమెన్ బ్యాటింగ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ఎవరికి దక్కింది ?
   1. మిథాలి రాజ్ 2. వేద కృష్ణమూర్తి
   3. పూనమ్ రౌత్ 4. హర్మన్‌ప్రీత్ కౌర్

18. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) డైరెక్టర్ (హెచ్ఆర్)గా ఎవరు నియమితులయ్యారు ?
   1. సునీల్ కుమార్
   2. రంజన్ కుమార్ మహాపాత్ర
   3. ఇందు మల్హోత్రా
   4. గీతా వర్మ

19. రాజస్థాన్‌లోని ఓ రైల్వేస్టేషన్ నిర్వహణను పూర్తిగా మహిళా ఉద్యోగులకే రైల్వే ఇటీవల అప్పగించింది. ఆ రైల్వేస్టేషన్ పేరు ఏమిటి ?
   1. గులాబ్‌పుర 2. గాంధీనగర్
   3. దుర్గాపుర 4. జోధ్‌పూర్ జంక్షన్

20. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ 180 దేశాల్లో అవినీతి ఎలా ఉందో అధ్యయనం చేసి రూపొందించి విడుదల చేసిన ప్రపంచ అవినీతి సూచీ - 2017లో ఏ దేశానికి అగ్రస్థానం దక్కింది ?
   1. న్యూజీలాండ్ 2. స్విట్జర్లాండ్
   3. సింగపూర్ 4. నెదర్లాండ్స్

21. అణ్వస్త్రాన్ని మోసుకెళ్లగల బాలిస్టిక్ క్షిపణి ధనుష్‌ను భారత్ 2018 ఫిబ్రవరి 23న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి ఎన్ని కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు ?
   1. 50 కిలోమీటర్లు
   2. 250 కిలోమీటర్లు
   3. 350 కిలోమీటర్లు
   4. 750 కిలోమీటర్లు

22. టీ 20 కెరీర్‌లో అత్యధిక పరుగులు (2,188) చేసిన బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు పొందింది ఎవరు ?
   1. మెక్ కల్లమ్ (న్యూజీలాండ్)
   2. మార్టిన్ గప్టిల్ (న్యూజిలాండ్)
   3. విరాట్ కోహ్లి (భారత్)
   4. క్రిస్ గేల్ (వెస్టిండీస్)

23. 2018 సంవత్సరానికిగాను ప్రకటించిన బాఫ్టా సినిమా అవార్డులలో ఉత్తమ దర్శకుడు పురస్కారం ఎవరికి లభించింది ?
   1. క్రిస్టోఫర్ నోలన్
   2. గిల్లెర్మో డెల్ టోరో
   3. మార్టిన్ మెక్‌డోనాగ్
   4. లుకా గుడాగ్‌నినో

24. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నేషనల్ కాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీజీ)గా ఎవరు నియమితులయ్యారు ?
   1. సునీల్ కుమార్ 2. రాజేశ్వర్ తివారి
   3. కేవీబీ రెడ్డి 4. నూకల నరేందర్‌రెడ్డి

25. 12 ఏళ్లకంటే తక్కువ వయసున్న బాలికలపై అత్యాచారం చేసినట్లు రుజువైతే మరణశిక్ష విధించే చట్టం రూపకల్పనకు ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది ?
   1. మహారాష్ట్ర 2. అరుణాచల్ ప్రదేశ్
   3. ఉత్తరప్రదేశ్ 4. హర్యాణా

26. చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీ - 2018లో పురుషుల సింగిల్స్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
   1. యూకీ బాంబ్రీ (భారత్)
   2. లీ డక్-హీ (దక్షిణ కొరియా)
   3. జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా)
   4. యసుటక ఉచీయమ (జపాన్)

27. ప్రమాదకర లూపస్ వ్యాధికి సరికొత్త చికిత్సను అభివృద్ధి చేసే దిశగా విస్తృత పరిశోధనలు చేపట్టేందుకు గాను భారత సంతతి శాస్త్రవేత్త చంద్రమోహన్‌తో కూడిన ముగ్గురు పరిశోధకుల బృందాన్ని లూపస్ పరిశోధకుల కూటమి (ఎల్ఆర్‌పీ) ఎన్ని కోట్ల రూపాయల గ్రాంటును కైవసం చేసుకుంది ?
   1. దాదాపు రూ. 1.9 కోట్లు
   2. దాదాపు రూ. 2.9 కోట్లు
   3. దాదాపు రూ. 3.9 కోట్లు
   4. దాదాపు రూ. 4.9 కోట్లు

28. ఈఎస్‌పీఎన్ - క్రిక్ ఇన్ఫో ప్రకటించిన వార్షిక అవార్డుల్లో 'టీ 20 బౌలింగ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది ఇయర్' అవార్డు గెలుచుకున్నది ఎవరు ?
   1. కుల్దీప్ యాదవ్
   2. భువనేశ్వర్ కుమార్
   3. యజ్వేంద్ర చాహల్
   4. జస్‌ప్రీత్ బుమ్రా

29. తెలంగాణ ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా ఎవరు నియమితులయ్యారు ?
   1. సందీప్ కుమార్ సుల్తానియా
   2. స్మిత సబర్వాల్
   3. రజత్‌కుమార్
   4. షాలిని మిశ్రా

30. 2018 సంవత్సరానికిగాను ప్రకటించిన బాఫ్టా సినిమా అవార్డులలో ఉత్తమ నటుడి పురస్కారం ఎవరికి లభించింది ?
   1. గారీ ఓల్డ్‌మాన్ 2. టిమోథీ ఛాలమెట్
   3. డేనియల్ డే - లెవిస్ 4. జేమీ బెల్

31. జింబాబ్వేతో ఫిబ్రవరి 16న జరిగిన నాలుగో వన్డేలో ఆఫ్ఘనిస్థాన్ టీనేజ్ ఆఫ్ స్పిన్నర్ ఐదు వికెట్లు తీసి అత్యంత పిన్న వయస్సు (16 ఏళ్లు) లోనే ఈ ఘనత సాధించిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. అతడి పేరేమి ?
   1. ముజీబ్ జద్రాన్ 2. అమిర్ హమ్జా
   3. రషీద్ ఖాన్ 4. జహీర్ ఖాన్

32. 2018 సంవత్సరానికిగాను ప్రకటించిన బాఫ్టా సినిమా అవార్డులలో ఉత్తమ నటి పురస్కారం ఎవరికి లభించింది ?
   1. ఫ్రాన్సెస్ మెక్‌డెర్మాండ్ 2. మార్గట్ రాబీ
   3. అన్నెట్టె బెనింగ్ 4. శాల్లీ హాకిన్స్

33. చంద్రబాబు నాయుడి రాజకీయ జీవితానికి 2018 ఫిబ్రవరి 27తో ఎన్ని సంవత్సరాలు నిండాయి
   1. 40 సంవత్సరాలు 2. 35 సంవత్సరాలు
   3. 30 సంవత్సరాలు 4. 25 సంవత్సరాలు

సమాధానాలు

1. 3	2. 3	3. 2	4. 2	5. 3
6. 4	7. 1	8. 1	9. 2	10. 4
11. 1	12. 1	13. 2	14. 4	15. 4
16. 4	17. 4	18. 2	19. 2	20. 1
21. 3	22. 2	23. 2	24. 4	25. 4
26. 3	27. 3	28. 3	29. 3	30. 1
31. 1	32. 1	33. 1		

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 12 ఉద్యోగాలు

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) సెంట్రల్ లైబ్రరీలో 12 ట్రైనీ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

పోస్టు : ప్రొఫెషనల్ ట్రైనీ. శిక్షణ వ్యవధి : ఏడాది.

స్టైపెండ్ : రూ.16,000.

అర్హతలు : మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎం.లిబ్) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (బీ.లిబ్)లోనూ ప్రథమశ్రేణి మార్కులు పొంది ఉండాలి. సంబంధిత రంగంలోని కంప్యూటర్ అంశాలపై నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం.

వయసు : 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా : లైబ్రేరియన్, సెంట్రల్ లైబ్రరీ, ఐఐటీ ఖరగ్‌పూర్-721302, పశ్చిమబెంగాల్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఏప్రిల్ 4, 2018.

వెబ్‌సైట్ : www.iitkgp.ac.in

భారత్‌లోని ప్రధాన గిరిజన తెగలు

- ఆబోర్లు - ఈశాన్య ప్రాంతం
- ఆదివాసీలు - మధ్యప్రదేశ్ (బస్తర్ జిల్లా)
- అంగామీ - మణిపూర్
- అవో - నాగాలాండ్, అసోం
- అపటామీ - అరుణాచల్ ప్రదేశ్
- బాడగ - తమిళనాడు (నీలగిరి ప్రాంతం)
- బైగా - మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్
- బక్కర్‌వాల్ - జమ్మూకాశ్మీర్
- భిల్లులు - మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్
- భోటియాలు - ఉత్తరప్రదేశ్ (గర్వాల్, కుమాన్ ప్రాంతాలు), చత్తీస్‌గఢ్
- భుయా - మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్
- బిరోర్ - మధ్యప్రదేశ్, బీహార్
- చాంగ్ - ఈశాన్య రాష్ట్రాలు
- చుటియా - అసోం
- గద్దీలు - హిమాచల్‌ప్రదేశ్
- గారో - అసోం, మేఘాలయ
- గల్లాంగ్ - ఈశాన్య రాష్ట్రాలు
- గోండులు - మధ్యప్రదేశ్, బిహార్, చత్తీస్‌గఢ్
- గుర్జార్లు - గుజరాత్, రాజస్థాన్
- ఇరుళ, కోటాలు, కనికర - తమిళనాడు
- జైంతియా - మేఘాలయ
- జరవా - లిటిల్ అండమాన్
- కట్కారీ, ఖారియా - మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్
- ఖోండ్ - మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్
- ఖాస్ - ఉత్తరప్రదేశ్
- ఖాసీలు - అసోం, మేఘాలయ
- చెంచు - మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్
- కోల్ - మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్
- కోలామి - తెలంగాణ
- కుకీ - మణిపూర్
- లాహౌలా - హిమాచల్‌ప్రదేశ్
- లెప్చాలు - సిక్కిం
- లుషాయి - త్రిపుర
- మైనా - రాజస్థాన్
- మురియా - మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్
- మిక్రీ - అసోం
- మోంపా, రెంగ్మా, నిషీ - ఈశాన్య రాష్ట్రాలు
- మోప్లా - కేరళ
- ముండా - బీహార్, జార్ఖండ్
- నాగాలు - నాగాలాండ్
- ఒరాన్‌లు - బీహార్, ఒడిశా
- సంతాల్‌లు - పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, బీహార్, జార్ఖండ్
- తోడాలు - తమిళనాడు (నీలగిరి)
- వాంఛూ - ఈశాన్య రాష్ట్రం
- ఓంగె - లిటిల్ అండమాన్
- జార్వాలు - దక్షిణ మధ్య అండమాన్
- షాంపెన్ - నికోబార్ దీవులు

జానపద, గిరిజన నృత్యాలు

- ఆంధ్రప్రదేశ్ : వీధినాటకం, బుర్రకథ, తోలుబొమ్మలాట, కోలాటం
- తెలంగాణ : పేరిణి శివతాండవం, బుర్ర కథ, బతుకమ్మ ఆట
- అసోం : బైశాఖిబిహు, ఖేల్‌గోపాల్, నాంగ్‌క్రెమ్, రాస్‌లీల, తబల్‌చోంగ్లి,
- పంజాబ్ : భాంగ్రా, గిద్దా
- ఉత్తరప్రదేశ్ : చప్పెలి, జోరా కిజ్రి, కరన్, నౌతంకి, రాస్‌లీల
- హర్యాన : లూర్, చౌరయ్య, డఫ్, ధమాల్ గుగ్గా, జుమార్, కోరియా
- మహారాష్ట్ర : దహకలా, లెజిన్, బోహడా, తమాషా, మౌని, కథాకీర్తన్, దందానియా, గఫా,లోవణి, దశావతార్
- ఒడిశా : గుమారా సంచార్, చడ్యా దండనాథ, చవ్వా
- జమ్మూ కాశ్మీర్ : దమాలి, దండినాచ్, హికిత్, కుడ్, రౌఫ్, చక్రి
- రాజస్థాన్ : గంగోర్, గినాడ్, చక్రి, తేరహతాల్, జుమార్, ఖయాల్, గోపికాలీల, ఝుమలీల, సుయిసిని, చామర్ గిందా
- గుజరాత్ : ధమాల్, ఘరయ్యారాస్, గోప్, గార్బా, గార్బి, జెరియున్, దాండియా రాస్, భావై
- బీహార్ : కథాపుట్లీ, జతాజతిన్, తాదర్, చవ్వా, నట్‌నా, బాకో, సమో, చక్‌వా, జిచియా, ఫాగ్, పుర్‌బి
- కేరళ : కైకొట్టుకళి, తప్పటకళి, కలియాట్టం, ముడియాట్టం
- కర్ణాటక : హుత్తారి, యక్షగాన, సుగ్గికునిధ
- తమిళనాడు : కోలాటం, కరాగం, కుమ్మి, కావడి, పిన్నల్ కోలాటం
- హిమాచల్‌ప్రదేశ్ : గిద్దా పర్వాన్, లుడ్డీ, ముంజ్రా, మహాసు, జాలీ, జద్దా
- పశ్చిమ బంగా : జాత్రా, చౌ, కతి, కీర్తన్, లామా
- మధ్యప్రదేశ్ : మాచా, కర్మ

విశాలాంధ్ర బిజినెస్

139.42 ▲ సెన్సెక్స్ 32,136.18	30.90 ▲ నిఫ్టీ 10,155.25	బంగారం (విజయవాడ) 29,000	బంగారం (విశాఖపట్నం) 28,940 ప్రొద్దుటూరు 28,940 22 క్యారెట్లు, 10 గ్రాములు	-100 ▼ వెండి (విజయవాడ) 39,100 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 39,250 ప్రొద్దుటూరు 41,096 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 65.21

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఎయిర్‌టెల్	418.60	4.61
ఎన్‌టీపీసీ	170.20	2.47
లార్సెన్	1,308.40	1.14
హెచ్‌డీఎఫ్‌సీ	1,830.00	1.05
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,863.55	1.00

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటా స్టీల్	582.35	-1.85
టాటా మోటార్స్	333.90	-1.58
అదానీపోర్ట్స్	363.90	-1.44
హీరోమోటార్‌కార్ప్	3,530.00	-1.25
సన్‌ఫార్మా	515.80	-0.82

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.19	65.21
యూరో	80.09	80.02
పౌండ్	91.29	91.60
ఆస్ట్రేలియా డాలర్	50.23	50.08
సింగపూర్ డాలర్	49.48	49.45

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,990	31,005
చెన్నై	28,990	31,005
బెంగళూరు	28,400	30,374
ముంబై	29,790	31,860
విజయవాడ	29,000	31,350
విశాఖపట్నం	28,940	30,950
ప్రొద్దుటూరు	28,940	30,390
ముడి చమురు		67.42

1పైసా తగ్గిన రూపాయి విలువ

ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ బుధవారం 65.21 వద్ద నిలదొక్కుకుంది. ఫెడరల్ రిజర్వు పాలసీ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో కరెన్సీ విలువలు తీవ్రంగా అనిశ్చితితో ఉన్నాయి. డాలర్ మూడువారాల గిరష్టానికి పెరిగింది. ట్రేడర్లు లాభాలకు మొగ్గు చూపడం, ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచనున్న నేపథ్యంలో ఈ ఏడాది సెంట్రల్ బ్యాంకు మూడు, నాలుగు పెంపుదలనుసూచిస్తుందా...అనే దానిపై దృష్టి పెట్టింది. డాలర్ విలువ తగ్గడంతో యూరో, యెన్ కొద్దినష్టానుండి కోలుకున్నట్లు తెలుస్తోంది.

స్కిల్ ఇండియా ప్రోగ్రాం విఫలం : శివసేన

ముంబై:ప్రధాని మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నైపుణ్య భారత్ (స్కిల్ ఇండియా) కార్యక్రమం ఘోరంగా విఫలమైందని శివసేన విమర్శించింది. రైల్వే ఉద్యోగార్థుల ప్రదర్శన జరిగన ఒక రోజు తర్వాత శివసేన మోడీపై విరుచుకు పడుతూ ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రధాని కనీసం 1000 మందికి కూడా ఉద్యోగాలు కల్పించలేక చతికిల పడిందన్నారు. స్కిల్ ఇండియా పథకంలో ఎంతమందికి శిక్షణ ఇచ్చారన్న సమాచారం కూడా ప్రభుత్వం వద్ద లేదని , ఈ కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ డాంబికాలు పలికిందని శివసేన ఎండగట్టింది. స్కిల్ ఇండియాలో శిక్షణ పొందిన వందలాది మంది నిరుద్యోగ యువకులు రైల్వేల్లో ఉద్యోగాలు కల్పించాలని ట్రాక్‌లపై బైఠాయించి మంగళవారం ప్రదర్శనలు జరిపారు. దీంతో 68 రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగి, వేలాదిమంది ప్రయాణీకులు అవస్థలుపడ్డారు.

స్కిల్ ఇండియా పేరుతో మన్‌కీ బాత్ పకటనల కోసం రూ. 10 నుంచి 20 కోట్ల వరకు ఖర్చు చేశారని, నైపుణ్యం పొందిన వారు మాత్రం ఉద్యో గాలకు దూరంగా ఉన్నారని,ఇదివరలో ఉద్యోగులుగా ఉన్న వారు కూడా ప్రస్తుతం ఉపాధి కోల్పోయారని శివసేన పార్టీ పత్రిక సామ్నా తన సంపాదకీయంలో ఎద్దేవా చేసింది. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియాలు చక్రాలు లేని వాహనాల న్నారు. వజ్రాల వ్యాపారులు బ్యాంకులను లూటీ చేసి దేశం విడిచి పోయారని, అయితే ఈ దేశ పుత్రులు మాత్రం ఉద్యోగాల కోసం బాధలు పడుతున్నారన్నారు.

హత్యలను మరుగుపరచడం అమానవీయం : పినరాయి

తిరువనంతపురం : బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 39 మంది భారతీయ మృతుల వివరాలు వెల్లడించకుండా మరుగు పరచడం అమానవీయమని కేరళ సీఎం పినరాయి విజయన్ బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో ఇరాక్‌లోని మొసూల్‌లో 39 మందిని ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు అపహరించి హత్యచేసినా, నాలుగేళ్లపాటు నిజాలు వెల్లడించకపోవడం ప్రభుత్వ క్రూరత్వానికి మచ్చుతునక న్నారు. శాసనసభ దీనిని గర్హిస్తూ, మృతులకు ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబాలకు సానుభూతిని ప్రకటించింది. విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ మంగళవారం రాజ్యసభలో ఈ విషయం వెలువరించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన పినరాయి ఇలాంటి దారుణ ఘటనలు జరిగినప్పుడు మొదట వారి బంధువులకు సమాచారం ఇవ్వాలని, అయితే బీజేపీ ప్రభుత్వం మొదట పార్లమెంటుకు తెలిపిందని ఇంతకు ముందెన్నడూ ఈ పరిస్థితి లేదన్నారు.

ఫేస్‌బుక్‌కు భారత్ వార్నింగ్



ఢిల్లీ: భారత ఎన్నికల ప్రక్రియను ఫేస్‌బుక్ ఏమాత్రం ప్రభావితం చేసినా సహించబోయేది లేదని కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బుధవారం హెచ్చరించారు. ఫేస్‌బుక్ ద్వారా కోట్లాది మంది వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమైందని వస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. అవసరమైతే ఫేస్‌బుక్‌పై ఎటువంటి కఠిన చర్యలైనా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛకు ప్రభుత్వం ఎప్పటికీ మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. కేంబ్రిడ్జి అనలిటికాతో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. 'డేటాను దొంగిలించడం లేదా తారుమారు చేసి గెలవడంపైనే కాంగ్రెస్ పార్టీ ఆధారపడుతుందా? అలా అయితే రాహుల్‌గాంధీ గెలుపొందితే అందులో కేంబ్రిడ్జి అనలిటికా పాత్ర ఏమిటీ?ఎంతమంది భారతీయుల డేటాను కేంబ్రిడ్జి అనలిటికా సీఈవోకి కాంగ్రెస్ ఇచ్చిందో చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఫేస్‌బుక్ సీఈవోకి హెచ్చరికలు జారీ చేశారు. 'భారత్‌లో ఐటీ శాఖ గురించి మీకు బాగా తెలుసు మార్క్ జుకర్‌బర్గ్. ఫేస్‌బుక్ వ్యవస్థ ద్వారా భారతీయులకు సంబంధించిన ఎటువంటి డేటా అయిన అపహరణకు గురైతే దాన్ని ఎంతమాత్రం సహించం. అందుకు ఐటీ చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయి. మీకు సమన్లు పంపే అధికారం కూడా మాకు ఉంటుంది' అని రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం పనిచేసిన కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థకు దాదాపు 5కోట్లమంది ఫేస్‌బుక్ ఖాతాల సమాచారం చిక్కిందని వార్తలు వచ్చాయి. ఈ లీక్‌పై సమగ్ర విచారణ జరగాల్సిందేనని అమెరికా సహా బ్రిటన్ ఈయూ దేశాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఇప్పటికే బ్రిటన్ పార్లమెంటరీ కమిటీ ఫేస్‌బుక్ అధినేత జుకర్‌బర్గ్‌కు నోటీసులు పంపింది. దీంతో ఈ వ్యవహారం సంచలనంగా మారింది.

ఫేస్‌బుక్‌ను డిలీట్ చేయాల్సిన సమయం ఆసన్నం

వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రేన్ వ్యాఖ్యలు



వాషింగ్టన్: ప్రముఖ సోషల్‌మీడియా వెబ్‌సైట్ ఫేస్‌బుక్ ఇటీవల వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఫేస్‌బుక్‌లోని కోట్లాది మంది యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని కేంబ్రిడ్జ్ అనలిటికా అనే సంస్థ దుర్వినియోగం చేసిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రేన్ ఆక్టన్ ఫేస్‌బుక్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇది ఫేస్‌బుక్‌ను డిలీట్ చేయాల్సిన సమయం' అంటూ ట్వీట్ చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం పనిచేసిన కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థకు దాదాపు 5కోట్లమంది ఫేస్‌బుక్ ఖాతాల సమాచారం చిక్కిందని వార్తలు వచ్చాయి. ఈ లీక్‌పై సమగ్ర విచారణ జరగాల్సిందేనని అమెరికా సహా బ్రిటన్ ఈయూ దేశాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఇప్పటికే బ్రిటన్ పార్లమెంటరీ కమిటీ ఫేస్‌బుక్ అధినేత జుకర్‌బర్గ్‌కు నోటీసులు పంపింది. దీంతో ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ఫేస్‌బుక్‌పై తమకు విశ్వాసం పోతోందని ఇప్పటికే పలువురు యూజర్లు ఇతర సోషల్‌మీడియాల ద్వారా తమ అసంతృప్తిని వెల్లడించారు. గత రెండు మూడు రోజుల నుంచి 'డిలీట్‌ఫేస్‌బుక్' హ్యాష్‌ట్యాగ్ వైరల్‌గా మారింది. తాజాగా వాట్సాప్ సహ వ్యవ స్థాపకుడు బ్రేన్ కూడా ఇదే హ్యాష్‌ట్యాగ్‌తో ట్వీట్ చేశారు. జాన్ కౌమ్‌తో కలిసి వాట్సాప్‌ను ప్రారం భించిన బ్రేన్ గతేడాది సంస్థ నుంచి వైదొలిగారు. మరో ఫౌండేషన్ కోసం వాట్సాప్‌ను వీడినట్లు బ్రేన్ ఆ సందర్భంలో ప్రకటించారు. కాగా 2014లో వాట్సాప్‌ను 16 మిలియన్ డాలర్లకు(భారత కరెన్సీలో దాదాపు రూ. 1.04లక్షల కోట్లు) ఫేస్‌బుక్ కొనుగోలు చేసింది.

ఏప్రిల్ 2వ తేదీ నుంచి

హెచ్1-బీ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం



వాషింగ్టన్: అమెరికాలో హెచ్1-బీ వీసా దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 2వ తేదీ నుంచి హెచ్1-బీ వీసా దరఖాస్తులు స్వీకరిస్తామని అమెరికా పౌర వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) వెల్లడించింది. అలాగే హెచ్1-బీ వీసా దరఖాస్తుల ప్రీమియం ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 2019 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రీమియం ప్రాసెసింగ్ రద్దు చేస్తున్నట్లు తెలిపింది. భారతీయ ఐటీ నిపుణులు ఎక్కువగా ఈ వీసాల ద్వారా అమెరికా వెళ్తుంటారు. హెచ్1-బీ వీసాలతో అమెరికాలోని కంపెనీలు భారత్, చైనా లాంటి దేశాల నుంచి టెక్నాలజీ నిపుణులను వేల సంఖ్యలో నియమించుకుంటున్నాయి. హెచ్1-బీ తాజా దరఖాస్తులు 2019 ఆర్థిక సంవత్సరం కోసం తీసుకుంటున్నారు. 2019 సంవత్సరానికి ప్రీమియం ప్రాసెసింగ్ రద్దు చేస్తున్నా మని, అయితే ఈ ఏడాదికి సంబంధించి 2018 సెప్టెంబరు 10 వరకు ప్రీమియం ప్రాసెసింగ్‌ను కొనసాగించనున్నట్లు తెలిపింది. ఈ ప్రీమియం ప్రాసెసింగ్‌కు సంబంధించి ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్నా ప్రజలకు సమాచారం ఇస్తామని యూఎస్‌సీఐఎస్ స్పష్టంచేసింది. హెచ్1-బీ వీసా దరఖాస్తుల పరిశీలన సమయం తగ్గించేందుకే తాత్కాలికంగా ప్రీమియం ప్రాసెసింగ్‌ను నిలిపేస్తున్నామని వెల్లడించింది. గత కొన్నేళ్లుగా ప్రీమియం ప్రాసెసింగ్ దరఖాస్తులు ఎక్కువగా వస్తుండడంతో సాధారణ దరఖాస్తులు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉండిపోతున్నాయని, వాటి పరిశీలన సమయం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఏటా 65వేల హెచ్1-బీ వీసాలు జారీ చేస్తారు. యూఎస్‌సీఐఎస్ వివరాల ప్రకారం 2007 నుంచి 2017 సంవత్సరాల మధ్య హెచ్1-బీ వీసాల కోసం భారతీయులు అత్యధికంగా 2.2మిలియన్ల దరఖాస్తులు దాఖలు చేశారు. 3లక్షలకుపైగా దరఖాస్తులతో చైనా తర్వాతిస్థానంలో ఉంది.

సమయ మండలాలపై

నిర్ణయంతీసుకోలేదు: ప్రభుత్వం

న్యూఢిల్లీ : దేశంలో వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక సమయ మండలాలు (సెపరేట్ టైకు జోన్లు) పాటించడంపై నిర్ణయం తీసుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రత్యేకంగా ఈశాన్య రాష్ట్రాలపై ఈ నిర్ణయం తీసుకోలేదని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి హర్షవర్ధన్ బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 2002లో రెండు సమయాల మండళ్లను ఏర్పాటు కోసం ప్రభుత్వం ఉన్నత కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ అమలులో ఎదురవుతున్న సంక్లిష్టతతో ఆ ప్రతిపాదనను విరమించుకుందన్నారు. ఆర్థిక, ఉత్పత్తి సామర్థ్యం పెరగాలన్న యోచనతో అమెరికా, రష్యాలు సమయమండలాలను అమలు చేస్తుందని, అయితే చైనా, భారత్‌ల్లో మాత్రం ఒక్క సమయాన్నే అనుసరిస్తున్నారన్నారు. దేశంలోని తూర్పు, పశ్చిమ భాగాల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం చాలా తేడాలుంటున్నాయని, ఒకే సమయపాలనతో తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో ఉత్పత్తి పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. సాయంత్రం పనివేళల కంటే ఉదయం పనివేళల్లో ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని వర్థన్ వెల్లడించారు.

రూ.200కోట్లు డిపాజిట్ చేయండి

జేపీ అసోసియేట్స్‌కు సుప్రీం కోర్టు ఆదేశం



ఢిల్లీ: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ జేపీ ఇన్‌ఫ్రాటెక్ మాతృసంస్థ అయిన జేపీ అసోసియేట్స్ రూ.200కోట్లు డిపాజిట్ చేయాల్సిందిగా సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గృహనిర్మాణ ప్రాజెక్టులో ఫ్లాట్ల కొనుగోలుకు డబ్బులు చెల్లించిన వారికి ఇళ్లు కట్టించనందున వారికి తిరిగి చెల్లించాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది. రెండు దఫాలుగా ఈ రూ.200 కోట్లు చెల్లించాల్సిందిగా సూచించింది.

ఏప్రిల్ 15, మే 10 తేదీల్లో కోర్టు రిజిస్ట్రీకి ఈ డిపాజిట్లు చేయాల్సిందిగా పేర్కొంది. ఈ కేసు విషయంలో డెవలపర్లు లేవనెత్తిన డిమాండ్లను న్యాయస్థానం తోసిపుచ్చింది. అలాగే ఇప్పటి వరకు ఎంతమంది ఇళ్ల కొనుగోలు దారులు నిధులు వాపసు కోరు తున్నారనే దానికి సంబంధించిన పూర్తి జాబితాను న్యాయస్థానానికి అందజే యాల్సిందిగా సుప్రీంకోర్టు జేపీ ఇన్‌ఫ్రాకు సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. జేపీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు కింద ఇళ్లను కట్టిస్తామని చెప్పి సరైన సమయానికి వాటిని అప్పగించకపోవడంతో కొనుగోలు దారులు తాము చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం జేఏఎల్(జైప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్)ను రూ.2000 కోట్లు జమ చేయాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. అనంతరం విడతలుగా ఈ మొత్తాన్ని జమ చేసేందుకు అంగీకరించింది. మరోవైపు మొత్తం కొనుగోలుదార్లలో 8శాతం మంది మాత్రమే నిధులు వాపసు కోరుతున్నారని జేపీ తరపు న్యాయవాది వాదిస్తున్నారు.

బ్యాంకుల్ని ప్రైవేటీకరించండి

ఇన్ఫోసిస్ ఛైర్మన్ నిలేకని ఉచిత సలహా



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకుల విలువ పడిపోక ముందే వాటిని ప్రైవేటీకరించాలని ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలే కని సర్కారుకు సూచించారు. ప్రస్తుతం బ్యాంకులు ప్రైవేటీకరణకంటే మంచి పని తీరుతో మార్కెట్లో అత్యధిక స్థాయిలో ఉన్నాయని.. వాటి విలువ ఏటా నాలుగు శాతం మేర తగ్గుతూ వస్తోందన్న అంచ నాల పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకుల విలువ 70 శాతం వరకు ఉందని.. రానున్న పదేండ్లలో ఈ విలువ తగ్గుతూ వచ్చి 10 శాతం దరిదాపుల్లోకి చేరవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

దేశీయ టెలికాం రంగంలో జరిగినట్టుగానే.. బ్యాంకింగ్ రంగంలోనూ పరిణామాలు చోటు చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఒకప్పుడు టెలికాం రంగంలో ఏకఛత్రాధిపతిగా వెలుగొందిన బీఎస్ఎన్ఎల్ ప్రస్తుతం ప్రయివేటు సంస్థల దాటికి తట్టుకోలేక పోతోందని.. ఈ నేపథ్యంలో ఆ సంస్థ చిన్న టెలికాం స్థాయికి చేరకుందని అన్నారు. విమాన యాన రంగంలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఎయిరిండియా నేలకొరగి మనుగడ కోసం పోరాడుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బ్యాంకింగ్ రంగానికి కూడా ఇలాంటి పరిస్థితి రాకమునుపే తగిన చర్యలు తీసుకుంటే మేలని ఆయన అన్నారు. ప్రజలే బ్యాంకుల్నికొనుగోలు చేసుకొని స్వేచ్ఛగా నిర్వహించుకోనిస్తే అద్భుత ఫలితాలుంటాయని అభిప్రాయ పడ్డారు. బ్యాంకింగ్ రంగంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తూ వస్తోందని. బ్యాంకులు విజయవంతంగా నిలిచేందుకు గాను టెక్నాలజీ ప్రముఖ పాత్ర పోషిస్తోందని అన్నారు. ఆధునిక టెక్నాలజీని వీటిని ప్రయివేటు రంగ బ్యాంకులు చురుగ్గా అందిపుచ్చుకొని ఖాతాదారులను ఆకట్టుకొనే దిశగా వేగంగా పావులు కదుపుతున్నాయని అన్నారు.

120పాయింట్ల లాభంతో సెన్సెక్స్

లాభాల్లో బ్యాంకింగ్, ఐటి రంగాలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నాటి సెషన్లో లాభాలతో ముగిశాయి. ఫెడరల్ సమావేశ ఫలితాలు అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో మార్కెట్ ప్రారంభం నుంచే సూచీలు జోరు సాగించాయి. అయితే చివర్లో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో కొంత ఒడుదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ ఆరంభ లాభాలను నిలబెట్టుకున్నాయి. ఈ ఉదయం ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 120 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది. బ్యాంకింగ్, ఐటీ రంగాల్లో కొనుగోళ్ల అండతో ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ఆరంభించింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా లాభపడింది. అయితే చివరి గంటల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో లాభాల్లో కొంత కోల్పోవాల్సి వచ్చింది. మార్కెట్ ముగిసే సమయానికి 139.42 పాయింట్ల లాభంతో 0.42 శాతంతో 33,136.18 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 31 పాయింట్లు లాభపడి 0.31శాతంతో 10,155 వద్ద ముగిసింది. 19సెక్టరల్ సూచీల్లో 15 లాభాల్లో ముగియగా ప్రధానంగా టెలికాం రంగం 2.36శాతం లాభాన్ని ఆర్జించింది. బీఎస్ఇ మిడ్‌కాప్, స్మాల్‌కాప్ 0.22శాతం,0.31శాతం నమోదుచేసింది. భారతి ఎయిర్‌టెల్, ఎన్‌టిపిసి, ఎల్ అండ్ టీ, ఇండస్‌ఇండ్ బ్యాంకు టాప్ గెయినర్ కాగా టాటాస్టీల్, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, హీరో మోటాకార్ప్ ప్రధానంగా నష్టపోయారు. ఎస్‌బీఐ షేర్లు నష్టాల్లో సమోదయ్యాయి. భారతి ఎయిర్‌టెల్ షేర్లు బీఎస్ఇ సెన్సెక్స్‌లో టాప్ గెయినర్‌గా నమోదైంది. ఎన్‌టిపిసి, ఎల్ అండ్ టీ, హెచ్‌డిఎఫ్‌సి, కొటక్ మహీంద్రబ్యాంకుఈ వరుసలోనే నిలిచాయి. టాటాస్టీల్ షేర్లు, టాటా మోటార్స్, అదాని పోర్ట్స్, పవర్‌గ్రిడ్,సన్‌ఫార్మా 2శాతం నష్టపోయాయి. యూరోపియన్ మార్కెట్లు నిలకడగానే ముగిసాయి. లండన్ బెంచ్‌మార్క్ ఎఫ్‌టిఎస్ఇ 100 ఇండెక్స్ 7061.98 పాయింట్ల వద్ద నిలిచింది. యూరోజోన్‌లో ఫ్రాంక్‌ఫర్ట్ డిఏఎక్స్ 30 ఇండెక్స్ 0.2శాతంతో 12,336.76 వద్దముగిసింది. పారిస్ సిఏసి 40 లో5252.78 వద్ద నిలదొక్కుకుంది.

విజ్ఞానం

గర్భిణుల్లో విటమిన్ డి లోపంతో ఆటిజమ్ రిస్క్



గర్భిణీల్లో విటమిన్ డి తక్కువైతే కిడ్స్‌లో ఆటిజమ్ రిస్క్ పెరగవచ్చునని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఆటిజం సమస్య జీవితాంతం ఎదుర్కొనే ప్రధానసమస్యగా ఉంది. గర్భస్థ సమయంలో మహిళల్లో విటమిన్ డి కొరత పుట్టబోయే పిల్లలపై పెనుప్రభావం చూపుతుందని ఎలుకలపై చేపట్టిన ప్రయోగంలో తేలింది. కాకపోతే దీనిపై మరింత పరిశోధనచేయవలసిఉంది. ప్రెగ్నెన్సీ సమయంలో విటమిన్ డి, లేక్టేషన్ ఉత్పత్తి లోపంతో జన్మించిన పిల్లలో సామాజిక ప్రవర్తనలో మార్పును గమనించవచ్చు. సోషల్ బిహేవియర్ తోపాటు ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డి)లో పలుమార్పులను ఎదుగుదలపై ప్రభావం చూపుతాయని అధ్యయనంలో వెల్లడైంది. విటమిన్‌డి లోపంతో పిల్లల మెదళ్లపై ప్రతికూల ప్రభావం చూపుతుందని యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా వెల్లడించింది.

వేగంగా పెరుగుతున్న సముద్ర మట్టం



ఫ్రాన్స్ దేశం అంతటి పరిమాణం ఉన్న అంటార్కిటికా గ్లేసియర్ టోటెన్ వేగంగా కరిగిపోతుండటంతో సముద్ర మట్టం ప్రపంచ వ్యాప్తంగా 3మీటర్లు పెరిగనట్లు తాజా సమాచారం అంటార్కిటికా తూర్పువైపున ఉన్న అతిపెద్దదైన టోటెన్ గ్లేసియర్ కాలుష్యప్రభావంతో వేగంగా కరుగుతూవస్తోంది. శాస్త్రజ్ఞుల తాజా అంచనాల ప్రకారం టోటెన్ గ్లేసియర్ పరిమాణం ఫ్రాన్స్ అంత ఉంటుంది. మంచినీటితో ఉన్న ఈ హిమఖండం సముద్రంలో కలవడంతో శాస్త్రజ్ఞులు ఆందోళనచెందుతున్నారు. ఈ గ్లేసియర్‌లోని ఒక భాగం కరగడంతో సముద్రంలో కృత్రిమమైన సిస్మిక్ వేవ్స్‌కు కారణమ వుతోందని తెలుస్తోందని సెంట్రల్ వాషింగ్టన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. సముద్రపు వేడినీటి ఈ మంచుఖండంకరగడానికి కారణ మని తెలుస్తోంది. ఉప్పునీటితోకూడిన సముద్రపు నీరు వందలాదికిలో మీటర్లు మంచుఖండాల అంతర్భాగాలలోకి చొచ్చుకు వెళ్లడంతో వేగంగా కరుగుతున్నట్లు గుర్తించారు. 2002-2016 మధ్యకాలంలో నాసా నివేదికాధారంగా దక్షిణప్రాంత హిమఖండాలు ఏడాదికి 125 గిగాట న్నులు కరుగుతుందగా, దీని కారణంగా ప్రతి ఏడాదికి 0.35 మిమీ సముద్ర మట్టం పెరుగుతోంది. 1900 సంవత్సరం నుండి గ్లోబల్ సీ లెవెల్ సుమారు 20 సెంటీమీటర్లు పెరుగుతూ వస్తోంది. ఈ శతాబ్దం చివరినాటికి సుమారు ఒక మీటరువంతున ఆపై కూడా పెరగవచ్చునని శాస్త్రజ్ఞుల అంచనా..



డీజిల్ @ హోం డెలివరీ

- సరికొత్త సేవల్ని అందుబాటులోకి తెచ్చిన ఐవోసీ
- తొలుత పుణెలో సర్వీసులు ప్రారంభం
- పెట్రోల్ అమ్మకాలకూ ప్రయత్నాలు

న్యూఢిల్లీ: ప్రస్తుత స్మార్ట్ ప్రపంచంలో కిరాణా సరుకుల నుంచి గృహోపకరణాల వరకు అన్నీ.. ఒక్క కాల్ లేదా ఎస్ఎమ్ఎస్‌తో ఇంటికి వచ్చిపడుతున్నాయి. సంప్రదాయ మార్కెట్ నుంచి టెలీ షాపింగ్ వైపు వేగంగా అడుగులు పడుతున్న తరుణంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) కూడా నూతనంగా ఆలోచిస్తున్నది. ఇందులో భాగంగానే వాహనదారులకు డీజిల్‌ను ఇంటి వద్దనే అందిస్తామంటూ ఓ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. తొలుత పుణె వాసులకు ఈ సేవల్ని అందుబాటులోకి తెచ్చిన ఐవోసీ.. త్వరలో దేశవ్యాప్తంగా అమల్లోకి తెస్తామంటున్నది. కాగా, తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఇంటి వద్దకే వచ్చి డీజిల్ పోసే ట్యాంకర్ ఫొటోనూ పోస్ట్ చేసింది. ఈ హోం డెలివరీ సర్వీసును పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్‌వో) కూడా ఆమోదించినట్లు ఈ సందర్భంగా ఐవోసీ స్పష్టం చేసింది. అవసరమున్నవారు ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారులకు పెట్రోల్, డీజిల్‌ను హోం డెలివరీ చేసేందుకున్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు గతేడాది ఏప్రిల్‌లోనే చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపిన విషయం తెలిసిందే. దేశంలోని ప్రధాన నగరాల్లో గంటల తరబడి పెట్రోల్, డీజిల్ కోసం బంకుల వద్ద వాహనదారులు పడిగాపులు కాయాల్సి వస్తుండటంతోనే హోం డెలివరీ యోచనలో ప్రభుత్వం పడింది. ఈ క్రమంలోనే ఇప్పుడు ఐవోసీ ఇంటి వద్దకే డీజిల్ నదుపాయంతో ముందుకొచ్చింది. డీజిల్‌తో పోల్చితే ఈ తరహా పెట్రోల్ అమ్మకాలు కొంత ప్రమాదకరంగా ఉండటంతోనే ముందుగా డీజిల్ అమ్మకాల్ని ప్రారంభించామని ఐవోసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ సింగ్ తెలిపారు. పెట్రోల్ అమ్మకాల్ని ప్రారంభించేందుకు పీఈఎస్‌వోతో చమురు మార్కెటింగ్ సంస్థలు పనిచేస్తున్నట్లు చెప్పారు. నిజానికి గతేడాది జూన్‌లోనే బెంగళూరుకు చెందిన ఏఎన్‌బీ అనే స్టార్టప్ ఈ తరహా సర్వీసుల్ని మొదలు పెట్టింది. అయితే పీఈఎస్‌వో ఆదేశాలతో నిలిపివేసింది. రవాణాలో సరైన భద్రతా ప్రమాణాలను పాటించలేకపోతుండటమే అసలు కారణం. ఇదిలావుంటే కస్టమర్ల నుంచి ఎలాంటి స్పందన వస్తున్నది? ఎన్ని లీటర్ల వరకు ఆర్డర్ చేసుకోవచ్చు? చార్జీలు ఎలా ఉంటున్నాయి? అన్నదానిపై ఇంకా స్పష్టమైన సమాచారం లేదు.

రాజా, కనిమొళిలకు హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ : మాజీ టెలికమ్యూనికేషన్స్ మంత్రి ఎ.రాజా, డీఎంకే ఎంపీ కనిమొంజిలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2జీ కేసులో ప్రత్యేక కోర్టు వారిని నిర్దోషులుగా తీర్పునివ్వడంపై సీబీఐ, ఈడీలు సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు నోటీసులు జారీ చేస్తూ, మే 25లోగా ప్రత్యుత్తరం ఇవ్వాలని వారిని ఆదేశించింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ డైరెక్టర్ సవాలుతో జస్టిస్ ఎస్‌పీ గార్గ్ కూడా ఇదే తరహా ఆదేశాలను వెలువరించారు. ఈడీ మధ్యంతర పటిషన్‌ను కోర్టు అనుమతిస్తూ యథాతథ స్థితిని అమలు చేయాలని అడిషినల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) తుషార్ మెహతాను ఆదేశిస్తూ రూ. 223 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంటును కొనసాగించాలన్నారన్నారు. మార్చి 19న ప్రత్యేక కోర్టు తీర్పును సవాలు చేస్తూ ఈడీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మార్చి 20న సీబీఐ కూడా తీర్పును సవాలు చేసింది.

పేదల ఇళ్లలో సోలార్ వెలుగులు



ఓ ఉన్నత విద్యావంతుడి కృషి ఫలితం

ఖరగ్‌పూర్ ఐఐటిలో ఎనర్జీ ఇంజనీరింగ్.. మసాచుసెట్స్‌లో పిజి, పిహెచ్.డి చేసిన ఓ ఉన్నత విద్యావంతుడికి ఏదో తెలియని అసంతృప్తి ఉండేది. పేదల ఇళ్లల్లో వెలుగునింపేందుకు ఆయన విశేషంగా ప్రయత్నించారు. శ్రీలంక, భారత్‌లో రెండేళ్లు విస్తృతంగా పర్యటించారు. పేదల ఇళ్లల్లోనే ఉండి వాళ్ల సాధక బాధకాలు తెలుసుకున్నారు. బడి పిల్లలు రాత్రిళ్లు చదివేందుకు ఓ ప్రత్యేక సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. స్కూలుకు వెళ్లి ఛార్జింగ్ చేసుకుని వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. తనకు వచ్చిన అవార్డుల కన్నా వాళ్ల కళ్లలో వెలుగే సంతృప్తి అంటున్నారు. ఆయనే హరీష్ హండే.

నేటి తరం సూర్యుడు ఆయన. పేదల ఇళ్లలో వెలుగులు నింపడమే హరీష్ ఆలోచన. సూర్యుడు నిద్రలోకి జారుకున్న తర్వాత ఇతని శక్తి మారుమూల గ్రామాల్లోని పూరిగుడిసెల్లో ప్రకాశిస్తుంది. కాస్త ఆశ్చర్యంగా అనిపించినా మీరు వింటున్నది నిజం. ఎందుకంటే.. ఇతడు సూర్యుడిని ఆధారంగా చేసుకుని వెలిగే లైట్లకు ఓ కొత్త రూపం తీసుకుని వచ్చారు. సోలార్ ఎనర్జీ గురించి కేంద్రం ఇప్పుడు తీవ్రస్థాయిలో ఖర్చు పెడ్తూ ప్రచారం చేస్తోంది కానీ.. హరీష్ పదిహేనేళ్ల క్రితమే ఇలాంటి కార్యక్రమాలకు ఆద్యుడయ్యారు. ఇప్పుడు కనీసం రెండు లక్షల ఇళ్లకు ఆయన ఆలోచనతోనే నిత్యం వెలుగులను ప్రసరిస్తున్నాయి. కేవలం లైట్లకే పరిమితం కాకుండా సోలార్ హీటర్లు, స్ప్రేయర్లు, నీటి పంపింగ్ మెషీన్లు.. ఇలా ఎన్నో వాటికి ఆయన ప్రాణం పోశారు. అన్నింటికంటే ముఖ్యంగా ఆయన ఆలోచన ఒక్కటే.. గ్రామాల్లోని విద్యార్థులు రాత్రిళ్లు కూడా ఎలాంటి ఆటంకం లేకుండా చదువుకోవాలి. అక్కడి ప్రజలు కాలుష్యం బారినపడకుండా మెరుగైన జీవితాలను జీవించాలి. ఐఐటిలో ఉన్నత చదువులు చదివి సామాజిక పారిశ్రామికవేత్తగా మారిన హరీష్ హండేపై ప్రత్యేక కథనం. భారతదేశంలో ఇప్పటికీ ఎన్నో మారుమూల గ్రామాల్లో ప్రజలకు విద్యుత్ సౌకర్యం లేనేలేదు. మరెన్నో గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండదు. నిరంతరం కోతలే. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా ప్రజల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఈ ఆలోచనే డాక్టర్ హరీష్ హండే సెల్కో పేరుతో కంపెనీ స్థాపనకు పునాది వేసింది. కర్ణాటకలోని ఉడుపి జిల్లా హండట్టులో హరీష్ హండే జన్మించారు. కానీ ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం ఒడిషాలోని రూర్కెలాలో జరిగింది. ఖరగ్‌పూర్ ఐఐటీ నుంచి ఎనర్జీ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తరువాత పై చదువుల కోసం అమెరికాకు వెళ్లారు. మసాచుసెట్స్ విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్.డీ

పూరిళ్లకు సోలార్ సొబగులు

శ్రీలంక వెళ్లి అక్కడ సౌరశక్తి వినియోగంపై పూర్తిగా పరిశోధన చేసి మసాచుసెట్స్‌కి తిరిగి వచ్చారు. అప్పుడే ఆయ నకు నెవెల్లి విలియమ్స్‌తో పరిచయం ఏర్పడింది. విలియమ్స్... సోలార్ ఎలక్ట్రిక్ లైట్ ఫండ్ (సెల్ఫ్) అనే ఓ అమెరికా కంపెనీ వ్యవస్థాపకుడు. ఈ కంపెనీ ప్రధాన ఉద్దేశం కూడా ప్రపంచ వ్యాప్తంగా గ్రామాలన్నింటినీ విద్యుదీకరించడం. తను కూడా ఇదే రకమైన ఆలోచనతో ఉండడం వల్ల హండేకి విలియమ్స్ పరిచయం బాగా ఉపయోగపడింది. 1995లో వీరిద్దరి భాగస్వామ్యంలో సెల్కో ప్రారంభమైంది. మొదట్లో సెల్ఫ్‌కి విలి యమ్స్ ఛైర్మన్‌గా, హండే మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉండేవారు. 1996లో విన్ రాక్ ద్వారా సెల్కోకి 1,50,000 డాలర్ల ఆర్థిక సాయం లభించింది.

పూర్తిచేశారు. 1991లో డొమినికన్ రిపబ్లిక్ పర్యటనలో ఉండగా అక్కడి పేద ప్రజలు సౌర శక్తితో పనిచేసే దీపాలు ఉపయోగించడం చూసి హండే ఆశ్చర్య పోయారు. వెంటనే ఆయన మదిలో ఒక ఆలోచన మెదిలింది. ఈ విధంగా మన దేశం (భారత్) లో ఎందుకు చేయకూడదు, పేదల ఇళ్లలో విద్యుత్ కాంతులు నింపవచ్చు కదా అని అనిపించింది. తద్వారా సామాజిక మార్పు తీసుకురావచ్చు అని భావించారు. వెంటనే దీనిపై అధ్యయనం ప్రారంభించారు. దాదాపు రెండేళ్లు భారత్, శ్రీలంక దేశాల్లో విస్తృతంగా పర్యటించారు, పరిశోధించారు. పేదల జీవితాలను, వారి అవసరాలను, ఆర్థిక స్థితిగతులను దగ్గరగా పరిశీలించారు. ఇలా చేయడానికి హండే కూడా ఆ రెండేళ్లూ పేదలతో పాటు చీకటిలోనే గడిపారు.



మణిపూర్‌లోని సోలార్ వాటర్ హీటింగ్ వ్యవస్థ

తర్వాత హండే భారత్‌కి తిరిగి వచ్చారు. బెంగళూరులో సెల్కో-ఇండియా పేరుతో తన ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడానికి పని ప్రారంభించారు. సౌరశక్తి వినియోగం, సౌరశక్తి ఆధారిత వస్తు వినియోగం... ఇవి పేదలకు అందని ద్రాక్ష, ఖర్చుతో కూడినవి అనే అపనమ్మకాల్ని తొలగించడమే హండే తొలి లక్ష్యం.

'నాతో పనిచేసే బృందంలో అందరూ ఏదో ఒక ప్రత్యేకత, నైపుణ్యం కలిగినవారే. వీరందరినీ పేదలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే తపనే ముందుకు నడిపిస్తూ ఉంటుంది. అందుకే మేము ఏ ప్రాజెక్టు చేపట్టినా కచ్చితంగా విజయం సాధిస్తామని మా నమ్మకం" అంటారు హరీష్

ఉదాహరణకు... సెల్కో లైట్ ఫర్ ఎడ్యుకేషన్ (చదువుకోవడానికి సెల్కో లైటు) ప్రాజెక్టు నిజంగా ఓ గొప్ప ఆలోచన. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 30,000 మంది పేద విద్యార్థులకు రాత్రివేళల్లో ఇంట్లో చదువుకోవడానికి వీలుగా ఓ లైటు, ఓ బ్యాటరీ అందించారు. కేవలం లంచ్ బాక్స్ పరిమాణంలో ఉండే ఈ బ్యాటరీ చాలా తేలికగా, పిల్లలు మోయగలిగేలా ప్రత్యేకంగా రూపొందించారు. బ్యాటరీని ఛార్జ్ చేయాలంటే స్కూలుకి రావాల్సిందే. ఎందుకంటే ఛార్జ్ చేయడానికి అవసరమైన సోలార్ ప్యానెల్స్ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. దీనివల్ల విద్యార్థులు తప్పనిసరిగా స్కూలుకి రావాల్సిన పరిస్థితి. బ్యాటరీ ఛార్జ్ చేసుకుంటేనే రాత్రి వేళ ఇంట్లో చదువుకోగలరు. స్కూలుకి రాకపోతే ఆ రోజుకి చదువు, హోమ్ వర్క్ చేయడం సాధ్యం కాదు. ఈ ప్రాజెక్టు ఎంతగానో విజయవంతమైంది. అద్భుత ఫలితాలనిచ్చింది. పేదలు తమపై జాలి చూపించే నాయకులని కోరుకోవడంలేదు అంటారు హండే. వారికి తోడుగా నిలిచి, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించి, జీవితాలను మార్చుకోవడానికి అవసరమైన ఆసరా అందిస్తే... వారే అభివృద్ధి పథంలోకి వస్తారు అని తనకు శ్రీలంక పర్యటనలో తెలిసింది అని గర్వంగా చెబుతారు. ఇదే హండే ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రధానంగా ఉపయోగపడింది.



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో హరీష్ హండే(కుడివైపు వెనుక) తదితరులు



సెల్కో రూపొందించిన సోలార్ ఇంధన వ్యవస్థ

అవార్డులు, రివార్డులు

- సెల్కో ఇండియా ద్వారా హరీష్ చేసిన, చేస్తున్న కృషికి, పరిశోధనలకు, సేవలకు ఎన్నో పురస్కారాలు ఆయనను వరించాయి. వీటన్నింటిలో ప్రముఖమైనది మెగసేసే అవార్డు. సౌర శక్తిని పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చేసిన కృషికి గాను హరీష్ హండేను 2011లో రామన్ మెగసేసే పురస్కారం వరించింది.
- 2011లో కర్ణాటక ప్రభుత్వం నుంచి రాజ్యోత్సవ ప్రశస్తి అవార్డు
- 2009 లో కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీకి ఎఫ్ టీ ఆర్సెలర్ మిట్టల్ బిజినెస్ అవార్డు
- బిజినెస్ టుడే ప్రకటించిన 21వ శతాబ్దంలో 21మంది యువ నాయకుల జాబితాలో చోటు
- భారతదేశ ప్రగతిని మార్చగలిగే 50 మంది యువకుల జాబితాలో 2008 చోటు
- తరిగిపోయే ఇంధన వనరుల వాడకాన్ని గణనీయంగా తగ్గించినందుకు ప్రతిష్టాత్మక యాష్ డెన్ అవార్డును రెండుసార్లు 2005, 2007 పొందారు... దీన్నే హరిత ఆస్కార్ (గ్రీన్ ఆస్కార్) అని కూడా పిలుస్తారు.
- 2007 సంవత్సరానికి గాను స్వాబ్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఎంట్రప్రెన్యూర్ షిప్ వారిచే సోషల్ ఎంట్రప్రెన్యూర్ అవార్డు
- 2007లో నంద్ అండ్ జీత్ ఖేమ్కా అవార్డు
- 2005 – టెక్ మ్యూజియమ్ వారు ఇచ్చే ఎస్సెంచర్ ఆర్థికాభివృద్ధి అవార్డు
- డిజైన్ ఫర్ ది అదర్ 90% ప్రదర్శనలో సెల్కో ఇండియాకి స్థానం.
- ఇలా చెప్పుకుంటే ఎన్నో అవార్డులు, రివార్డులు హండే ఖాతాలో చేరాయి. ఈ అవార్డులు ఇచ్చే ఆనందం కన్నా తనకు పేదల ఇళ్లలో సెల్కో వెలుగులే ఎక్కువ సంతృప్తినిస్తాయంటారు హరీష్.

నా హృదయానికి దగ్గరైన ఎం.ఎల్.ఎ

ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నందమూరి కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మించిన చిత్రం 'ఎంఎల్ఎ'. ఈ సినిమాశుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. నందమూరి కల్యాణ్ రామ్ మాట్లాడుతూ కథను నమ్ముకుని సినిమాలు తీసే నిర్మాతలంటే నాకు ఎంతో ఇష్టం. అటువంటి వారిలో ఈ నిర్మాతలు ముందుంటారు. పటాస్ విన్నప్పుడు ఎంత ఎగ్జయిట్ అయ్యానో.. ఈ సినిమాకు కూడా అంతే ఎగ్జయిట్ అయ్యాను. తను సినిమాను కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ఈ సినిమాలో నన్ను కొత్తగా చూపించాడు. పటాస్, ఇజం సినిమాలకు ఎంత బాగా ఫీలయ్యానో.. ఈ సినిమాకు కూడా అలాగే ఫీలయ్యాను. కొత్త దర్శకుడిని గైడ్ చేయాల్సిన బాధ్యత సినిమాటోగ్రాఫర్‌ది. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్‌ది భార్యాభర్తల సంబంధం. నేను పనిచేసిన కెమెరామెన్స్‌లో బెస్ట్ కెమెరామెన్ ప్రసాద్ మూరెళ్లగారు. రవికిషన్‌గారు నాకు దేవుడిచ్చిన అన్నయ్యలాగా దొరికారు. ఆయన బోజ్‌పురిలో సూపర్‌స్టార్. 500 సినిమాలు చేసిన రవికిషన్‌గారు ఇంకా ఏదో నేర్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. ఆయన్ను చూసి స్ఫూర్తిని పొందాను. ఈ సినిమాలో కొత్త కల్యాణ్‌రామ్‌ని చూస్తారు. సినిమా చూసిన వారెవ్వరూ బోర్ ఫీల్ కారు. ఎందుకంటే తమ్మిరాజుగారు ఏ మోహమాటం లేకుండా నచ్చకపోతే.. ఎడిట్ చేసేశారు.



ప్రతి ఒక్కరి కష్టం తెరపై కనపడుతుంది. కాజల్ అగర్వాల్‌తో నేను చేసిన రెండో సినిమా. నేను పద్నాలుగు సినిమాలు చేస్తే.. తను 50 సినిమాలు చేసింది. అందుకు కారణం తన డెడికేషన్. ఈ 12 ఏళ్లలో తను ప్రొఫెషనల్‌గా ఎంతో ఎదిగింది. తను మరో 50 సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. సినిమా చూ శాను. చాలా బాగా నచ్చింది. నా హృదయానికి దగ్గరైన సినిమా. తప్పకుండా ప్రేక్షకులందరికీ నచ్చింది. సహకారం అందించిన యూనిట్‌కి అభినందనలు" అన్నారు. అల్లరి నరేశ్ మాట్లా డుతూ నిర్మాతలతో ఉన్న పరిచయంతో పాటు మా బాబాయ్ కల్యాణ్‌రామ్‌గారితో ఉన్న పరి చయం కారణంగా ఇక్కడకు వచ్చాను. కల్యాణ్‌కి ఎం.ఎల్.ఎ బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది. దర్శకుడు ఉపేంద్ర మాధవ్ మంచి వ్యక్తి. తనకు ఈ సినిమా మంచి హిట్ అవుతుంది. మణిశర్మగారి పాటలెంతో బావున్నాయి. ఈ నెల 23న సినిమా విడుదలవుతుంది. ఎంటైర్‌టీమ్‌కు ఆల్ ది బెస్ట్" అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లా డుతూ నేను, ఉపేంద్ర కలిసి పనిచేశాం. తను మంచి టైమింగ్ ఉన్న డైరెక్టర్. మంచి సినిమాను మంచి హీరో, టీమ్‌తో కలిసి చేయడం అంత సులభం కాదు. ఈ సినిమా తనకు మంచి హిట్ అవుతుంది" అన్నారు. నిర్మాతలు కిరణ్ రెడ్డి, టి.జి.విశ్వప్రసాద్, శ్రీనువైట్ల , ఎం.ఎల్.కుమార్ చౌదరి , కోన వెంకట్, డి.సురేశ్ బాబు, జెమిని కిరణ్, భీమనేని శ్రీనివాసరావు, వి.ఎన్.ఆదిత్య, రవి కిషన్, బ్రహ్మానందం మాట్లాడారు. పృథ్వీ, రామజోగయ్య శాస్త్రి పాల్గొన్నారు.

నిజజీవిత పాత్రలో సాయిపల్లవి



సాధారణంగా నటీనటులు కొందరు డాక్టర్ చదవాలనుకున్నాను. డాక్టర్‌ని కాబోయి యాక్టర్‌ని అయ్యానని చెప్పడం మనం వింటూనే ఉంటాం. ఇందులో కొందరు వారి నట జీవితంలో వారి జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలు పోషిస్తుంటారు. ఆ సయమంలో వారెంతో హ్యాపీగా ఫీలవుతుంటారు. ఇప్పుడు హీరోయిన్ సాయిపల్లవి కూడా అలాంటి ఫేజ్ లోనే ఉందట. సాయిపల్లవి డాక్టర్ కోర్సును పూర్తి చేసింది. నటనపై ఆసక్తితో సినిమా రంగంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. ప్రేమమ్, ఫిదా వంటి సినిమాలతో ప్రేక్షకులకు చాలా దగ్గరైంది. ఇప్పుడు హీరో సూర్య సహా మంచి సినిమాలు చేస్తోంది. తెలుగులో సాయిపల్లవి హీరోయిన్‌గా శర్వానంద్ 'పడి పడి లేచె మనసు' సినిమా చేస్తోంది. ఇందులో సాయిపల్లవి మెడికల్ స్టూడెంట్ పాత్రలో నటిస్తుంది.

విశాలాంధ్ర సినిమా

లొకేషన్లలో మెగా లేడీస్ !!

సినిమా షూటింగ్ సెట్స్ కు ఫ్యామిలీ మెంబర్స్ వెళ్లడం అప్పుడప్పుడూ జరిగేదే. హీరోయిన్స్ విషయంలో ఇలాంటివి బాగా ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఆయా భామల అమ్మ.. నాన్న.. లేదా రిలెటివ్ ఎవరో ఒకరు కనిపించడం ఆనవాయితీ. ఇప్పుడీ ట్రెండ్ కొంత తగ్గింది కానీ.. ఇంకా పూర్తిగా మాయం కాలేదు. హీరోల షూటింగ్ స్పాట్స్ లో వారి కుటుంబ సభ్యులు కనిపించడం మాత్రం కాస్త అరుదైన విషయమే. ఈ మధ్య కాలంలో మెగా హీరోల సినిమా షూటింగ్ జరిగే ప్రాంతాలకు.. వారి కుటుంబంలోని మహిళలు తరచుగా విజిట్ చేయడం కనిపిస్తోంది. తాజాగా అల్లు అర్జున్- స్నేహ జంటగా ఉన్న ఫోటో ఒకటి నెట్ లోకి వచ్చింది. ఈ పిక్ లో బన్నీ గెటప్ ను బట్టి చూస్తే.. పక్కాగా నాపేరు సూర్య సెట్ లో షూటింగ్ లో ఉన్నాడని అర్ధమవుతుంది. రామ్ చరణ్ షూటింగ్ జరిగే ప్రాంతానికి ఉపాసన కూడా తరచూ విజిట్ చేస్తూ ఉంటుంది. రంగస్థలం మూవీ షూట్ సమయంలో గోదారి తీరంలో చాలా సమయమే గడిపింది ఉపాసన. అలాగే బ్రూస్ లీ టీంలో అయితే బ్యాంకాక్ కూడా వెళ్లిపోయింది మెగా పవర్ స్టార్ వైఫ్. సాయి ధరమ్ తేజ్ సినిమా షూటింగ్ అయితే.. వాళ్ల అమ్మ విజయదుర్గ అక్కడ ఎక్కువగానే కనిపిస్తుంది. ఈవెంట్స్ కు కూడా అమ్మను తోడు తెచ్చుకుంటాడు తేజు. వరుణ్ తేజ్ మూవీ షూటింగ్ స్పాట్స్ లో కూడా అతని అమ్మ పద్మజ కనిపిస్తూనే ఉంటుంది. ఇక సుశ్మిత ఇప్పటికే పలువురు మెగా హీరోలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా మారిపోయి షూటింగ్ లోనే ఉంటోంది.

వాటీజ్ దిస్ విష్ణు



మోహన్ బాబు కం బ్యాక్ మూవీగా ఎన్నో అంచనాలతో స్వంత బ్యానర్ లో నిర్మించిన గాయత్రి చివరికి చేదు అనుభవాన్నే మిగిల్చింది. తనవరకు కలెక్షన్ కింగ్ ఏ లోటు లేకుండా మేనేజ్ చేసినా పాత ఫార్ములాలో తీసిన దర్శకుడు మదన్ టేకింగ్ ప్రేక్షకులను మెప్పించలేక చివరికి ఫ్లాప్ ముద్ర వేయించుకుంది. తాజాగా మంచు విష్ణు అఫీషియల్ యు ట్యూబ్ ఛానల్ లో గాయత్రి హెచ్ డి వెర్షన్ అప్ లోడ్ చేసిన కాసేపటికే డిలీట్ చేసేయటం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పొరపాటున పెట్టారా లేక ఏదైనా శాటిలైట్ ఛానల్ తోనో లేక అమెజాన్ ప్రైమ్ లాంటి సంస్థలతోనో జరిగిన ఒప్పందంలో భాగంగా తీసేసారా అనే క్లారిటీ మాత్రం రాలేదు. నిజానికి మంచు విష్ణు పక్కా ప్లాన్ తోనే చేసినట్టు ఇన్ సైడ్ టాక్. నాన్న పుట్టిన రోజు సందర్భంగా అభిమానులకు కానుక రూపంలో ఇద్దామని గాయత్రి సినిమాను అప్ లోడ్ చేయించాడని కాని వీడియో హక్కుల విషయంలో కుదిరిన ఒప్పందం గురించి పూర్తి అవగాహన లేకపోవడంతో వెంటనే గుర్తించి తీయించేసాడని ఫ్రెండ్స్ సమాచారం.

నిహారిక.. నువ్వేనా?

ఎక్కడైనా సరే సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరో కూతురు సినిమాల్లోకి వస్తోంది అంటే చాలు అభిమానులు ఓ తరహాలో ఎదురుచూస్తుంటారు. కానీ టాలీవుడ్ లో మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. సింపుల్ గా ఎంట్రీ ఇచ్చి ఓ లెవెల్ వరకు హీరోయిన్ గా కొనసాగితే ఒకే గాని గ్లామర్ గీతను ఏ మాత్రం టచ్ చేసినా కూడా అస్సలు ఒప్పుకోరు. హాలీవుడ్ బాలీవుడ్ లో మాత్రం స్టార్ హీరోల కూతుళ్లు ఓ మోడల్ లెవెల్లో హెయాయాలను ఒలకబోస్తారు. ఇక అసలు మ్యాటర్ లోకి వస్తే.. గత కొంత కాలం నుంచి మెగా ఫ్యామిలీ నుంచి ఎక్కువగా హీరోలే వచ్చారు. వారి నుంచి ఒక్కగానొక్క అమ్మాయి నాగబాబు కుమార్తె నిహారిక టీవీ షోల ద్వారా మొదట ఎంట్రీ ఇచ్చారు. ఇక ఆ తరువాత సింపుల్ గా ఒక లవ్ స్టోరీలో కనిపించి మెప్పించింది. ఇకపోతే రీసెంట్ గా ఇచ్చిన ఒక ఫొటోషూట్ లో నిహారిక ఎవరు ఉహించని విధంగా కనిపించింది. అసలు ఆమె ఇచ్చిన స్టిల్ ని చూస్తే ఎవరు ఈ బాలీవుడ్ హీరోయిన్ అని అనకుండా ఉండలేరు. మోడ్రన్ అమ్మాయిలా బ్లూ జీన్స్ వైట్ టిషర్ట్ లో నవ్వుతూ టేబుల్ మీద కూర్చున్న నిహారిక చాలా అందంగా కనిపించింది. సరికొత్త హెయిర్ స్టైల్ తో నిండుగా ఒక స్మైల్ ని తగిలిచడంతో ఫొటో కి కళ వచ్చిందని చెప్పవచ్చు. ఇంత వరకు నిహారిక ఇంత అందంగా ఎప్పుడు కనిపించలేదని మెగా అభిమానులు చాలా పాజిటివ్ గా కామెంట్స్ చేస్తున్నారు.





పరిశీలనలో రైల్వే 'ఫ్లెక్సీఫేర్' : ప్రభుత్వం

న్యూఢిల్లీ : రైల్వేల్లో 'అనుకూల చార్జీల' పథకాన్ని (ఫ్లెక్సీ ఫేర్) సమీక్షించడం కోసం కమిటీని నియమించి, దాని నివేదికను పరిశీలిస్తున్నామని రైల్వే సహాయ మంత్రి రాజెన్ గొహైన్ లోక్‌సభలో వెల్లడించారు. బీజేపీకి చెందిన డీఎస్ రాథోడ్ అనుకూల చార్జీ పథకాన్ని రద్దుచేసే ప్రతిపాదన ఉందా అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా రైల్వే ప్రయాణీకుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని చర్యలు చేపడుతున్నామని గొహైన్ తెలిపారు. రైల్వే రెవెన్యూ పెంపుదలకోసం ఫెక్సీఫేర్ పథకాన్ని పున:సమీక్షిస్తున్నామని ఫిబ్రవరి2న రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ రాజ్యసభలో తెలపడంపై రాథోడ్ ఈప్రశ్నను లేవనెత్తారు. 2016లో రాజధాని, శతాబ్ధి ట్రైన్లలో అనుకూల చార్జీల పథకాన్ని అమలు చేయడంతో దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. రాజధాని ట్రైన్‌లో 2016-17లో 10.09 మిలియన్ మంది ప్రయాణించారు.

ఇంటివద్దకే రేషనా... వద్దు : గవర్నర్



న్యూఢిల్లీ : ఇంటివద్దకే రేషన్ పథకాన్ని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బాయిజాల్ తోసిపుచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ రాజకీయాలకు పేద ప్రజలు బలవుతున్నారన్నారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఊరట కలిగించాలే ఉద్దేశ్యంతో పదే పదే ఈ విషయంపై గవర్నర్‌తో చర్చించినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. పీడీఎస్ పథకంలో ఇంటివద్దకే రేషన్ సరఫరా చేసేందుకు ఢిల్లీ మంత్రిమండలి ఆమోదం తెలిపినప్పటికీ గవర్నర్ అంగీకరించలేదు. ఢిల్లీలో 72 లక్షలమంది ఈ పథకంతో లబ్ధి పొందుతున్నారన్నారు. పేదల వెతలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక చేపట్టామన్నారు. గవర్నర్ దీనిపై సానుకూలంగా స్పందించాలని ఉపముఖ్యమంత్రి మనిష్ తివారీ కోరారు.

పెరియార్ విగ్రహ ధ్వంసం కేసులో

సీఆర్పీఎఫ్ జవాను, కానిస్టేబుల్ అరెస్టు

చెన్నై/ న్యూఢిల్లీ : పెరియార్ విగ్రహ ధ్వంసం కేసులో సీఆర్పీఎఫ్ జవానును అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన తమిళనాడులోని పడుకొట్టాయ్ జిల్లాలో జరిగింది. సీసీటీవీ ఫుటేజ్ నేపథ్యంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్ సెంథిల్ కుమార్ (35) ఇంటి నుంచి అరెస్టు చేశామన్నారు. తాగిన మైకంలో ప్రముఖ హేతు వాది, సంఘసంస్కర్త పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యాలున్నాయన్నారు. సీఆర్పీఎఫ్ జవాను నెల రోజుల సెలవుపై తమిళనాడు చేరుకుని ఈ అఘాయిత్యానికి పూనుకున్నారని మార్చి 14న ఈ విషయంపై అతనిని సస్పెండ్ చేశారన్నారు. ఆ రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ డీఎంకే ఈ విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తింది. అతనికి హైదరాబాద్‌లో మానసిక వైద్య చికిత్సాలయంలో స్కిజోఫ్రినియా చికిత్స అందిస్తున్నా రన్నారు. విగ్రహాల విధ్వంసాలను ఏమాత్రం సహించ బోమని ముఖ్యమంత్రి పళనీ స్వామి హెచ్చరిస్తూ, విధ్వంసం కేసును పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 2013లోనే కుమార్ అయన ఇంటిముందు పెరియార్ విగ్రహ విష్కరణను వ్యతిరేకించారని దర్యాప్తులో తేలిందన్నారు. మార్చి 6నన జరిగిన ఈ ఘటనలో బీజేపీ కార్యకర్తను, మరొక వ్యక్తిని అరెస్టు చేశారన్నారు. త్రిపుర ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో తమిళనాడు బీజేపీ అధినేత హెచ్ రాజా ఆరాష్ట్రంలో లెనిన్ విగ్రహాలను, తమిళనాడులోని పెరియార్ విగ్రహాలను ధ్వంసంచేయాలని ఫెస్ బుక్‌లో పిలుపునివ్వడంపై డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు, డీఎంకే నేత ఎంకే స్టాలిన్ మండి పడ్డారు. రాజాను తక్షణమే అరెస్టు చేయాలని ఆయన డిమాండు చేశారు. అయితే ఆ పోస్టు నేను చేసింది కాదని రాజా మాటమార్చిన విషయం తెలిసిందే.

ఉద్యోగాల కల్పన హామీ ఒట్టిదే

- నిరుద్యోగ యువతను మోసగించిన మోడీ
- మూడేళ్లలో భారీగా తగ్గిన ప్రభుత్వోద్యోగ నియామకాలు
- నిరుద్యోగ భృతి యోచనలేదన్న మంత్రి జితేంద్ర సింగ్



న్యూఢిల్లీ : అధికారంలోకి వస్తే ఏడాదికి కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తాను అధికారం చేపట్టిన తరువాత కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి బదులు ఉన్న ఉద్యోగాలను కూడా భర్తీచేయలేదు. సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభలో చెప్పిన సమాధానం దీనిని ప్రతిబింబిస్తోంది. అంతేకాకుండా, నిరుద్యోగులకు భృతి కల్పించే ప్రతిపాదన కూడా ప్రభుత్వం వద్ద లేదని స్పష్టం చేశారు. వివిధ నియామక సంస్థలలో ప్రభుత్వం సిఫార్సు చేసే అభ్యర్థుల సంఖ్యను ప్రభుత్వం గణనీయంగా తగ్గించివేస్తోందని ఒక లిఖితపూర్వక సమాధానంలో మంత్రి తెలిపారు. 2014-15 సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం 1,13,524 మందిని అభ్యర్థులను ప్రభుత్వం సిఫార్సు చేసింది. అయితే, 2015-16 సంవత్సరంలో ఈ సంఖ్య 1,11,807కి, 2016-17 సంవత్సరంలో 1,11,807కి తగ్గిపోయిందని మంత్రి తెలిపారు. వివిధ విభాగాలకు సిఫార్సు చేసిన అభ్యర్థుల వివరాలను మంత్రి వివరిస్తూ, ఇతరులతో పాటు ఐఏఎస్, ఐపీఎస్‌లను ఎంపిక చేసే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ)కి 2014-15లో 8,272 మంది అభ్యర్థులను సిఫార్సు చేయగా 2015-16లో 6,866 మందిని 2016-17లో 6,866 మందిని సిఫార్సు చేసిందని మంత్రి వివరించారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)కి సంబంధించి ఈ మూడు సంవత్సరాలలో వరుసగా 58,066, 25,138, 68,880 మంది అభ్యర్థులను సిఫార్సు చేసినట్టు వివరించింది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ), రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్స్ (ఆర్ఆర్‌సీ)కి సంబంధించి ఈ మూడు సంవత్సరాలలో వరుసగా 47,186, 79,808, 26,318 మందిని సిఫార్సు చేసినట్లు ఆ సమాధానంలో మంత్రి తెలిపారు.

"నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించే ప్రతిపాదన కూడా ఏదీ ప్రభుత్వం వద్ద లేదు" అని మంత్రి చెప్పారు. మరో ప్రశ్నకు సింగ్ సమాధానం ఇస్తూ, ఎస్ఎస్‌సీ నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పరీక్షలో చీటింగ్‌కు పాల్పడిన ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు కోసం సీబీఐకి నివేదించినట్టు తెలిపారు. "ఎస్ఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజి జరగలేదు. కొన్ని ప్రాంతాలలో కొన్ని శక్తులు మోసానికి పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దానితో ఈ విధమైన వార్తలు వచ్చాయి.కొంతమంది అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దానితో పరీక్షల క్రమంలో అభ్యర్థులు వాస్తవాలు తెలుసుకునేందుకు సీబీఐతో దర్యాప్తు జరిపిస్తున్నాం" అని సింగ్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీంతీర్పును సమీక్షించాలి

దళితులపై పెరుగుతున్న దాడులు : కాంగ్రెస్

న్యూఢిల్లీ : కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు పెచ్చు పెరిగి పోతున్నాయని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరింది. సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ/ఎస్టీ చట్టం క్రింద అరెస్టులకు సంబంధించిన నిబంధనలను నీరుగార్చే విధంగా ఉందని ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ తీర్పును సమీక్షించాలని లేదా చట్టాన్ని సవరించాలని డిమాండు చేసింది. కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ బుధవారం ఇక్కడ విలేకరు లతో మాట్లాడుతూ, ఈ అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తరువాత దళితులు, ఇతర అట్టడుగు వర్గాలలో 'అభద్రతా భావం' నెలకొన్నదని చెప్పారు. "సుప్రీంకోర్టు మంగళవారం తీసుకున్న నిర్ణయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ తీర్పును కనుక సమీక్షించకపోతే, అది అత్యంత దురదృష్ట కరం. ఎస్సీ/ఎస్టీలు ఇతర అట్టడుగు తరగతులలో అభద్రతాభావం నెలకొంటోంది. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయంపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని మేము అభిప్రాయపడుతున్నాం" అని చెప్పారు. "ఈ అంశంలో ప్రభుత్వం ఎందుకు నిశబ్దంగా ఉంది. ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలి. అటార్నీ జనరల్ ద్వారా సుప్రీం కోర్టు ముందు తన వాదనను వినిపించాలి. ప్రభుత్వం కనుక నోరు మెదపకుండా వుంటే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని సమర్థిస్తోందని అనుకోవాల్సి ఉంటుంది" అని ఆనంద్ శర్మ అన్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ విధాన ఫలితమే ఈ పరిణామమని కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా అన్నారు. రిజర్వేషన్లకు ముగింపు పలికే కుట్ర ఇందులో ఇమిడి వుందని చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్ చీఫ్‌విప్ జ్యోతి రాదిత్య సింధియా మాట్లాడుతూ, రిజర్వేషన్లకు అంతం పలకాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నాయని, ప్రధాన మంత్రి లేదా ప్రభుత్వంలోని ఏ మంత్రి కూడా ఈ అంశంపై ఇంతవరకు ఎటువంటి వివరణ ఇవ్వలేదని అన్నారు.

ఆ రోజు ఏం జరిగిందంటే...

జయలలిత మరణంపై కమిషన్ ఎదుట శశికళ సాక్ష్యం



చెన్నై: తీవ్ర జ్వరంతో ఉన్న జయలలితను ఆసుపత్రికి రావాలని వైద్యులు సూచించినా ఆమె నిరాకరించారని తెలిపారు. రాత్రి సమయంలో ఆమె స్పృహ కోల్పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు ఆమె సన్నిహితురాలు, మాజీ ముఖ్యమంత్రి శశికళ విచారణ కమిషన్‌కు చెప్పారు.

జయలలిత మరణం వెనుక మిస్టరీ ఇంకా వీడట్లేదు. అనారోగ్య కారణాల వల్లే ఆమె చనిపోయారని వైద్యులు చెబుతున్నప్పటిక తమ నేత మరణం వెనుక కుట్ర ఉందని కొందరు అన్నాడీఎంకే నేతలు ఆరోపిస్తున్నారు. దీంతో ఆమె మృతిపై దర్యాప్తు చేసేందుకు న్యాయస్థానం జస్టిస్ అరుముగస్వామి నేతృత్వంలో విచారణ కమిషన్ వేసింది. దర్యాప్తులో భాగంగా జైల్లో ఉన్న శశికళను ఇటీవల విచారించగా ఆమె కొన్ని విషయాలను వెల్లడించారు.

'సెప్టెంబరు 22, 2016 రాత్రి 9.30 గంటల ప్రాంతంలో జయలలిత బ్రష్ చేసుకునేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లారు. అప్పటికే ఆమెకు జ్వరం బాగా ఉంది. బాత్‌రూంలో ఆమె కిందపడి పోవడంతో సాయం పట్టమని నన్ను పిలిచారు. నేను వెంటనే వెళ్లి జయలలితను బాత్‌రూం నుంచి తీసుకొచ్చి బెడ్ మీద పడుకోబెట్టాను. అంతలో ఆమె స్పృహ కోల్పోయారు. దీంతో నేను మా బంధువైన డాక్టర్ శివకుమార్‌కు ఫోన్ చేశాను. డాక్టర్ వచ్చి జయలలితను పరీక్షించారు. ఆ తర్వాత అపోలో ఆసుపత్రి వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతారెడ్డి భర్త విజయ్‌కుమార్ రెడ్డికి ఫోన్ చేసి అంబులెన్స్ పంపమని కోరారు'

'15 నిమిషాల్లో రెండు అంబులెన్స్‌లు వచ్చాయి. జయలలితను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాం. మార్గ మధ్యంలో ఆమెకు స్పృహ వచ్చింది. ఎక్కడకు వెళ్తున్నాం అని అడిగితే ఆసుపత్రికి అని చెప్పాను. ఆ రోజు ఉదయమే డాక్టర్ శివకుమార్ జయలలితను రెండు సార్లు పరీక్షించారు. ఆసుపత్రికి రావాలని చెప్పినా అందుకు ఆమె ఒప్పుకోలేదు. జ్వరం ఎక్కువ వడంతో రాత్రి స్పృహ కోల్పోయారు' అని శశికళ చెప్పారు.

అక్రమాస్తుల కేసు వ్యవహారం వల్ల జయలలిత తీవ్ర ఒత్తిడికి గురయ్యారని.. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించిందని శశికళ తెలిపారు. 2016 సెప్టెంబరు మొదటి వారంలో ఆమెకు షుగర్ లెవల్స్ బాగా పెరిగిపోవడంతో వైద్యులు చికిత్స చేశారని చెప్పారు. ఆ తర్వాత కోలుకున్నా సెప్టెంబరు 19న మళ్లీ జ్వరం వచ్చిందన్నారు.

జయలలితను ఎవరెవరు చూశారంటే..

ఆసుపత్రిలో ఉన్న సమయంలో జయ లలితను చూసేందుకు ఎవరినీ అనుమతించ లేదని వార్తలు వచ్చాయి. అయితే అది అవాస్తవమని శశికళ విచారణ సందర్భంగా చెప్పారు. అక్టోబరు 22, 2016న అప్పటి రాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు జయలలితను చూశారు. 'అప్పుడు మంచంపై ఉన్న ఆమె గవర్నర్‌ను చూసి చేయి పైకెత్తారు. ఈ విషయాన్ని గవర్నరే నాతో చెప్పారు' అని అన్నారు. సెప్టెంబరు 22-27 మధ్య అన్నాడీఎంకే నేతలు పన్నీర్‌సెల్వం, తంబిదురై, విజయ భాస్కర్ ఆమెను చూసినట్లు చెప్పారు. ఆ తర్వాత కూడా కొందరు నేతలు జయలలితను చూసినట్లు పేర్కొన్నారు.

జయలలిత ఆసుపత్రిలో ఉన్నప్పుడు నాలుగు వీడియోలు రికార్డ్ చేశారు. అవన్నీ ఆమె అనుమతితోనే తీశామని శశికళ చెప్పారు. వాటిని కమిషన్‌కు సమర్పించామన్నారు. జయలలిత తీవ్ర అనారోగ్యంతో డిసెంబర్ 5, 2016న అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూసిన విషయం తెలిసిందే.



రాహుల్ స్పీచ్ ఎఫెక్ట్..

రాజ్ బబ్బర్ రాజీనామా

లక్నో: ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం ప్రభావం బాగా కన్పిస్తోంది. పార్టీలోని వయోధికులు పదవుల నుంచి తప్పుకొని యువతకు అవకాశాలు కల్పించాలని రాహుల్ పిలుపునివ్వడంతో పలువురు సీనియర్ నాయకులు రాజీనామాలు చేస్తున్నారు. నిన్న గోవా పీసీసీ అధ్యక్షుడు శాంతారామ్ నాయక్ పదవికి రాజీనామా చేసిన అనంతరం ఈరోజు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్ బబ్బర్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మాజీ కేంద్ర మంత్రి జితిన్ ప్రసాదను నియమించనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ మాజీ ఎంపీ రాజేశ్ మిశ్ర, మాజీ ఎమ్మెల్యే లలితేశ్‌పతి త్రిపాఠితోపాటు పలువురి పేర్లు చర్చకు వచ్చినప్పటికీ జితిన్ ప్రసాద పేరు ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. అయితే రాజ్‌బబ్బర్ రాజీనామాను కాంగ్రెస్ అధిష్ఠానం ఇంకా ఆమోదించలేదు.

రాజ్‌బబ్బర్ మీడియాతో మాట్లాడుతూ రాజీనామా గురించి ప్రస్తావించలేదు. 'నన్ను ఇక్కడికి ప్రత్యేకమైన పని కోసం పంపించారు. దాని కోసం నా శాయశక్తులా పనిచేశాను. నా పనితీరు ఒక్కోసారి బాగుండొచ్చు.. ఒక్కోసారి బాగుండకపోవచ్చు. దీనిపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది, నేను ఎలాంటి కామెంట్లు చేయను' అని అన్నారు. '2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరి బాధ్యతలు, పాత్రల్లో మార్పు ఉంటుందని భావిస్తున్నా. ఎవరికి ఏ బాధ్యత అప్పగిస్తారనే అంశం పార్టీ అధిష్ఠానంపై ఆధారపడి ఉంది' అని రాజ్‌బబ్బర్ దిల్లీలో జరిగిన పార్టీ ప్లీనరీ సమావేశానికి హాజరైన అనంతరం పేర్కొన్నారు.

పదవీవిరమణ వయస్సు పెంచబోం : ప్రభుత్వం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సు పెంచే ప్రతిపాదన లేదదని సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 60 ఏళ్ల పదవీవిరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచుతారన్న విషయాన్ని ఆయన వ్యతిరేకిస్తూ లోక్‌సభలో ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో 48.41 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

అంతర్జాతీయ అంశాల్లో సహకారం

ద్వైపాక్షిక సంబంధాలపై జిన్‌పింగ్‌తో మోడీ ఫోన్ చర్చలు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోడీ మంగళవారం చైనా అధ్యక్షుడు గ్జి జిన్‌పింగ్‌కు ఫోన్ చేసి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. చైనా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైనందుకు జినపింగ్‌కు మోడీ శుభాకాంక్షలు తెలిపారు. యావత్ చైనాదేశ మద్దతు జిన్‌పింగ్‌కు ఉందని అభివర్ణించారు.

ఉన్నత స్థాయి సంప్రదింపులు, ద్వైపాక్షిక సంబంధాల పటిష్టత, సహకార బలోపేతం, అంతర్జాతీయ అంశాల్లో సహకారం వంటి అంశాల్లో రెండు దేశాల మధ్య మెరుగైన సయోధ్య కోసం కృషిచేస్తామని, చైనాతో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోడీ ఆయనతో అన్నారు. ప్రపంచ, ప్రాదేశిక శాంతి, అభివృద్ధిని పెంపొందించడంలోనూ ఇరు దేశాలు భాగస్వామ్యంతో పనిచేయాలని ప్రతిపాదించారు. మోడీ శుభా భినందనలను జిన్‌పింగ్ స్వీకరిస్తూ చైనీస్ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ), చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ) వార్షిక సదస్సులను ఇటీవల విజయవంతంగా ముగించుకొన్నట్టు చెప్పారు. ఈ సమావేశాల్లో సీపీపీసీసీ నేషనల్ కమిటీ నూతన నాయకత్వాన్ని ఎన్నుకొన్నట్టు తెలిపారు.



బాలీవుడ్ నటుడు కునాల్ కెమ్ముకి జరిమానా



ముంబై : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు బాలీవుడ్ నటుడు కునాల్ కెమ్ముకి ముంబై పోలీసులు జరిమానాను విధించారు. హెల్మెట్ లేకుండా మోటారు సైకిల్‌పై ప్రయణించిన కారణంగా ఆయనకు ఈ జరిమానాను విధించారు. అయితే తాను తప్పు చేసినట్టు కునాల్ క్షమాపణ కోరారని సమాచారం. ' ప్రతి పౌరుడి భద్రత ముఖ్యం. ఇటువంటివి పునరావృతం కాకుండా చూస్తారని భావిస్తాం, మీకు చలానా పంపిస్తున్నాం' అని బుధవారం అధికారిక ట్విట్టర్ ద్వారా తెలిపినట్టు ముంబై పోలీసులు చెప్పారు.

యూపీలో బాలికపై అత్యాచారం



బందా : ఉత్తరప్రదేశ్‌లో 17 ఏళ్ల దళిత బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. మంగళవారం బాధితురాలు కాలకృత్యానికి వెళ్లినప్పుడు ఈ ఘటన చోటుచేసుకున్నదని చెప్పారు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని అతన్ని పట్టుకుని తమకు అప్పగించారని తెలిపారు. అయితే నిందితుడు విషం తీసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

టాయ్‌ట్రైన్‌ను పునరుద్ధరించాలి : రైల్వేబోర్డు చైర్మన్



సుక్నా : టాయ్ ట్రైన్‌గా పేరుగాంచిన డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే (డీహెచ్ఆర్)ను పునరుద్దరించనున్నట్టు రైల్వే బోర్డు చైర్మన్ అశ్వనీ లోహనీ తెలిపారు. న్యూ జగల్పురి మైదానాల నుంచి పర్వత ప్రాంతాల్లో నడిచే ఈ టాయ్ ట్రైన్‌కు ఎయిర్ కండీషన్డ్ కోచ్‌లను కూడా ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ఈ రైల్వే లైను ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రాముఖ్యత పొందిందని, ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు విచ్చేస్తుంటారని తెలిపారు.

కొరియర్ కంపెనీలో పేలుడు- ముగ్గురికి గాయాలు



అహ్మద్‌నగర్ : మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో కొరియర్ సర్వీసు కార్యాలయంలో పేలుడు సంభవించిందని, ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారని పోలీసులు బుధవారం తెలిపారు. మలివాడలోని ఈ ప్రైవేటు కంపెనీలో మంగళవారం రాత్రి పది గంటలకు డెలివరీ చేయడానికి వచ్చిన పార్సిల్ నుంచి పేలుడు సంభవించిందని తెలిపారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్టు చెప్పారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపునకు నోటీసులు



న్యూఢిల్లీ : జమ్మూలో రాజౌరీ జిల్లా లోని మున్సిపాలి టీ పరిధిలో రోడ్ల విస్తరణకు 352 అక్రమ నిర్మాణాల తొలగింపునకు నోటీసులు జారీ చేసినట్టు అధికారులు బుధవారం తెలిపారు. ఆక్రమణల వ్యతిరేక డ్రైవ్ కింద పట్టణ ప్రాంతాల్లో 352 దుకాణాలు, వాణిజ్య సంస్థలకు నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. రెవెన్యూ, మున్సిపల్ కమిటీ, అధికారులు అక్రమణలను పరిశీలించి అప్పటికప్పుడే నోటీసులిచ్చినట్టు తెలిపారు.

జమ్మూలో కొండపై నుంచి పడి మహిళ మృతి



అహ్మద్‌నగర్ : జమ్మూ, కాశ్మీర్‌లోని రైసీ జిల్లాలో ప్రమాదవశాత్తూ కొండ పై నుంచి జారిపడి 36 ఏళ్ల మహిళ కన్నుమూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మంగళవారం సాయంత్రం ఎత్తైన ప్రదేశం సలాల్ బెల్ట్ నుంచి కల్లోదేవి అనే మహిళ పడిపోయిందని చెప్పారు. ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు చెప్పారు.

ఆధార్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు సుప్రీం గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ : ఆధార్ పథకంపై కోర్టులో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు యూఐడీఏఐ సీఈఓకు అనుమతి ఇవ్వాలని కేంద్రం కోరడంతో సుప్రీంకోర్టు అందుకు అంగీకరించింది. ఈ అంశం డేటా భద్రత, నిఘా వంటి సాంకేతిక అంశాలతో కూడినదని, తన నేతృత్వంలో నియామకమైన ఐదుగురు జడ్జిలతో కూడిన బెంచ్‌తో చర్చించిన అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు సమయాన్ని నిర్ధారిస్తామని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా పేర్కొన్నారు.

వచ్చే నెలలో రాజస్థాన్‌లో వికాస యాత్ర



జైపూర్ : రాజస్థాన్‌లోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో వచ్చే నెలలో వికాస్ యాత్రను ముఖ్యమంత్రి వసుంధరరాజే చేపడుతున్నట్టు ఆ రాష్ట్ర మంత్రి గజేంద్ర సింగ్ తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా యాత్రను చేపట్టాలని నిర్ణయించి నట్టు చెప్పారు. ఉదయ్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా ఇన్‌చార్జీలతో కలిసి సీఎం నిర్వహిస్తున్న ఈ యాత్ర జూలైలో ముగుస్తుందని చెప్పారు.

అంబులెన్స్ సిబ్బంది సమ్మె ఉధృతం



జైపూర్ : రాజస్థాన్‌లో అంబులెన్స్ సర్వీసు ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె మూడవ రోజు ఉధృతమైంది. వేతనాల పెంపుపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని రాజస్థాన్ ఎమర్జెన్సీ అంబులెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వీరేంద్ర సింగ్ తెలిపారు. వేతనాలను మూడు శాతం పెంపును, ఇతర డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించలేదని చెప్పారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించిన 1500 అంబులెన్సుల సర్వీసు సిబ్బంది సమ్మెలో పాల్గొన్నట్టు చెప్పారు.

బీహార్‌కు ప్రత్యేక హోదాపై నోటీసు



న్యూఢిల్లీ : ఏపీకి ప్రత్యేక హోదా డిమాండుపై పార్లమెంటులో టీడీపీ ఎంపీలు ఓవైపు ఎడతెగని పోరాటం సాగిస్తుంటే, బీహార్ కూడా అదే బాటలో ప్రత్యేక హోదా అంశం పై లోక్‌సభ గడప తొక్కింది. బీహార్‌కు ప్రత్యేక హోదా డిమాండుపై తక్షణ చర్చ జరపాలంటూ జన్ అధికార్ పార్టీ (జేఏపీ) ఎంపీ పప్పూ యాదవ్ లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు బుధవారం నోటీసు ఇచ్చారు. బీహార్‌కు ప్రత్యేక హోదా డిమాండును తాము విడిచిపెట్టలేదని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రెండ్రోజుల క్రితం స్పష్టం చేశారు.



ఎస్టీలకు అన్యాయం జరగకుండా బోయలకు రిజర్వేషన్

విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : ప్రస్తుతం ఎస్టీలకు ఇస్తున్న ఆరు శాతం రిజర్వేషన్‌కు భంగం కలగకుండా బోయ, వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చాలని తాము నివేదిక ఇచ్చామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ చెప్పారు. కమిషన్ సభ్యులు బుధవారం జిల్లాలో పర్యటించి, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ మండలం లోని ఎరుకొండ గ్రామంలో ఇటీవల దళితులపై జరిగిన దాడి ఘటనను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ సందర్భంగా ఛైర్మన్ శివాజీ పోలీసులతీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బాధితులకు బదులు పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారని పోలీసు అధికారులపై మండిపడ్డారు. సంబంధిత ఎస్ఐ, సీఐలను కమిషన్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. జిల్లాలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. బాధిత దళిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పరిహారాన్ని, మూడు నెలల రేషన్‌ను అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకహోదా రాష్ట్రానికి అవసరమని, దీనికోసం తమ వంతు కృషి చేస్తామని అన్నారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివేక్ యాదవ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ శోభా స్వాతిరాణి, కమిషన్ సభ్యులు రాజారావు పాల్గొన్నారు.

మిర్చికి రాయితీలు : ఉద్యాన శాఖ కమిషనర్

విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : మిర్చికి ఉద్యాన శాఖ ద్వారా అనేక రాయితీలు కల్పిస్తున్నామని ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. స్థానిక ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం చిరంజీవి చౌదరితో మిర్చి యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, సెంట్రల్ మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ ఏపీ ప్రభుత్వ ప్రతినిధి పావులూరి విజయలక్ష్మి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి చౌదరి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని మిర్చి రైతులు ఉద్యాన సాగు వైపు దృష్టి సారిస్తే లాభాలను ఆర్జించవచ్చని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందన్నారు. మిర్చిని ఆరబోయటానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పాలిడ్రైయర్స్ ఏర్పాటుతో దుమ్ము, ధూళి లేకుండా, రంగు, నాణ్యత కోల్పోకుండా తక్కువ సమయంలో శాస్త్రీయంగా ఆరబెట్టవచ్చునన్నారు. మిర్చి నాణ్యత ప్రమాణాలు పెంచటం ద్వారా రైతుకు మెరుగైన ఆదాయం వస్తుందన్నారు. ఉద్యానశాఖ ద్వారా బయ్యర్, ఐటీసీ, స్పైసెస్ బోర్డు వారి అనుసంధానంతో కొన్ని ప్రాంతాలలో ఈ విధానాన్ని అవలంబిస్తున్నామన్నారు. నేలలో సారాన్ని కాపాడటంలో మల్చింగ్ సమర్థవంతంగా ఉపయోగపడుతుందన్నారు. మిర్చి యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ రైతులు అఫ్లోటాక్సిన్‌లపై అవగాహన పెంచుకొని నాణ్యమైన ఉత్పత్తులు ఎగుమతి చేసినట్లైతే అంతర్జాతీయ విపణిలో మంచి ధర పలికే అవకాశం ఉందన్నారు. ఎంఐడీహెచ్ ఏపీ ప్రభుత్వ ప్రతినిధి పావులూరి విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగుకు మొగ్గు చూపేలా చూడాలన్నారు.



కౌలు రైతు కంట కన్నీరు

- గతేడాది కన్నా సగం తగ్గిన రైతన్నలు
- కౌలుదారుల గుర్తింపునకు అధికారుల కసరత్తు
- రుణాలకు బ్యాంకర్ల అడ్డంకే కారణమా!



విశాలాంధ్ర - విజయనగరం : కౌలు రైతులకు తనవంతు సాయంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు వారి దరికి చేరడంలేదు. పండిస్తున్న పంట గిట్టుబాటు కాక మరోవైపు ప్రభుత్వ రాయితీలు అందక కౌలు రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కౌలుకిచ్చిన భూ యజమానులకు అనుకున్న ప్రకారం పంటలో వాటా ఇవ్వాల్సిందే. ఇక ఎరువులు, విత్తనాల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతోపాటు కూలీలకు అధిక కూలిని ఇవ్వాల్సి రావడంతో కౌలురైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు.

కౌలు రైతుల గుర్తింపునకు విజయనగరంజిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమైంది. ఇప్పటికే జిల్లా లోని అన్ని మండలాలలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 10నుంచి 17 వరకు కౌలు రైతుల గుర్తింపు కార్డుల మంజూరుపై గ్రామాలలో అవగాహన సదస్సులను పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ నెల 24 నుంచి వచ్చే నెల 5 వరకు కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను మంజూరు చేయనున్నారు. ఇప్పటికే అన్ని మండలాలలో కౌలు రైతులను గుర్తించి నివేదిక తయారుచేశారు. ఈమేరకు జిల్లాలో 2018-19 సంవత్సరానికి గాను మొత్తం 10,500మంది కౌలు రైతులు ఉన్నట్లుగా గుర్తించారు. వీరిలో విజయనగరం డివిజన్‌లో 4,400 మంది, పార్వతీపురం డివిజన్‌లో 3,963 మంది కౌలు రైతులు వున్నారు.

గతేడాది కన్నా సగానికి పైగా తగ్గిన రైతులు

జిల్లాలో కౌలు రైతుల సంఖ్య గతేడాదికన్నా సగానికి పైగా తగ్గిపోయింది. గతేడాది జిల్లాలో మొత్తం 24,807 మంది కౌలు రైతులు వుండేవారు. కానీ ఈ ఏడాది 10,500 మందికి తగ్గిపోయారు. ఇందుకు కారణాలు అనేకం ఉన్నా కౌలు రైతుల సంఖ్య ఇంత భారీగా తగ్గడంపై వారి కష్టాలను అవగాహన చేసుకోవచ్చు. పార్వతీపురం డివిజన్‌కన్నా విజయనగరం డివిజన్‌లోనే భారీ సంఖ్యలో కౌలు రైతులు తగ్గిపోయారు. ముఖ్యంగా వలసలకు పెట్టింది పేరైన పార్వతీపురం డివిజన్‌లోని పలు మండలాలలో కౌలు రైతుల సంఖ్య వందల నుంచి పదుల సంఖ్యకు పడిపోయింది. దీంతో రానున్న కాలంలో కౌలు రైతులు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

24 నుంచి రుణ అర్హత కార్డుల మంజూరు

కౌలు రైతులకు ఉపయోగపడేవిధంగా ఈ ఏడాది వర్షాకాలం ముందే రుణఅర్హత కార్డులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక తయారుచేసింది. అందులో భాగంగా ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 5 వరకు రుణఅర్హత కార్డులను తహశీల్దార్‌లు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ సభలను నిర్వహించి ముందుగా విచారణద్వారా ఖరారు చేసిన వారికి కౌలు రైతుల అర్హత కార్డులను అందజేస్తారు. కార్డుల మంజూరు నివేదికను ప్రతి శుక్రవారం ఆర్‌డీఓకు తహశీల్దార్‌లు సమర్పించాలి.

రాయితీలు అందక రైతుల సంఖ్య తగ్గుతోంది



ఈ ఏడాది కౌలు రైతుల సంఖ్య తగ్గడానికి అనేక కారణాలు వున్నాయి. వాటిలో ప్రధానమైనది ప్రభుత్వ ఫలాలు అందకపోవడమే. భూయజమానులు తమ భూముల కౌలు ఇచ్చే సమయంలో ఎటువంటి పత్రాలు రాసేందుకు అంగీకరించడంలేదు. దీంతో రుణఅర్హత పత్రాలు అందడంలేదు. ఇక రుణఅర్హత కార్డులు ఉన్నా బ్యాంకర్లు అనేక కారణాలతో రుణాలను ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కార్డులు లేక ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను కూడా అందుకోలేకపోతున్నారు. కౌలు రైతులకు ఒప్పంద పత్రాలు రాయడం వలన భూయజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తాము సదస్సులలో అవగాహన కల్పిస్తున్నా భయం వీడడం లేదని తహశీల్దార్ చెబుతున్నారు.

కె.ఆనందరావు, తహశీల్దార్, జామి

అంతా మా ఇష్టం

- అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న వీఆర్‌ఓపై దాడి
- వందలకొద్దీ ట్రాక్టర్లలో లక్షల రూపాయల ఎర్రమట్టి తరలింపు
- ఆపితే బదిలీ చేస్తామంటూ తెలుగు తమ్ముళ్ళ బెదిరింపు
- దోపిడీ జరుగుతున్నా మిన్నకున్న అధికారులు



విశాలాంధ్ర - శింగరాయకొండ రూరల్ : అక్రమ మైనింగ్‌కు అడ్డు చెప్పాడని వీఆర్‌ఓపై దాడి చేసిన ఘటన ప్రకాశంజిల్లా శింగరాయకొండ మండలంలోని పాత శింగరాయకొండ గ్రామంలో బుధవారం జరిగింది. మండలంలోని అన్ని పంచాయతీల్లోని చెరువుల్లో, గుంటల్లో యర్రమట్టిని దోచే స్తూ ప్రతి రోజు వందలకొద్దీ ట్రాక్టర్ల మట్టిని తరలిస్తు న్నారు. ఈ సమాచారం అందుకున్న పాత శింగ రాయకొండ వీఆర్‌ఓ జాలయ్య బుధవారం అక్ర మంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లకు అనుమతు లు చూపించాలని రోడ్డుపై నిలుపుదల చేశారు. దీనితో తెలుగు తమ్ముళ్ళు మా వ్యాపారాలకే అడ్డు వస్తున్నావంటూ వీఆర్‌పై దాడి చేసి నానా దుర్భాష లాడారు. ప్రభుత్వమే మాదంటూ, మాపై చర్యలు ఏ విధంగా తీసుకుంటావంటూ నడి రోడ్డుపై హల్‌చల్ సృష్టిం చారు. ఇది ఇలా ఉంటే ఆపుదల చేసిన వీఆర్‌ఓపై తెలుగు తమ్ముళ్లు అక్రమ మైనింగ్ జోలి కి వస్తే బదిలీలు తప్పవంటూ తనదైన శైలిలో హైరా నా సృష్టించారు. స్థానిక ప్రతినిధికి చెప్పి విధుల నుండి తప్పిస్తామంటూ బెదిరించారు. నడి రోడ్డుపై ఇంత జరిగినా తెలుగు తమ్ముళ్ళపై ఎటువంటి ఫిర్యా దులు అందకపోవడం మండలంలో విస్మయం చోటు చేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు జరిగినా అటు రెవిన్యూ ఉన్నతాధికారులుగాని, ఇటు పోలీసు అధికారులుగానీ చర్యలు తీసుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. రాష్ట్రంలో తహశీల్దార్ వనజాక్షిపై జరిగిన దాడి ఘటనలు పునరావృతం అవుతున్నట్లుగానే శింగరాయకొండ దాడి ఘటన జరిగింది.

వందల కొద్దీ ట్రాక్టర్లతో ఎర్రమట్టి తరలింపు

ప్రతి నిత్యం పగలు, రాత్రి తేడా లేకుండా ఎర్రమట్టిని వందల కొద్దీ ట్రాక్టర్లతో తరలిస్తూనే ఉన్నారు. ప్రక్క మండలాలకు, జిల్లాలకు ఎర్రమట్టిని తరలిస్తూ అక్రమ మైనింగ్ రాయుళ్ళు తమదైన శైలిలో వ్యాపారాన్ని సాగిస్తున్నారు. గ్రామాల్లో చెరువు లు, కొండలు సైతం అక్రమ మైనింగ్‌రాయుళ్ళ దెబ్బకు కోట్ల రూపాయల యర్రమట్టి తరలిపోతు న్నది. ఇంత జరుగుతున్నా దీనిపై చర్యలు లేకపోవ డంపై మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన లక్ష్మీనర్సింహం ఆధ్వర్యం లోనూ విజిలెన్స్ డిపార్టు మెంట్‌లో ఉన్న వంగా సుబ్బారెడ్డి సమయంలో మైనింగ్ రాయుళ్ళపై తీవ్రమైన నిలుపుదల చర్యలు జరిగాయి. ప్రస్తుతం అధికారులపై రాజకీయ నాయకుల వత్తిళ్ళ కారణంగా, మామూళ్ళ స్వీకరణ కారణంగా ఎర్రమట్టి దోపిడీ దారులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవడంలేదు. కనీసం ఇప్పటికైనా వీఆర్‌ఓపై జరిగిన దాడికిపై కూడా చర్యలు లేక పోవడంపై అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా దాడిపై ఎటువంటి ఫిర్యాదు అందకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామ ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

రైతు ఆత్మహత్య



విశాలాంధ్ర - అద్దంకి : ఆర్థిక సమస్యలతో పురుగు మందు సేవించి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశంజిల్లా అద్దంకి మండలంలోని వేల మూరిపాడులో బుధవారం జరిగింది. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన మేడిగం బ్రహ్మానందరెడ్డి (45) ఇటీవల పొలాలు కొనుగోలు చేశాడు. అయితే అతను కొనుగోలు చేసిన వ్యవసాయ భూములు కోర్టు కేసులలో ఉన్న కారణంగా గత కొంతకాలం నుంచి ఆర్థిక సమస్యలతో బాధపడు తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై అద్దంకి వచ్చి పురుగుల మందు తీసుకొని వేలమూరిపాడు గ్రామ పొలాలలోకి వెళ్ళి శీతలపానీయంలో పురుగుల మందు కలుపుకొని తాగి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు బ్రహ్మానందరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం జరిగింది. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అద్దంకి ఎస్ఐ ఆరాధ్యుల సుబ్బరాజు తెలియజేశారు. మృతుడి జేబులో సూసైడ్ నోట్ ఉన్నట్లు ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు. సూసైడ్ లెటర్‌లో తన చావుకు అయిదుగురు వ్యక్తులు కారణమని, వారి నుంచి తనకు డబ్బు రావలసిఉందని రాసినట్లు సమాచారం.

రైళ్లలో మహిళా సిబ్బంది



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీ నగర్) : రైలు ప్రయాణంలో ప్రయాణికుల భద్రతకు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకున్నామని, ముఖ్యంగా మహిళా ప్రయాణికుల భద్రతకు ప్రత్యేకమైన మహిళా ఆర్పీఎఫ్ సిబ్బందిని నియమించామని, వారు మహిళాకోచ్‌లలో రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహిస్తున్నారని విజయవాడ డివిజన్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఎస్.ఆర్.గాంధీ తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైళ్లలో మహిళా కోచ్ లలో తాము ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన మహిళా ఆర్పీఎఫ్ సిబ్బందిని నియమించడంతో అవి సత్ఫలితాలను ఇవ్వడంతో ఇప్పటివరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, మిగిలిన రోజుల్లో కూడా ఇదే విధంగా కొనసాగాలని నిర్ణయించామన్నారు. గత ఏడాది డివిజన్ పరిధిలో ఆర్పీఎఫ్ సిబ్బంది చేపట్టిన చర్యల ఫలితంగా 47 మంది మైనర్ బాలికలను, ఆరుగురు మహిళలను కాపాడి వారి తల్లిదండ్రులకు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించామన్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రాంత మహిళలు బంగారు వస్తువులు అధికంగా వేసుకుంటా రని గుర్తించిన దొంగలు వాటి చోరీకి ప్రయత్నిస్తున్నారని ముఖ్యంగా ఉత్తరాది నేరస్తులు రైళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నార న్నారు. అయితే తాము చేపట్టిన భద్రత చర్యలతో ఇప్పటివరకు చోరీలు జరగలేదన్నారు. వేసవిలో దొంగతనాలు అధికంగా జరిగే అవకాశం ఉందని దానిని దృష్టిలో పెట్టుకుని రాత్రి సమయాల్లో నడిచే అన్ని రైళ్లకు ఎస్కార్ట్ సిబ్బందిని నియమించామన్నారు. విజయవాడ డివిజన్‌లో 24 మంది మహిళా ఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారని వారిని మహిళాకోచ్‌లలో నియమించామన్నారు. వీరివద్ద ప్రత్యేకమైన అధునాతన పరికరాలు ఉంటాయని ఎవరికైనా ఇబ్బంది కలిగిన వెంటనే వీరు స్పందించి చర్యలు తీసుకుంటారని, అంతే కాకుండా తరువాత వచ్చే రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించి రైలు వద్దకు భద్రతాసిబ్బంది వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటారని వివరించారు.తమ సిబ్బంది కూడా అకస్మాత్తుగా రోడ్డు మార్గాన ప్రయాణించి ప్రత్యేక తనిఖీలు చేపడతారన్నారు. తమ సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించి తమకు సహకరించాలని కోరారు. అవసరమైన పక్షంలో టోల్‌ఫ్రీ సెక్యూరిటీ హెల్ప్‌లైన్ నెంబర్ 182కు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో విజయవాడ పోస్టు ఆర్పీఎఫ్ సీఐ జీవీఆర్ కుమార్, ఎస్ఐ బుర్రా సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో ఐటీ దాడులు

విశాలాంధ్ర - హిందూపురం : అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలోని డాక్టర్ బాలాజీ (ఆర్థో) ఆసుపత్రిలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆర్థో డాక్టర్ బాలాజీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని హిందూపురం, అనంతపురం అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సోదాలు జరుగుతూనే ఉన్నాయి. డాక్టర్ బాలాజీ, తేజ నర్సింగ్ హోమ్‌లలో ఏకకాలంలో తనిఖీలు జరిగాయి. ఐటీ దాడుల్లో ఏమేమి దొరికాయి.. సమాచారం అందజేయాలని మీడియా ప్రతినిధులు కోరగా అసిస్టెంట్ కమిషనర్ వీటికి సంబంధించిన వివరాలు తెలపడా నికి నిరాక రించారు. కొన్ని డాక్యుమెంట్లు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐటీ సోదాలు ఎంత వరకు జరుగుతాయో ఇప్పుడే చెప్పలేమని దాట వేశారు. ఐటీ దాడులు చేయ డం పన్ను ఎగవేత దారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. హిందూపురం ఇప్పుడిప్పుడే ఒక వాణిజ్య కేంద్రంగా రూపుదిద్దుకొంటున్న తరుణంలో ఐటీ దాడులు పన్ను ఎగవేత దారులకు గుణపాఠం అవుతుందని ప్రజలు అంటున్నారు.

గుండెనొప్పితో ఆర్టీసీ డ్రైవర్ మృతి : 20 మందికి గాయాలు



విశాలాంధ్ర - పిడుగురాళ్ళ రూరల్ : గుంటూరుజిల్లా పిడుగురాళ్ళ నుండి కారంపూడి వెళ్తున్న ఆర్టీసీబస్సు డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో రోడ్డు ప్రక్కనే వున్న చెట్టును ఢీకొన్న ఘటన మండలంలోని జూలకల్లు శివారులో బుధవారం జరిగింది. పిడుగురాళ్ళ నుండి కారం పూడి వెళ్తున్న ఆర్టీసీబస్సు డ్రైవర్ తాజ్ బాబుకు అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో బస్సు రోడ్డు ప్రక్కనే వున్న చెట్టును ఢీకొంది. డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారంపూడి తహశీ ల్దార్ ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 20 మందికి గాయాలు కాగా పిడుగురాళ్ళ, కారంపూడి వైద్యశాలలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న జెడ్పీ ఛైర్మన్ జానీమూన్, ఆర్డీవో మురళి, పిడుగురాళ్ళ సీఐ హనుమంతరావు, ట్రాఫిక్ ఎస్సై మహ్మద్ రఫీ, కారంపూడి సీఐ మురళి ఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. సీఐ మురళి మాట్లాడుతూ జరిగిన ప్రమాదం చాలా బాధాకరమని బస్సులో వున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. మృతుడు పిడుగురాళ్ళ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, ఇతనికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు వున్నట్లు తెలిపారు. చెట్టును ఢీకొనడంతో ప్రమాదం తీవ్రత తక్కువగా వుందని, లేకుంటే ప్రమాదం తీవ్రస్థాయిలో జరిగివుండేదని ప్రయాణికులు తెలిపారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : సునీత

విశాలాంధ్ర - అమరావతి : ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని మంత్రి పరిటాల సునీత అన్నారు. బుధవారం మండలిలో సంక్షేమంపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ, డ్వాక్రా సంఘాలలోని ఆడపడుచులు ఒక్కొక్కరికి 10 వేల రూపాయలను చంద్రన్న పసుపు కుంకుమ కింద అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ప్రతి సభ్యురాలికి 8 వేల రూపాయలను వారి బ్యాంకు ఖాతాలలో జమచేసినట్లు చెప్పారు. దీనికిగాను ఇప్పటివరకు రూ. 6 వేల 883 కోట్లు ఖర్చు చేశామన్నారు. డ్వాక్రా సంఘాల రుణాలపై బ్యాంకు వారు చేసిన వడ్డీ మాఫీ చేయడానికి రూ.2 వేల 316 కోట్లు చెల్లించమన్నారు. ప్రభుత్వం గత 3 సంవత్సరాలలో మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.51 వేల 36 కోట్లు వడ్డీ లేని రుణాలను మంజూరు చేశామన్నారు. మహిళా పొదుపు సంఘాలను, మహిళా వ్యాపార సంఘాలను,మార్కెటింగ్‌కి ఒక్కొక్క సంఘానికి రూ. 25 లక్షల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. దివ్యాంగులకు 2 వేల 600 మోటార్ వాహనాలను, బ్యాటరీతో పనిచేసే వీల్‌చైర్లను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి జిల్లాలో శారీరక దివ్యాంగులు, బధిరులు, అంధుల కోసం ఒక ఇంటిగ్రేటెడ్ స్కూలును ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సబల పథకం కింద విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, చిత్తూరు జిల్లాలో 11 నుండి 18 సంవత్సరముల వయస్సు మధ్యలో ఉన్న టీనేజ్ ఆడపిల్లలకి పోషకాహారాన్ని రేషన్‌గా ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు కొత్తగా మరో 6 జిల్లాలను కలిపి, మొత్తం 10 జిల్లాలలో ఈ సబల కార్యక్రమాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కేవలం సంక్షేమ పథకాలు అమలు మాత్రమే కాకుండా, మహిళ, శిశువుల హక్కుల రక్షణకు కూడా ఈ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. దివ్యాంగులను వివాహం చేసుకున్న వారికి ప్రోత్సాహకంగా 1 లక్ష రూపాయలను బహుమతిగా అందిస్తున్నారు. దివ్యాంగుల కొరకు విజయవాడలో రూ.కోటి 15 లక్షలతో ఒక స్టేట్ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొత్త రాష్ట్రంలో 'విశాలాంధ్ర' పాత్ర

సీపీఐ విశాలాంధ్ర శాఖ మహాసభలో ఈడ్పుగంటి




సీపీఐ విశాలాంధ్ర శాఖ మహాసభలో మాట్లాడుతున్న ఈడ్పుగంటి నాగేశ్వరరావు పక్కన గద్దం కోటేశ్వరరావు, రావుల వెంకయ్య, షేక్ బాబు, హరనాథరెడ్డి, ముత్యాల ప్రసాద్, మధుసూదనరావు. హాజరైన విశాలాంధ్ర సిబ్బంది

విశాలాంధ్ర-విజయవాడ: నూతన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు, రాజధానిగా అమరావతి నిర్మాణంతో విశాలాంధ్ర పాత్ర మరింత పెరిగిందని సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, విశాలాంధ్ర దినపత్రిక ఎడిటోరియల్ బోర్డు చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు అన్నారు. రాజధాని పరిధిలోని అన్ని ప్రాంతాలకు విశాలాంధ్ర పత్రిక చేరే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సీపీఐ విశాలాంధ్ర శాఖ మహాసభ స్థానిక చంద్రం బిల్డింగ్స్‌లో బుధవారం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య ఆవిష్కరించారు. అనంతరం విశాలాంధ్ర అసిస్టెంట్ ఎడిటర్ ఎస్‌కే బాబు అధ్యక్షతన జరిగిన మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు జాతి పురోభివృద్ధి లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీ 65 ఏళ్ల కిందట ప్రారంభించిన పత్రికకు 'విశాలాంధ్ర' అని పేరు పెట్టారని తెలిపారు. తొలి నుంచి విశాలాంధ్రను కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలు పర్యవేక్షించారని తెలిపారు. ఉద్యమ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని సమకాలీన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. తద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా కృషి చేయాలని అన్నారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, కమ్యూనిస్టు పార్టీ వైఖరిపై విశాలాంధ్ర ఉద్యోగులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీలపై దుష్ప్రచారం జరుగుతోందని, దీనిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నియంతృత్వ పాలన వల్ల దేశ ప్రజలు అల్లాడుతున్నార న్నారు. ఆర్థిక వ్యవస్థను ఛిన్నా భిన్నం చేశారన్నారు. కమ్యూనిజానికి కాలం చెల్లించదని కొందరు స్వయంప్రకటిత మేధావులు పేర్కొనడం సిగ్గుచేట న్నారు. దోపిడీ కొనసాగినంతకాలం కమ్యూనిజం బతికే ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైందన్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతను విస్మరించారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఐ, సీపీఎం ఏకతాటిపైకి వచ్చి భావసారూప్యత కలిగిన పార్టీలను కలుపుకొని ప్రత్యామ్నాయ రాజకీయ విశాల వేదికను రూపొందిస్తున్నట్లు వివరించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ గద్దం కోటేశ్వర రావు మాట్లాడుతూ ఉద్యోగులు తమ పని విధానంపై సమీక్ష చేసుకోవాలని, తద్వారా మెరుగైన విధంగా పత్రికను మార్కెట్‌లోకి తీసుకురావాలని సూచించారు. విశాలాంధ్ర ఎడిటర్ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు వృత్తినైపుణ్యంతోపాటు కమ్యూనిస్టు భావ జాలాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, అధ్యయనం కీలకమని, పార్టీ క్యాడర్‌కు మార్గనిర్దేశం చేసే విధంగా విశాలాంధ్ర సిబ్బంది ఉండాలని పేర్కొన్నారు. విశాలాంధ్ర జీఎం పి.హర నాథరెడ్డి మాట్లాడుతూ పత్రికను మెరుగుపరడంతోపాటు ప్రజలకు చేర్చడం కూడా కీలకమని, ఇందులో ప్రతి ఉద్యోగి, సీపీఐ శాఖ సభ్యులు భాగస్వాములు కావాలని కోరారు. కమ్యూనిజం మాసపత్రిక ఎడిటర్ ఎంసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమయానుకూలంగా పని చేసే సామర్థ్యం ప్రతి ఒక్కరూ మెరుగుపరుచుకోవాలని, మార్క్సిజం, కమ్యూనిజం భావాలను అలవరుచుకోవాలని చెప్పారు. అనంతరం కార్యదర్శి నివేదికను మధుసూదన రావు ప్రవేశ పెట్టారు. తొలుత గత మహాసభ నుంచి ఇప్పటి వరకు మరణించిన పార్టీ నాయకులు, సభ్యులు, విశాలాంధ్ర సిబ్బంది, పూర్వ ఉద్యోగులు, సంఘ నంస్కర్తలు, ప్రముఖుల మృతికి సంబంధించిన సంతాప తీర్మానాన్ని మోదుమూడి మురళీకృష్ణ ప్రవేశపెట్టగా, అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈడ్పుగంటి రామీలా వందనసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను విశాలాంధ్ర శాఖ తరఫున సన్మానించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, నాయకులు ఆర్. పిచ్చయ్య విప్లవ, అభ్యుదయ గేయాలను ఆలపించారు. తొమ్మిది మందితో శాఖ నూతన కార్యవర్గాన్ని మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మధుసూదన రావు, సహాయ కార్యదర్శిగా సీహెచ్ కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా కె.విజయలక్ష్మి, ఈడ్పుగంటి రామీలా, వి.రమేష్, ఎస్‌కే సూర్యనారాయణ, నారాయణ, ఏ సురేష్‌బాబు, కె. వెంకటస్వామి ఎన్నికయ్యారు.

'ఉపాధి'లో దోపిడీ

- చలో అసెంబ్లీ పిలుపునకు రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన కూలీలు
- సభా వేదికకు వచ్చిన ఉపాధి హామీ పథకం సహాయ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం
- వారం రోజుల్లో అమలు చేస్తామని భరోసా



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధి హామీ పథకం నిధుల్ని పచ్చచొక్కాల నేతలు బొక్కుతున్నారని, కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్ విమర్శించారు. ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను, డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఏపీ ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు బుధవారం ఇచ్చిన చలో అసెంబ్లీ పిలుపునకు భారీ స్పందన లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉపాధి కూలీలు తరలివచ్చారు. 13 జిల్లాల నుంచి తరలివస్తున్న కార్మికుల్ని పోలీసులు ముందు రోజు నుంచి ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. అయినప్పటికీ, విజయవాడ అలంకార్ సెంటరు సమీపాన ఏర్పాటు చేసిన సభకు రైళ్లు, బస్సుల ద్వారా వేలాదిమంది కూలీలు వచ్చారు. సభకు అధ్యక్షవర్గంగా బీకేఎంయూ, ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల శేఖర్, దడాల సుబ్బారావు వ్యవహరించారు. సభా వేదికగా పలు సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు చర్చించారు.కూలీల పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ వ్యవహరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. మధ్యాహ్నంలోగా సభా వేదిక దగ్గరకు ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారి విచ్చేసి, హామీల అమలుపై ఒక ప్రకటన చేయాలని డిమాండు చేశారు. లేకుంటే ఇక్కడి నుంచి కాలినడకన అమరావతి వరకూ చలో అసెంబ్లీకి తరలివెళ్తామని జల్లి విల్సన్ ప్రకటించారు. కొద్ది సమయానికి ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ కమిషనర్ బాల సుబ్రహ్మణ్యం సభ దగ్గరకు రాగా, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఆయన్ని వేదికపై ఆహ్వానించారు. తమ డిమాండ్ల పరిష్కరిస్తూ అధికారులు రాత పూర్వకంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ, ఉపాధి పనుల్లో భాగంగా క్యూబిక్ మీటరుకు చొప్పున కూలి ధరలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రాల్లో ఉపాధి హామీ పథకం బోర్డులు ఏర్పాటు చేయాలని శేఖర్ కోరారు. కష్టపడిన వారంలోగా కూలి ఇవ్వాలని దడాల సుబ్బారావు వేదికపై ఉన్న అధికారికి విన్నవించారు.

7 డిమాండ్ల అమలుకు అసిస్టెంట్ కమిషనర్ హామీ : రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలకు చెందిన 10 డిమాండ్లలో 7 డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ గ్రామీణ పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు. ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు వివరించిన డిమాండ్లపై ఆయన మాట్లాడారు.బాలసుబ్రహ్మణ్యం ఇచ్చిన హామీతో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విరమిస్తున్నామని వెంకటేశ్వర్లు, విల్సన్ ప్రకటించారు. కార్యక్రమానికి బీకేఎంయూ నాయకులు పి.భీమలింగప్ప, శివ నాగరాణి, చిలుకూరి వెంకటేశ్వరరావు, బి.రమేష్, జేబీ శ్రీధర్, జి.సూరయ్య, పెంచలయ్య, నక్కా కిశోర్, బండి వెంకటేశ్వరరావు, ఎ.బాలయ్య, ఏఐఏడబ్ల్యూయు నాయకులు ఎం.నాగేశ్వరరావు, కె.నారాయణ, అన్వేష్ తదితరులు నాయకత్వంవహించారు.

నాలుగేళ్లలో రైతుల ఆత్మహత్యలు 248


కాంగ్రెస్ పాలనలో 1,978 మంది : సీఎం

విశాలాంధ్ర అమరావతి : టీడీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రైతుల సాగు ఖర్చులను తగ్గించి రెట్టింపు ఆదాయం వచ్చే దిశగా చర్యలు చేపడుతోందని సీఎం చంద్రబాబు చెప్పారు. విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై ఇవ్వటంతోపాటు పంటల కోసం సూక్ష్మ పోషకాలను నూరుశాతం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అందుకే నాలుగేళ్ల తమ పాలనలో రైతుల ఆత్మహత్యలు చాలా తక్కువగా జరిగాయన్నారు. మరీ ఆర్థిక ఇబ్బందులు తాళలేక నాలుగేళ్లలో 248 మంది రైతులే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై జరిగిన లఘు చర్చపై సీఎం చంద్రబాబు బుధవారం మాట్లాడారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో 1,978 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వారి హయాంలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అంతేగాకుండా ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండేందుకు ధైర్యం చెబుతున్నట్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ.5 లక్షలు నష్టపరిహారాన్ని అందజేస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. రైతులను నష్టాల నుంచి గట్టెక్కించేందుకే రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నామని, విడదల వారీగా రూ.24,500 కోట్ల రుణాలను మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా, వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.19,070 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. ప్రపంచం మెచ్చేలా రాష్ట్రంలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే వృద్ధి రేటు జాతీయస్థాయి కంటే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. మేలైన విత్తనాలను ఉత్పత్తి చేయటంతోపాటు విదేశాలకుసైతం సరఫరా చేసేందుకు కర్నూలు జిల్లాలో 650 ఎకరాల్లో విత్తన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయాంత్రీకరణను అలవాటు చేయటంతోపాటు రైతు రథం పథకం కింద 12 వేల ట్రాక్టర్లను అందజేసినట్లు చెప్పారు.

ఏపీ ఎంసెట్-2018 ప్రవేశ పరీక్షకు

1,65,400 దరఖాస్తులు

విశాలాంధ్ర-కాకినాడ : ఏపి ఎంసెట్-2018ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 1,65,400 మంది దరఖాస్తు చేసుకున్నారని జెఎన్‌టియుకె ఆర్అండ్‌డి డైరెక్టర్, ఏపి ఎంసెట్ కన్వీనర్ ప్రొ.సిహెచ్. సాయిబాబు తెలిపారు. ఈమేరకు ఆయన బుధవారం మీడియాకు ఎంసెట్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంజనీరింగ్ విభాగంలో 1,13,687మంది, అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో 51,024మంది, రెండు విభాగాలలో 680 మంది ఉన్నారన్నారు. పరీక్షకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 29వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రూ.500అపరాధ రుసుంతో ఏప్రియల్ 6వ తేదీ వరకు, రూ.1000అపరాధ రుసుంతో ఏప్రిల్ 11వ తేదీ వరకు రూ.5000అపరాధ రుసుం తో ఏప్రిల్ 16వ తేదీ వరకు, రూ.10,000అపరాధ రుసుంతో ఏప్రిల్ 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులు ఎంసెట్ దరఖాస్తును పూరించిన సమయంలో తప్పులు నమోదు చేసినట్లయితే ఏప్రిల్ 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు వాటిని సరిచేసుకునేందుకు అవకాశం కల్పించామని, వీటిని రెండు కేటగిరీలుగా విభజించామన్నారు. కేటగిరీ-1లో విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, సంతకం, ఫోటో, ఇంజనీరింగ్/ అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగం, కమ్యూనిటీ, ఇంటర్ హాల్‌టికెట్ నెంబర్లకు సంబంధించి తప్పులు నమోదు చేసినట్లయితే వాటికి సంబంధించిన ధృవపత్రాలను ఎంసెట్ మెయిల్ ఐడికి పంపిస్తే సరిచేయడం జరుగుతుందన్నారు. అలాగే కేటగిరీ-2లో ఇంటర్ పాసైన సంవత్సరం, ఇంటర్‌లో తెలుగు / ఇంగ్లీష్ మీడియం, విద్యార్థి చదివిన ప్రాంతం, బ్రిడ్జి కోర్సు హాల్‌టికెట్ నెంబరు, పుట్టిన జిల్లా/రాష్ట్రం, జెండర్, స్పెషల్ కేటగిరీలకు సంబంధించి పైన తెలిపిన తేదీలలో విద్యార్థి సరిచేసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్ పద్ధతిపై విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడం ద్వారా పారదర్శకంగాను త్వరితగతిన ర్యాంకులు కేటాయించడం జరుగుతుందని, ఈ విధానంలో పరీక్ష రాసేసమయంలో జవాబును ఎన్నిసార్లయినా మార్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు కంప్యూటర్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, వెబ్‌సైట్‌లో పొందుపర్చిన మాక్ టెస్ట్‌ల ద్వారా కూడా సన్నద్ధత కావచ్చునని సూచించారు. ఐదు రోజుల పాటు జరిగే ఎంసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల ప్రశ్నాపత్రాలు కష్టంగాను, సులభంగాను ఉన్నాయని ఒకరితోనొకరు పోల్చుకుని ఆందోళన చెందనవసరం లేదని, నిర్దేశించిన నిబంధనల ప్రకారం సాధారణీకరణ (నార్మలైజేషన్) పద్ధతిలోనే ప్రశ్నాపత్రాలు మూల్యాంకణం చేయడం జరుగుతుందని కన్వీనర్ స్పష్టం చేశారు. ఏపి ఎంసెట్-2018కు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 0884-2340535, 0884-2356255 ఫోన్ నెంబర్ల ద్వారా గాని, ఈమెయిల్ ఐడి apeamcet18@gmail.com ద్వారా గాని సంప్రదించాలని ఆయన సూచించారు.



దళిత తేజం పేరుతో మోసం

వచ్చే నెల 11 నుండి 14 వరకు చైతన్య సదస్సులు : ప్రభాకర్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దళిత తేజం పేరుతో మోసం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ కుట్రలను తిప్పి కొట్టేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఏప్రిల్ 11 నుండి బాబా సాహేబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు సదస్సులు, సభలు నిర్వహించాలని కులనిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమా వేశంలో తీర్మానం చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధ వారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో "దళిత తేజం బూటకం - చంద్రబాబు నాటకం" పేరుతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సభకు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు తూమాటి శ్రీరాములు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభా కర్ మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వ హయాంలో దళి తులపై దాడులు జరుగుతున్నాయని వాటిని అరికట్టి బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం దళిత నాయ కులను రాజీల పేరుతో వారినే భయపెడుతున్నారన్నారు. ఇటువంటి కుట్రలను తిప్పి కొట్టే విధంగా ఏప్రిల్ 11 నుండి 14 వరకు చైతన్యపరచడానికి సదస్సులు, సమావే శాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఓపీడీఆర్ నాయకులు కె.ఏసు, పీడీఎం నాయకులు వానపల్లి రామ కృష్ణ, యం. మహేష్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, సంగటి కోటేశ్వ రరావు, జి.శ్రీనివాసరావు, విప్లవ రచయిత సంఘం నాయ కులు అరసవల్లి కృష్ణ, మానవ హక్కుల నాయకులు రోహిత్, టి.కృష్ణ, ఉన్నం నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

కేసును పునర్విచారణ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో -న్యూఢిల్లీ : వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల అఫిడవిట్‌లో భార్య గురించి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు దాఖలైన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలో ధర్మాసనం పిటిషనర్ వాదనను సమర్థిస్తూ దీనిపై విచారణ చేపట్టాలని హైకోర్టును ఆదేశించింది. 2014 ఎన్నికల్లో చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం నుంచి వైకాపా తరపున పోటీ చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి టీడీపీ అభ్యర్థి వెంకట రమణరాజుపై గెలుపొందారు. అయితే పెద్దిరెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ వెంకటరమణరాజు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం.. పిటిషనర్ వాదనతో ఏకీభవించింది. పెద్దిరెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో భార్యను ఓ చోట ఎండీగా, మరోచోట సాధారణ గ ృహిణిగా పేర్కొన్నారని, ఆదాయ వనరులను సరిగా చూపలేదని నిర్ధారిస్తూ సుప్రీంకోర్టు వంద పేజీల తీర్పును వెలువరించింది. ఈ కేసును పునర్విచారణ చేయాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రాతో కూడిన ధర్మాసనం హైకోర్టును ఆదేశించింది. తాజాగా సుప్రీం ఇచ్చిన ఆదేశాలు వైకాపా వర్గాలను ఆందోళనకు గురిచేసింది.

వైద్య మిత్రలకు పెరిగిన జీతాలు చెల్లించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో వైద్యమిత్రలకు పెరిగిన జీతాలు వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఆరోగ్య మిత్రలుగా పిలవబడేవారిని రాష్ట్ర ప్రభుత్వం వైద్యమిత్రలుగా పేరుమార్చి వారి సేవలను వైద్య ఆరోగ్య రంగంలో ఉపయోగించుకుంటుందన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా వారంతా సర్వీసులో ఉండి పనులు చేస్తున్నారన్నారు. గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నత చదువులు చదివినవారంతా 1600మంది వరకూ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు సేవలందిస్తుండగా వీరికి కేవలం 5500 రూపాయలు మాత్రమే నెలకు జీతం ఇస్తున్నారన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే జీవో 151 ప్రకారం వారందరికి జీతాలు చెల్లించాలని, కక్షసాధింపు చర్యలు మానుకుని వెంటనే 151ని 2016 ఆగష్టు నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని ఓబులేసు హెచ్చరించారు.


ఏప్రిల్ 9న అసిస్టెంట్ ప్రొఫెసర్ల

పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ టెస్టు : గంటా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 14 యూనివర్శిటీల పరిధిలోని 1109 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ ప్రక్రియకు ఏప్రిల్ 9వ తేదీ నుంచి 13వరకూ స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తామని రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.బుధవారం విజయవాడ బందరు రోడ్డులోని ఓ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఏపీపీఎస్సీ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నిర్వహించబోయే స్క్రీనింగ్ టెస్టు వివరాల్ని తెలిపారు.ఆగస్టు 10, 2015 నాటి ఉన్నత విద్యా సంస్థలు, నిర్వహణా సామర్థ్యం నియమావళి మేరకు రేషనలైజేషన్ విధానంలో పోస్టుల భర్తీకి కమిటీ సిఫార్సు చేసిందన్నారు. కమిటీ తమ పరిశీలనలో మొత్తం 3 కేటగిరీలలో మొత్తం 1711 టీచింగ్ పోస్టులు ఖాళీగా వున్నట్లు గుర్తించిందన్నారు. వాటిలో 1385 పోస్టుల భర్తీకి సిఫార్సు చేశామన్నారు. యూని వర్శిటీల నిర్వహణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 14 యూనివర్శిటీల పరిధిలో 3,259 పోస్టులు మంజూరయ్యాయని, వాటిలో 1554 పోస్టులు (48శాతం) భర్తీ అయ్యాయని తెలిపారు. ఖాళీగా వున్న 1117 పోస్టులలో ఫేజ్-1 ద్వారా 846, ఫేజ్-2 ద్వారా 263 పోస్టుల కోసం ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ టెస్టును నిర్వహిస్తున్నామన్నారు. స్క్రీనింగ్ టెస్టు కోసం వివిధ యూనివర్శిటీలలో 76,356 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. విశాఖ పట్నం ఆంధ్రా యూనివర్శిటీకి 19,500, తిరుపతి ఎస్వీయూ-14,278, అనంత పురం జేఎన్టీయూ-11,193, ఏఎన్‌యూ గుంటూరు-6,626, శ్రీకృష్ణదేవరాయ అనంత పురం-6306, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ శ్రీకాకుళం-2968 కర్నూలు రాయలసీమ యూనివర్శిటీ-2690, రాజ మహేంద్రవరం ఆదికవి నన్నయ్య యూని వర్శిటీ-2586, కాకినాడ జేఎన్టీయూ-2560, విక్రమ సింహపురి నెల్లూరు- 2490, యోగి వేమన యూనివర్శిటీ కడప-2379, మచిలీపట్నం యూని వర్శిటీ-1363, తిరుపతి పద్మావతి మహిళా యూనివర్శిటీ-761, కుప్పం ద్రవిడ యూనివర్శిటీకి-656 అసిస్టెంట్ ప్రొఫెసర్‌పోస్టులకు దరఖాస్తులు వచ్చాయని వివరించారు.స్క్రీనింగ్ టెస్టు ద్వారా ఏప్రిల్ 9వ తేదీనుంచి 13వరకూ 11కేంద్రాల్లో పరీక్షను నిర్వహిస్తామని చెప్పారు .అసిస్టెంట్ పోస్టుకు 69 దరఖాస్తులు యావరేజ్‌గా వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రితోపాటు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ యాక్ట్‌ను నీరుగార్చే చర్యలు తగవు :సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగమవుతుందని, ఆ కేసుల్లో నిందితులైన ఉద్యోగులను తక్షణ అరెస్టు నుండి మినహాయిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను పునః సమీక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు దళితుల రక్షణకున్న హక్కులను ప్రశ్నార్థకం చేస్తాయన్నారు. ఇప్పటికే ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకొని అనేక మందిదోషులు శిక్షలు పడకుండా తప్పించుకుంటున్నారని తెలిపారు. ఎక్కడైనా చట్టందుర్వినియోగమైనట్లు నిరూపణ అయితే అందుకు బాధ్యులైన వారిని శిక్షించొచ్చు కానీ దుర్వినియోగం పేరుతో మొత్తం చట్టాన్ని నీరుగార్చే పని చేయరాదన్నారు.



6.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం

4వేల కోట్లతో ప్లాంట్ ఆధునీకరణ పనులు : మధుసూదన్

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : రానున్న ఆర్థిక సంవత్సరంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ 6.3 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయనున్నట్లు సంస్థ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.మధుసూధన్ తెలిపారు. నగరంలోని హోటల్ గేట్ వే నందు వినియోగదారుల సమావేశం బుధవారం ఉదయం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరికొన్ని రోజుల్లో ముగియనుందని ఈసంవత్సరానికి సంబంధించి 5 మిలియన్‌టన్నుల ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. మొదటిసారిగా సంస్థ అత్యధిక ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. అలాగే సేల్స్ టర్నోవర్ కూడా మంచి స్థాయిలో ఉన్నామన్నారు. 16వేల కోట్ల టర్నోఉనవర్ సాధించామని గత ఏడాదితో పోల్చితే 35 శాతం ఎక్కువగా గ్రోత్ పెరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం నష్టాలు లేకుండా ఉందని, వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో లాభాల బాటలో ఉంటామని తెలిపారు. నూతన రాజధానిప్రాంతం విజయవాడ పరిసర ప్రాంతమైన గన్నవరంలో నూతన శాఖను ప్రారంభించినట్లు తెలిపారు. దీనితో ఇక్కడి వినియోగదారుల అవసరాలను గురించి తెలుసుకు నేందుకు సమావేశం ఏర్పాటుచేసినటుల తెలిపారు. ప్రస్తుతం విజయవాడ రీజి యన్ ప్రధానమైన మార్కెట్‌గా సంస్థ ముందుకు వెళుతున్నామని తెలిపారు. గత ఏడాదే స్టాక్ యార్డును విజయవాడ నగరంలో ప్రారంభించామని ఇప్పటి వరకు లక్షా 40వేల టన్నుల వ్యాపార కార్యకలాపాలను నిర్వహించినట్లు తెలిపారు. 1991లో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం ప్లాంట్ ఆధునీ కరణకు సంబంధించి సుమారు 4 వేల కోట్ల రూపాయలతో పనులను చేపట్టినట్లు తెలిపారు.

ప్రాథమిక రంగంలో 25.60 శాతం వృద్ధి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రాథమిక రంగంలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం 25.60 శాతం వృద్ధిని సాధించిందని, ఇది జాతీయ వృద్ధి కంటే 19.60 శాతం ఎక్కువగా ఉందని వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. గత ఏడాది వరి విస్తీర్ణం స్వల్పంగా తగ్గినప్పటికీ, దిగుబడి మాత్రం 5,176 కేజీలు పెరిగినట్లు తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై లఘు చర్చకు స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు బుధవారం అనుమతించారు. దీనిపై ఎమ్మెల్యేలు కిమిడి మృణాళిని, బీ చిరంజీవులు, బీ రమణమూర్తి, ఏ రాధాకృష్ణ తదితరులు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని వారు పేర్కొన్నారు. అదే సమయంలో రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వివరణ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచే వ్యవసాయానికి ప్రత్యేకంగా బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ ఏడాది అత్యధికంగా 19,070 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, ఆక్వారంగాల్లో జాతీయ వృద్ధి కంటే రాష్ట్ర వృద్ధే ఎక్కువగా ఉంటోందన్నారు. 2016-17లో ప్రాథమిక రంగంలో జాతీయ వృద్ధి రేటు 7.11 శాతంగా ఉండగా, 2017-18లో ఆరు శాతానికి పడిపోయిందన్నారు. అదే రాష్ట్ర వృద్ధి రేటు 2016-17లో 14.03 శాతం ఉండగా, అది 2017-18లో 25.60 శాతానికి పెరిగిందని, ఇందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే కారణమన్నారు. వరి, మొక్కజొన్నతోపాటు ఉద్యాన పంటలు, ఆక్వా రంగాల్లోనూ రాష్ట్రం జాతీయస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో ఉంటోందన్నారు. ఇక సుగంధ ద్రవ్యాల సాగులో మాత్రం రాష్ట్రమే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

దిగొచ్చిన బీసీసీఐ

'సేవ్‌కొచ్చి' యాష్ ట్యాగ్‌కు మద్దతు



కొచ్చి: 'సేవ్‌కొచ్చి' యాష్ ట్యాగ్‌తో సోషల్ మీడియా వేదికగా అభిమానులు చేసిన ఉద్యమానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) దిగొచ్చింది. ఈ మేరకు నవంబర్‌లో వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్ వేదికను మారుస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఒక మ్యాచ్‌ను కొచ్చి నగరానికి కేటాయించడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఫుట్‌బాల్‌కు గుర్తింపు పొందిన నెహ్రూ స్టేడియాన్ని క్రికెట్ కోసం పాడుచేయడం ఏమిటని పలువురు ఫుట్‌బాలర్లు, అభిమానులు కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ గతేడాది అండర్-17 ప్రపంచకప్ మ్యాచ్‌లు కూడా జరిగాయి. దీనికోసం స్టేడియంను 'ఫిఫా' ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు క్రికెట్ మ్యాచ్ నిర్వహించాలంటే మైదానంలో తవ్వకాలు, పెనుమార్పులు తప్పవని కొచ్చి వాసులు 'సేవ్‌కొచ్చి' యాష్ ట్యాగ్‌తో సోషల్ మీడియా వేదికగా ఉద్యమం చేశారు. ఈ ఉద్యమానికి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, ఫుట్‌బాల్ ఆటగాడు సునీల్ చెత్రీలు సైతం మద్దతు పలికారు. 'ఫిఫా గుర్తింపు పొందిన కొచ్చి స్టేడియానికి జరగబోయే నష్టం గురించి ఆందోళనగా ఉంది. అటు క్రికెట్, ఇటు ఫుట్‌బాల్ రెండింటికీ సమస్య రాకుండా వ్యవహరించాలని కేరళ క్రికెట్ సంఘాన్ని కోరుతున్నా. రెండు ఆటల అభిమానులు నిరాశ పడరాదు. దీనిపై వినోద్‌రాయ్‌తో కూడా మాట్లాడాను. ఆయన ఈ విషయాన్ని పరిశీలిస్తానని చెప్పారు' అని సచిన్ ట్వీట్ చేశాడు. దీంతో బీసీసీఐ తమ నిర్ణయాన్ని మార్చుకుంది.

ఆ విమర్శలకు బాధపడటం లేదు : శంకర్



న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో తనపై వస్తున్న విమర్శలపై బాధపడటం లేదని టీమిండియా యువ ఆలౌరౌండర్ విజయ్ శంకర్ అభిప్రాయపడ్డారు. నిదహాస్ ట్రోఫీ ఫైనల్లో తన జిడ్డు బ్యాటింగ్‌తో శంకర్ భారత్‌ను ఓటమి అంచులకు చేర్చగా దినేశ్ కార్తీక్ చివరి బంతిని సిక్సబాది గట్టెక్కించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శంకర్ బ్యాటింగ్‌పై అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విమర్శలపై శంకర్ స్పం దిస్తూ.. ఇలాంటి కామెంట్స్‌కు తాను చింతించడం లేదని, కానీ తన తల్లితండ్రులు, స్నేహితుల నుంచి వస్తున్న ఓదార్పు మెసెజ్‌లు చాలా ఇబ్బంది పెడుతున్నాయన్నాడు. టోర్నీమొత్తం బంతితో రాణించానని కానీ చివరి రోజు ఓ చెడు దినంగా మిగిలిపోయిందన్నాడు. అది మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నానని, కానీ సాను భూతి మెసేజ్‌లు మర్చిపోలేకుండా చేస్తున్నాయని, దీంతో చాలా కష్టంగా ఉందని తెలిపాడు. ఇక భారత్‌కు ఆడుతున్నప్పుడు అభిమానుల నుంచి ఇలాంటి విమర్శలు రావడం సహజమేనని చెప్పుకొచ్చాడు. మ్యాచ్ విన్నర్‌గా హీరో అయ్యే ఓ మంచి అవకాన్ని కోల్పోయానన్నాడు. జట్టులోని ప్రతి ఒక్కరు తనకు మద్దతుగా నిలిచారని, కెప్టెన్ రోహిత్, కోచ్ రవిశాస్త్రి ఇలాంటివి సహజమేనని చెప్పారని, దీంతో తన మనసు కొంత కదుట పడిందని ఈ చెన్నై క్రికెటర్ పేర్కొన్నాడు. అంతకు ముందు తాను ఆడిన టోర్నీల్లో బంతులను డాట్ చేయలేదని, ముష్ఫికర్ ఆ ఓవర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడన్నాడు. స్ట్రైక్ రోటేట్ చేయకుండా షాట్‌లకు ప్రయత్నించడం తప్పేనని ఒప్పుకున్నాడు. భారత జట్టులో చోటుదక్కే అవకాశంపై ఎలాంటి బెంగలేదని, మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే ఐపీఎల్ తనకు ఊరట కల్పించే అంశమని తన సత్తా నిరూపించుకుంటానని శంకర్ వ్యాఖ్యానించాడు. ఇక శంకర్ ఢిల్లీ డేర్ డెవిల్స్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.



సెరెనాలా రాలేనేమో..!

తల్లి అయిన తరువాత కెరీర్‌పై వోజ్నియాకి వ్యాఖ్య

న్యూయార్క్: సెరెనా విలియమ్స్‌లా తల్లి అయిన తరువాత మళ్లీ కెరీర్‌లోకి రావడం తనకు అసాధ్యమని ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి వోజ్నియాకి తెలిపింది. ఓ అవార్డు కార్యక్రమంలో పాల్గొనేందుకు కూతురు ఒలింపియాతో పాటు వచ్చిన సెరెనా విలియమ్స్‌ను చూసిన తరువాత వోజ్నియాకి పై విధంగా స్పందించింది. జీవితంలో మృత్యువు దాకా వెళ్లి పోరాడి వచ్చిన సెరెనాను తలచుకుంటే తనకు గర్వంగా ఉందని వోజ్నియాకి తెలిపింది. తను సెరెనాకు అత్యంత ఆప్త మిత్రురాలని పేర్కొంది. అయితే ఒకసారి సెరెనా పాత్రలో తనను ఊహించుకుంటే అది అసాధ్యమని, తనకు అంత శక్తి లేదని, సెరెనా ఓ అద్భుతమైన క్రీడాకారిణి అని ప్రశంసించింది. ఆమెకు ఆట అంటే ప్రాణమని, అదే ఇక్కడ వరకూ సెరెనాను నడిపించిందని ఆమె అభిప్రాయపడింది. 'ఒకరకంగా తనను చూస్తుంటే నాకు ఈర్ష్య కలుగుతోంది. 36 ఏళ్లు వచ్చినా, తన సామర్థ్యంలో ఎలాంటి మార్పు రాలేదు. అంటే తనకు ఆట మీద ఎంత కోరిక ఉంటే తను మళ్లీ రాగలదు' అని వోజ్నియాకి వివరించింది.

లైవ్‌లో 'నో డిలే'

ముంబై: భారత క్రికెట్ అభిమానులకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) శుభవార్త అందించింది. ఇంతకాలం హాట్‌స్టార్ వంటి డిజిటల్ యాప్స్‌లో వచ్చే మ్యాచ్ టీవీలో వచ్చే మ్యాచ్ కంటే ఐదు నిమిషాలు ఆలస్యంగా ప్రసారమయ్యేది. ఈ అవరోధాన్ని తొలగిస్తూ.. ఇకపై టీం ఇండియా ఆడే ప్రతి మ్యాచ్‌లు రెండు వేదికలపై ఒకేసారి ప్రసారమయ్యే విధంగా బీసీసీఐ చర్యలు చేపట్టింది. డిజిటల్ కంపెనీలను ప్రోత్సాహించే దిశగా బీసీసీఐ ఈ అడుగు వేసింది. ఇప్పటికే డిజిటల్ హక్కుల కనిష్ట ధరను రూ.7 కోట్లుగా బీసీసీఐ నిర్ణయించింది. దీంతో డిజిటల్ కంపెనీలు కూడా తమకు నష్టం రాకుండా అదే స్థాయిలో వేలానికి సిద్ధపడుతున్నాయి. అయితే బీసీసీఐ తాజా నిర్ణయంతో సోనీ టెలివిజన్, స్టార్ స్పోర్ట్స్ వంటి సంస్థలు షాక్‌కు గురయ్యాయి. రెండు మాధ్యమాల్లో ఒకేసారి మ్యాచ్ ప్రసారమైతే.. టీవీ హక్కులు కొనుగోలు చేసిన వారికి భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అయితే ఈ చర్య సంస్థ టెలివిజన్ హక్కుల కనిష్ట ధరను పెంచేందుకు తీసుకున్నదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ డిజిటల్ హక్కుల కోసం ఇప్పటికే పలు కంపెనీలు పోటీ పడుతున్నాయి.



స్మిత్ అసంతృప్తి..!

సిడ్నీ: అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసీసీ) దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాద నిషేధం ఎత్తివేయడంపై ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆసీస్‌తో జరిగిన రెండో టెస్టులో రబాద స్మిత్‌ను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టాడని తొలుత ఐసీసీ రెండు టెస్టుల నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీనిపై రబాద అప్పీల్ చేయగా విచారించిన అప్పీల్ కమిషనర్ మైకేల్ హెరాన్ నిషేధాన్ని ఎత్తి వేస్తూ రబాదకు అనుకూలంగా తీర్పునిచ్చాడు. దీంతో గురువారం నుంచి జరిగే మూడో టెస్టులో రబాద బరిలోకి దిగనున్నాడు. అయితే ఈ తీర్పును స్మిత్ తప్పుబట్టాడు. రబాద తనని ఉద్దేశపూర్వకంగానే ఢీకొట్టాడని, ఇది వీడియోలో స్పష్టంగా తెలుస్తోందన్నాడు. వికెట్ పడగొట్టిన తర్వాత బౌలర్ల ఆనందం తనకు తెలుసని, కానీ ఓవర్‌గా రియాక్ట్ కావడం అవసరం లేదని అభిప్రాయపడ్డాడు. ఇలాంటి విషయాల్లో ఐసీసీ కఠినంగా వ్యవహరించాలని సూచించాడు. విచారణలో తన వాదనలు వినకపోవడం ఆశ్చర్యం కలిగించిందని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఇక ఈ సిరీస్‌లో రబాద తన బౌలింగ్‌తో ఆసీస్ పతనాన్ని శాసిస్తున్నాడు. రెండు మ్యాచుల్లో ఏకంగా 15 వికెట్లు పడగొట్టాడు.

ధోనీ పాదాలను ముద్దాడిన అభిమాని



ముంబై: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి ప్రపంచ వ్యాప్తంగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. తమ అభిమాన క్రికెటర్‌పై తమకున్న ప్రేమను ధోని అభిమానులు చాలా సంద ర్భాల్లో చాటుకున్నారు. ఎన్నో అద్భుత ప్రదర్శనలతో ఈ జార్ఖండ్ బ్యాట్స్‌మన్ అభిమానుల మనసులను దోచుకున్నాడు. అందుకే మైదానంలో ధోని ఏం చేసినా అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతాయి. ఇటీవల లక్నోలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధోనికి ఓ లిటిల్ అభిమాని నుంచి ఊహించని సంఘటన ఎదురైంది. ధోని చేతుల మీదుగా బహుమతి అందుకోవడానికి వేదికపైకి వచ్చిన ఆ అభిమాని వస్తూనే ధోని కాళ్ల మీద పడుతూ.. పాదాలను ముద్దాడాడు. దీంతో అక్కడి వారంతా ఒక్కసారిగా ఆశ్చర్యానికిలోనయ్యారు. వెంటనే ధోని అతన్ని పైకి లేపి కౌగిలించుకొని మరీ ఓ సెల్ఫీ దిగాడు. అంతేగాకుండా ఓ చిన్న బ్యాట్‌ను బహుమతిగా అందజేశాడు. దీంతో ఆ అభిమాని ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తన ఆరాధ్యదైవమైన ధోని తన ముందుండటంతో ఆ చిన్నారి మరోసారి పాదాభివందనం చేశాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. ఇక గతంలో మ్యాచ్ జరుగుతుంటే కొంతమంది అభిమానులు ధోనికి ఇలా పాదాభివందనం చేసిన విషయం తెలిసిందే.

ఐపీఎల్ సంప్రదాయంలో మార్పు



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) పదేళ్ల సాంప్రదాయం ఈ ఏడాది జరుగనున్న 11వ సీజన్‌తో మారబోతుంది. ఇంతకాలం ఐపీఎల్ ఓపెనింగ్ వేడుకలో ఎనిమిది ఫ్రాంచైజీలకు చెందిన కెప్టెన్లు కనిపించేవారు. కానీ ఈ ఏడాది మాత్రం కేవలం ఇద్దరు కెప్టెన్లతోనే ఐపీఎల్ ఆరంభ వేడుక జరుగనుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది తొలి మ్యాచ్‌కి ముందే ఐపీఎల్ ఆరంభ వేడుకలు జరుగనున్నాయి. ఏప్రిల్ 7న వాంఖడే స్టేడియం వేదిక ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌కి ముందు ఈ సంబరాలు చేసేందుకు ఐపీఎల్ పాలక మండలి సిద్ధమైంది. అయితే కొందరు బీసీసీఐ సీనియర్ అధికారుల అలసత్వం కారణంగా ఎనిమిది మంది కెప్టెన్లు సరైన సమయంలో అక్కడకి చేరుకోలేకపోతున్నారు. ఇందుకోసం ఎనిమిది మంది కెప్టెన్లతో కలిసి ఏప్రిల్ 6వ తేది సాయంత్రం ఓ వీడియోని చిత్రీకరించనున్నారు. గత ఏడాది వరకూ ఆరంభ వేడుకల్లో ఎనిమిది మంది కెప్టెన్లు పాల్గొని 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్' గురించి ప్రతిజ్ఞ చేసేవారు. కానీ ఈ ఏడాది మాత్రం ముంబై కెప్టెన్ రోహిత్, చెన్నై కెప్టెన్ ధోనీ మాత్రమే ఇందులో పాల్గొననున్నారు. ఏప్రిల్ 8న మొహాలీలో ఢిల్లీ, పంజాబ్ మ్యాచ్ సాయంత్రం నాలుగు గంటలకు, కోల్‌కతా, బెంగళూరు మధ్య కోల్‌కతాలో మ్యాచ్ రాత్రి ఎనిమిది గంటలకు జరుగనుంది. దీనిపై బీసీసీఐ అధికారు ఒకరు మాట్లాడుతూ.. "ఐపీఎల్ టీం సరిగ్గా పని చేయడంలో విఫలమైంది. అశ్విన్, గంభీర్‌లను మ్యాచ్ ముందు రోజు మధ్యాహ్నం ముంబై రావాలని అహ్వానిస్తున్నారు. ఒకవేళ వాళ్లు ఆరంభ వేడుకలకు వస్తే.. వాళ్లు 7వ తేది రాత్రి 9 గంటలకు ఫ్లైట్ ఎక్కాల్సి ఉంటుంది. అది మిస్ అయితే.. వాళ్లు రోడ్డు మార్గం ద్వారా ఢిల్లీ చేరుకోవాల్సి వస్తుంది. సాయంత్రం 4గంటలకు మ్యాచ్ ఉండగా వాళ్లు రోడ్డు ప్రయాణం చేయడం ఎంతో ప్రమాదకరం. కోహ్లి, దినేశ్ కార్తీక్‌ల పరిస్థితి కూడా అంతే.. వాళ్లకి ఎనిమిది గంటలకు మ్యాచ్ ఉంది. ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగింది" అని పేర్కొన్నారు. కాగా దీనిపై బీసీసీఐ అధ్యక్షుడు సీకే ఖన్నా మాట్లాడుతూ.. "ఈ విషయం మా దృష్టికి రాలేదు. వస్తే ముందుగానే దీనిని పరిష్కరించేవాళ్లం. దీనికి పరిహారంగా ముందు రోజు వాళ్లతో ఓ వీడియో తీసి ఆరంభ వేడుకల్లో ప్రదర్శిస్తాం" అని తెలిపారు.



గట్టి పోటీ ఇస్తాం

టీ20 టీమిండియా మహిళా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్

న్యూఢిల్లీ: టీ20ల్లో తమకు అనుభవం లేకపోయినా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లకు గట్టి పోటీ ఇస్తామని టీ20 టీమిండియా మహిళా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్పష్టం చేసింది. టీ20 ముక్కోణపు టోర్నీ గురువారం నుంచి మొదలుకానున్నది. ఇంగ్లడ్, ఆస్ట్రేలియాలు బిగ్‌బాష్ లీగ్‌లో సత్తా చాటి మంచి ఊపుమీదున్నాయి. 'వారిలో అనుభవం ఉందని ఎలాంటి అనుమానం లేదు. ఎందుకంటే ఇప్పటికే వాళ్లు టీ20 ఫార్మాట్‌లో పలు మ్యాచ్‌లు ఆడుతున్నారు. వారితో పోల్చుకుంటే మాకున్న బలం చాలా తక్కువ. దానిమీదే రోజూ మేం కసరత్తు చేస్తున్నాం' అని తెలిపింది. 'ఇప్పటి నుంచి మాకు ఓ టీమ్‌గా నేర్చుకునే విధానం, అలాగే ప్రపంచ కప్‌కు సిద్ధమయ్యే తీరు, అలానే రోజూ వచ్చే సవాళ్లపైనే మా సాధన అంతా. మాకు తెలుసు వారిద్దరూ(ఇంగ్లండ్, ఆస్ట్రేలియా) టీ20ల్లో అనుభవజ్ఞులు. కానీ మేం పోటీ ఇచ్చేందుకు సిద్ధం' అని పేర్కొంది. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో వైట్‌వైష్‌కు గురవడంపై హర్మన్ మాట్లాడుతూ ఫీల్డింగ్‌లో లోపాల వల్లే తాము నష్టపోయామని తెలిపింది. 'టీ20 ఫార్మాట్‌లో ఎక్కడెక్కడ మేం మెరుగవ్వాలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. మరీ ముఖ్యంగా మేం ఫీల్డింగ్‌లో ఎక్కడ తప్పిదాలు చేస్తున్నామో తెలుసుకోవచ్చు. మీరు గనుక వన్డే సిరీస్‌ను చూస్తే ఫీల్డింగ్ లోపాలతో ఎక్కువ పరుగులు ఇచ్చేశాం' అని వివరించింది. 'అదే టీ20 సిరీస్‌లో అయితే మేం 100 శాతం న్యాయం చేసేందుకు, యువతులంతా ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నారని వివరించింది పోలీసు అధికారి అయిన కెప్టెన్ హర్మన్.

రేపు మమతను కలవనున్న షమి భార్య



కోల్‌కతా: టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ భార్య హసీన్ జహాన్ ఈనెల 23న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో భేటీకానున్నారు. షమీపై గృహహింస, వివాహేతర సంబంధాల ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఆమె శుక్రవారం సీఎంని కలవవచ్చునని టెలిఫోన్ ద్వారా సమాచారం అందించినట్టు ముఖ్యమంత్రి కార్యాలయంలోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 'ఈనెల 23 అనగా శుక్రవారం ముఖ్యమంత్రితో రాష్ట్ర అసెంబ్లీ వద్ద కలవాల్సిందిగా సూచించాం. కుటుంబ సభ్యులుగానీ తన లాయర్ లేకుండా ఒంటరిగా రావాలని స్పష్టంచేశాం' అని అధికారి వెల్లడించారు. సోమవారం జహాన్ కాళీఘాట్‌లోని మమత ఇంటికి వెళ్లి సీఎం అపాయింట్‌మెంట్‌ను కోరినట్టు చెప్పారు. హసీన్ అభ్యర్థనను పరిశీలించిన సీఎం తనతో సమావేశానికి తాజాగా అనుమతిని ఇచ్చారు. మెజిస్ట్రేట్ ఎదుట తన వాంగ్మూలం ఇచ్చిన వెంటనే జహాన్ సీఎం నివాసానికి వెళ్లినట్టు తెలిసింది. షమీకి అక్రమ సంబంధాలు ఉన్నాయని, ఆయన తనను వేధిస్తున్నాడని పేర్కొంటూ పోలీసుల వద్దకు వెళ్లిన జహాన్ ఆయనపై గృహహింస కేసు పెట్టారు. అంతేకాకుండా ఇంగ్లాడ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త ఒత్తిడి చేయగా అలిష్బా అనే పాకిస్థానీ మహిళ వద్ద నుంచి డబ్బును సైతం షమీ తీసుకున్నట్టు జహాన్ ఆరోపించారు. షమీ అవినీతికి పాల్పడినట్టు ఆరోపించిన జహాన్ తన ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా కొన్ని పత్రాలను క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ) చైర్మన్ వినోద్ రాయ్‌కు పంపినట్టు జహాన్ తరపు న్యాయవాది తెలిపారు. షమీపై కోల్‌కతా పోలీసులు 307, 498-ఏ, 376 సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారు. మరో ఐదుగురిపై 323, 506 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. మెజిస్ట్రేట్ ఎదుట జహాన్ ఇచ్చిన వాంగ్మూలం ప్రతిని కోల్‌కలా పోలీసులు సేకరించినట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తమ విచారణకు ఇది ఎంతగానో దోహదపడుతుందని, ఈ కేసు విచారణ కీలక దశలో ఉందని చెప్పారు.

రహదారుల దిగ్బంధానికి జనసేన మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఏపీ ప్రత్యేక హోదా సాధన కోసం అఖిలపక్షం నిర్వహించే జాతీయ రహదారుల దిగ్బంధానికి జనసేన సంపూర్ణ మద్దతు ఇస్తుందని పార్టీ అధికార ప్రతినిధులు అద్దెపల్లి శ్రీధర్, రియాజ్, మహేందర్‌రెడ్డి తెలిపారు. 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఉదయం 10గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా సాధన సమితి, ఇతర పక్షాల ప్రతినిధులు కూడా ఈ దిగ్బంధానికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తమ అధినేత పవన్ ఎవ్వరి రాజకీయాలకు అడ్డు రావడం లేదని, తమ అధినేత గురించి మాట్లాడే ముందు మంత్రి నారాయణ తన కళాశాలలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. పవన్‌పై ఆయన విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందనీ, ఆయన చిత్తశుద్ధి గురించి ప్రజలందరికీ తెలుసన్నారు. టీడీపీతో పవన్ ఉన్నప్పుడు బీజేపీ కనపడలేదా అని ప్రశ్నించారు. గంటా కూడా ఆయన శాఖపై దృష్టి పెడితే బాగుంటుందని, అంతే కాని ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తూ బాబు వద్ద తన పరపతి పెంచుకునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. మంత్రి అయ్యన్న తనయుడు ఏం చేస్తాడో అందరికీ తెలుసని, అదే సమయంలో మురళీమోహన్‌కి రాజధాని అమరావతిలో వస్తుందని ముందుగా ఏలా తెలుసని ప్రశ్నించారు. పవన్ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉందని దీని వల్ల ప్రజలకు మేలు జరుగుతుందనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. తమ పార్టీ ఎవ్వరికి దూరం కాదు అదే సమయంలో ఎవ్వరికి దగ్గర కూడా కాదనే విషయం గ్రహించాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి తనయుడు మంత్రి లోకేష్ అవినీతి వాస్తవాలను సమయం వచ్చినప్పుడు బయటపెడతామని జనసేన పార్టీ అధికార ప్రతినిధి అదేపల్లి శ్రీధర్ తెలిపారు. తమ నాయకుడు చేసిన ఆరోపణలకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. టీడీపీకి చెందిన 40మంది ఎమ్మెల్యేలు వారి పిల్లలు తమతో టచ్‌లో ఉన్నది వాస్తవమేనన్నారు. ఆ విషయం చంద్రబాబుకు కూడా తెలుసునన్నారు. అయితే టీడీపీకి తాము వెన్నుపోటు పొడవలేదని ఆయన చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లోకేష్ అవినీతిపై కేంద్ర ప్రభుత్వంతో విచారణ చేపట్టాలని డిమాండు చేశారు. పవన్‌ను విమర్శించే అర్హత టీడీపీ మంత్రులకు, నాయకులకు లేదని ముందుగా మంత్రులు తమ శాఖలపై దృష్టి సారిస్తే మంచిదని సూచించారు. టీడీపీ, బీజేపీ, వైసీపీలతో సమదూరం పాటిస్తూ ప్రజల సంక్షేమం కోసం తాము పోరాడతామని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద బుధవారం నల్లబ్యాడ్జీలతో మౌన ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక హోదా సాధన కోసం జనసేన కట్టుబడి ఉందని దీని కోసం దశల వారీగా కార్యక్రమాలు చేస్తామన్నారు. ముందుగా కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపాదించిందే పవన్ కళ్యాణ్ అనే విషయం ఇతర పార్టీల నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు.

మత రాజకీయాలు సహించం

పాట్నా: మత రాజకీయాలను తాను సహించబోనని బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ తన మిత్రపార్టీ బీజేపీని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుకు దోహదంచేసిన కూటమినుంచి వైదొలగి బీజేపీతో గత జూలైలో బంధం వేసుకున్న తర్వాత మొదటిసారి నితీష్ మౌనం వీడారు. జేడీయు నేత నితీష్ ఇటీవల హరారియా లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ నిర్వహించిన ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ఈ హెచ్చరిక చేసినట్లుగా తెలుస్తోంది. ఇది రెండుపార్టీల మధ్య విభేదాలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్‌డీఏలో చేరిననాటినుంచి నితీష్‌కు బీజేపీ పెద్దగా విలువ ఇవ్వడంలేదు. హరారియాలో నితీష్ ప్రభుత్వం తీసుకున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి ప్రచారం చేసినప్పటికీ ప్రయోజనం కలగలేదు. ఆర్‌జేడీ అభ్యర్థి ఇక్కడ నుంచి గెలుపొందారు. 2013లో ఎన్‌డీఏ నుంచి బైటకు వచ్చి ఆర్‌జేడీ, కాంగ్రెస్‌లతో కూటమిని ఏర్పాటుచేసి అధికారానికి వచ్చారు. జేడీయు కంటే ఆర్‌జేడీ అసెంబ్లీలో అధిక స్థానాలను గెలుపొందినప్పటికీ లాలూ ప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నకారణంగా నితీష్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. పశు దాణా కుంభకోణంలో లాలూప్రసాద్‌కు శిక్ష విధించిన నేపథ్యంలో నితీష్ కూటమి నుంచి తప్పుకుని ఎన్‌డీఏలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ వచ్చి చేరింది. తొలినుంచి కుల, మత సమీకరణలకు తాను వ్యతిరేకమని నితీష్ చెబుతూవచ్చారు. అయినప్పటికీ మత భావనలతో నిండి ఉన్న బీజేపీతో స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు. హరారియాలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నిత్యానందరాయ్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇక్కడ ఆర్‌జేడీ గెలుపొందితే, ఐఎస్ఐ కేంద్రంగా మారుతుందని చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి.

సర్పంచ్‌గా డాక్టర్

జైపూర్: ఎంబీబీఎస్ చదువుతున్న ఓ యువతి సర్పంచ్‌గా ఎన్నికై దేశం దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఎంబీబీఎస్ చేస్తూ రాజస్థాన్ స్థానిక సంస్థల ఎన్నికలో గెలుపొందిన 24ఏళ్ల షహనాజ్ ఖాన్ చరిత్ర సృష్టించింది. భరత్‌పూర్ జిల్లాలోని మియో ముస్లింల ఆధిక్యం గల ప్రాంతంలోని కమాన్ గ్రామ పంచాయతీకి జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా మార్చి 5న ఎంపికైంది. ఆమె మరో ఫీట్‌ను కూడా అందుకున్నారు. తమ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేసిన నాలుగో తరం వ్యక్తిగా గుర్తింపు సాధించింది. మియో ముస్లింల నుంచి తొలిసారి గెలుపొం దిన మహిళా ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత జైదా ఖాన్ కూతురు షహనాజ్ ఖాన్. అంతేకాదు భారతదేశంలో మూడు రాష్ట్రాలు రాజస్థాన్, హర్యానా, పంజాబ్‌ల నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన తొలి వ్యక్తి తయ్యబ్ హుస్సేన్ మనవరాలు కావడం విశేషం. 40ఏళ్ల నుంచి తన తాత హనీఫ్ ఖాన్ సర్పంచ్‌గా కొనసాగారని ఈ సందర్భంగా షహనాజ్ ఖాన్ వెల్లడించింది. మోరదాబాద్‌లోని మెడికల్ కాలేజ్‌లో డిగ్రీ చేస్తున్న షహనాజ్ ఖాన్ రాబోయే ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్, సర్పంచ్ బాధ్యతలు రెండింటిని ఎలా నిర్వర్తించగలరు అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. గురుగ్రామ్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తాను. మా గ్రామం నుంచి అక్కడికి గంటన్నర పాటు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రోజూ ఉదయం, సాయంత్రంతో పాటు ఆదివారాలు, సెలవు దినాల్లో ప్రజలకు సేవచేయడానికి సమయం



కేటాయిస్తానని షహనాజ్ తెలిపింది. ఆమె తాత హనీఫ్ ఖాన్ నకిలీ అకాడమిక్ డాక్యుమెంట్లను తయారు చేయడంలో నిందితుడిగా తేలడంతో ఆయన సర్పంచ్ పదవిని కోల్పోయారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి కొత్తగా తీసుకొచ్చిన చట్టం ప్రకారం పదోతరగతి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉండటంతో ఆమె పోటీ చేసి విజయం సాధించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.